

పరంజ్యోతి

# దైవలక్షణాలు.. అసురలక్షణాలు



దైవీ లక్షణాలు ముక్తిదాయకం. అసుర లక్షణాలు భవబంధ ప్రేరకాలు. దైవ లక్షణాలు కలిగినవారు తోటివారిపట్ల, సమస్త జీవుల పట్ల దయ, కరుణ, వాత్సల్యం కలిగి ఉంటూ ధన్యజీవులవుతారు. అసుర భావం కలవారు దుర్లభమైన మానవ జన్మను వృథా చేసుకోవడమేగాక.. సమాజమనే వృక్షాన్ని నిలువునా కూల్చివేసేందుకు ప్రయత్నిస్తారు. ఆ రెండు లక్షణాల గురించి భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఇలా వివరించాడు..

*అభయం సత్త్వసంశుద్ధిః జ్ఞానయోగ వ్యవస్థితిః*
*దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయస్తప ఆర్జవమ్*
*అహింసా సత్యమక్రోధః త్యాగః శాంతరపైశునమ్*
*దయా భూతేష్వలోలుప్త్వం మార్దవం హ్రీరచాపలమ్*
*తేజః క్షమా ధృతిః శౌచమద్రోహో నాతిమానితా*
*భవంతి సంపదం దైవీమభిజాతస్య భారత*

ఇవన్నీ దైవీ లక్షణాలు. వ్యక్తికి భయం అనర్థదాయకం, ధైర్యం కార్యసిద్ధి కారకం. మానవులకు బాహ్య శుద్ధి కన్నా అంతఃకరణ శుద్ధి ఎంతైనా అవసరం. అది శాశ్వతానందాన్ని ప్రసాదించి మరోజన్మలేని పరతత్వ స్థితిని చేర్చుతుంది. ఇంద్రియ నిగ్రహం, దానం, యజ్ఞం, పవిత్ర గ్రంథ పఠనం అన్ని విధాలా శ్రేయోదాయకం. ఇంకా.. ఎదుటివారిలో తప్పులను వెతక్కుండా ఉండడం, సర్వజీవుల పట్ల దయ, నిశ్చలత్వం, క్షమాగుణం, పరిశుభ్రత.. దైవీ లక్షణాలున్న వారిలో ఉంటాయి. అలాగే..

*దంభో దర్పోభిమానశ్చ క్రోధః పారుష్యమేవ చ*
*అజ్ఞానం చాభిజాతస్య పార్థ సంపదమాసురీమ్*

..దంభం, దర్పం, కోపం, పరుషంగా మాట్లాడటం, అజ్ఞానం, గర్వం ఇవన్నీ అసుర లక్షణాలని కూడా గీతలో భగవానుడు చెప్పాడు.

*అసత్యమప్రతిష్ఠం తే జగదాహురనీశ్వరం*
*అపరస్పర సంభూతం కి మన్యత్ కామ హైతుకం*

ఈ ప్రపంచానికి ఆధారమైంది ఏదీలేదని, భగవంతుడనేవాడు లేడని, కామ ప్రేరితులైన స్త్రీ- పురుషుల సంయోగం వల్ల సంతానం కలుగుతుంది కాబట్టి సృష్టికి కామమే కారణమని అసురలక్షణాలు గలవారు భావిస్తారు. అలాంటివారు ఆత్మను గూర్చి ఆలోచించరు. దేహభావనే వారికి సర్వస్వం. జగతిలో సమస్త జీవుల్లో ఉండే ఆత్మస్వరూపం ఒకటే అనే సద్భావం వారిలో ఉండదు. వారు తమ మానసాన్ని భిన్నత్వ భావనకు గురిచేసి, ఎదుటివారిపై క్రోధం, ద్వేషం పెంచుకొంటారు. స్వార్థం వారి దేహమంతటా నాట్యమాడుతుంటుంది. తమ కోరిక నెరవేరనప్పుడు అధర్మాచరణతో ఎంతటి దుర్మార్గానికైనా ఒడిగడతారు. జనన, మరణ, చక్రభ్రమణాన్ని కోరి తెచ్చుకొంటారు. అందుకే అసురలక్షణాలకు వీడ్కోలు.. దైవలక్షణాలకు స్వాగతం పలికి పరమేశ్వరుని అనుగ్రహానికి పాత్రులు కావాలి.

**- వల్లూరు చిన్నయ్య, 9948348918**

# ఎంతెంత దూరం?

- స్థానిక భవిష్యత్తుపై కొత్త చర్చ
- ఆర్డినెన్స్‌పై సభామోదం పొందాల్సిందే
- మండలిలో చుక్కెదురు ఖాయం
- అప్పుడు ఆర్డినెన్స్‌కు కాలం చెల్లినట్లే
- ఇప్పటిదాకా జరిగిన ప్రక్రియా రద్దు?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

కరోనా దెబ్బకు వాయిదా పడ్డ స్థానిక ఎన్నికలు... తిరిగి ఎప్పుడు జరుగుతాయి? ఆరు వారాల తర్వాతైనా కొత్త తేదీలు వస్తాయా? లేక... మరింత సమయం పడుతుందా? అదీకాకపోతే... మొత్తం ప్రక్రియనే తిరిగి ప్రారంభించాల్సిన అవసరం ఏర్పడుతుందా? రాజకీయ పార్టీలతోపాటు అధికార వర్గాల్లోనూ ఈ ప్రశ్నలపై తీవ్ర చర్చ జరుగుతోంది. దీనికి అనేక కారణాలున్నాయి. అన్నింటికంటే ముఖ్యమైనది... ఈ ఎన్నికల ప్రక్రియను ఒక ఆర్డినెన్స్ ద్వారా ప్రారంభించడం! రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ నిడివిని తగ్గించడంతోపాటు, పంచాయతీరాజ్ చట్టం-1994కు పలు సవరణలు చేస్తూ ఎన్నికల ముందు హడావుడిగా ఆర్డినెన్స్ తెచ్చింది. ఇప్పుడు... ఆ ఎన్నికల ప్రక్రియ కాస్తా వాయిదా పడింది. అయితే, బడ్జెట్ ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో ఈ నెలాఖరులోపు అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలు నిర్వహించాలి. అసెంబ్లీ మొదలైన రోజు నుంచి ఆరు వారాల్లోపు అప్పటికే ప్రకటించి అమలులో ఉన్న ఆర్డినెన్స్‌లకు ఉభయ సభల ఆమోదం పొందడం తప్పనిసరి. అసెంబ్లీని ఒక్కరోజు సమావేశ పరిచి, నిరవధిక వాయిదా వేసినా ఈ నిబంధన వర్తిస్తుంది. లేకపోతే సదరు ఆర్డినెన్స్‌లకు కాలం చెల్లిపోతుంది. అసెంబ్లీలో అధికార పక్షానికి తిరుగులేదు కాబట్టి పంచాయతీ రాజ్ సవరణ చట్టంపై జారీ చేసిన ఆర్డినెన్స్ ఇట్టే ఆమోదం పొందుతుంది. కానీ, మండలిలో మాత్రం చుక్కెదురు కావడం ఖాయం. వెరసి... ఆర్డినెన్స్ కథ ముగిసినట్లే. దీని ఆధారంగా మొదలుపెట్టిన ఎన్నికల ప్రక్రియను కూడా రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిలిపివేయక తప్పదని నిపుణులు చెబుతున్నారు. నామినేషన్ల ప్రక్రియతోపాటు ఏకగ్రీవాలు కూడా రద్దు అయినట్లే భావించాల్సి వస్తుందంటున్నారు.

### ప్రభుత్వం ముందున్న మార్గం...

ఆర్డినెన్స్‌కు కౌన్సిల్ ఆమోదం పొందడం కష్టమని ప్రభుత్వానికీ తెలుసు. అందువల్ల... బడ్జెట్ సమావేశాల తర్వాత అసెంబ్లీని ప్రోరోగ్ చేసి మళ్లీ ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చే అవకాశముంది. అయితే, పాత ఆర్డినెన్స్‌తో ఇప్పటికే మొదలుపెట్టిన ఎన్నికల ప్రక్రియను... మరో కొత్త ఆర్డినెన్స్‌తో కొనసాగించవచ్చా? లేదా? అనే ప్రశ్నకు భిన్నమైన సమాధానాలు వస్తున్నాయి. ఆర్డినెన్స్ నెంబర్, తేదీ మారుతున్నందున పాత తేదీల్లో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియ రద్దు చేయకతప్పదని కొందరు చెబుతున్నారు. అయితే, ఆ అవసరం ఉండదని మరికొందరు పేర్కొంటున్నారు. ఏదిఏమైనా... ఆర్డినెన్స్‌పై చట్టసభల్లో ఆమోదం పొందలేక, అదే అంశంపై మరో ఆర్డినెన్స్ జారీ చేయాల్సి రావడం మాత్రం ప్రభుత్వానికి తలవంపులు తెచ్చే అంశమవుతుందని చెబుతున్నారు.

### కరోనా గండం...

కరోనా కారణంగా ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్(ఎస్ఈసీ)ప్రకటించింది. ఆ తర్వాత ఎస్ఈసీని టార్గెట్ చేసుకుని సీఎంతోపాటు ఇతర అధికార పార్టీ నేతలు తీవ్రస్థాయిలో దూషణలు, ఆరోపణలు చేయడంతో విషయం మరో మలుపు తిరిగింది. కేంద్ర హోంశాఖకు ఎస్ఈసీ రాసిన లేఖతో... స్థానిక ఎన్నికల్లో జరిగిన దౌర్జన్యకాండపై ఢిల్లీలో చర్చ మొదలైంది. గవర్నర్ ద్వారా రాష్ట్రంలో నెలకొన్న పరిణామాలపై కేంద్రం ఆరా తీస్తోంది. దౌర్జన్యాలు, అక్రమాలు జరిగినట్లు కేంద్రం నిర్ధారణకు వస్తే... మొత్తం ఎన్నికల ప్రక్రియను తిరిగి ప్రారంభించాల్సిన పరిస్థితి వస్తుందనీ భావిస్తున్నారు.

# ఆరా ప్రారంభం!

(మొదటి పేజీ తరువాయి)

గౌతం సవాంగ్, సీఎంవో ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్‌లను రాజ్ భవన్‌కు పిలిపించారు. తమకు పిలుపు అందిన తర్వాత తొలుత ప్రవీణ్ ప్రకాశ్ అక్కడికి చేరుకున్నారు. ఆ తర్వాత సీఎస్, డీజీపీలు కొద్ది నిమిషాల తేడాతో అక్కడికి వెళ్లారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం... ఆయా అంశాలపై, మరీముఖ్యంగా ఎస్ఈసీ తన లేఖలో ప్రస్తావించిన ఘటనలు, వాటితో ముడిపడిన అంశాలపై పూర్తిగా ఆరా తీసినట్లు తెలిసింది. వారి మధ్య అధికభాగం హిందీలోనే చర్చ జరిగింది. దాదాపు గంటపాటు సాగిన ఈ సమావేశంలో... రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి, ఇప్పటి వరకూ స్థానిక ఎన్నికల్లో జరిగిన హింస, నమోదైన కేసులు తదితర అంశాలపై గవర్నర్ ఆరా తీశారు. రాయలసీమ, పల్నాడు ప్రాంతంలో 8 హత్యాయత్నం ఘటనలు జరిగాయని... 57 చోట్ల గొడవలు చోటు చేసుకున్నాయని... వాటిపై నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తున్నామని డీజీపీ వివరించారు. ఎస్ఈసీ లేఖతో సంబంధం లేకుండానే ఆయనకు భద్రత పెంచామన్నారు. ఏపీలో షిఫ్టుకు నలుగురు చొప్పున సాయుధ గన్‌మెన్‌ను కేటాయించామని, తెలంగాణ డీజీపీతో మాట్లాడి హైదరాబాద్‌లోని రమేశ్ కుమార్ నివాసం వద్ద ఏపీ పోలీసులతోపాటు తెలంగాణ పోలీసులను కూడా రక్షణగా నియమించామని వివరించారు. కేంద్ర హోంశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి ఈసీ కార్యాలయానికి సీఆర్పీఎఫ్ బలగాలతో భద్రత కల్పించామన్నారు.

### అప్పుడలా... ఇప్పుడిలా...

కరోనా వైరస్ విజృంభన తీవ్రంగా ఉన్నప్పటికీ, స్థానిక ఎన్నికలను యథాతథంగా నిర్వహించాలంటూ ఎస్ఈసీకి ఎందుకు లేఖ రాశారని సీఎస్ నీలం సాహ్నిని గవర్నర్ ప్రశ్నించినట్లు తెలిసింది. అప్పటికి పరిస్థితి ఇంత తీవ్రంగా లేదని, తర్వాతే రెండు పాజిటివ్ కేసులు బయటపడటంతో ఎక్కడికక్కడ చర్యలు తీసుకున్నామని సీఎస్ బదులిచ్చినట్లు సమాచారం. ఈసీకి లేఖ ఎందుకు రాయాల్సి వచ్చిందో మరింత క్షుణ్ణంగా ఆమె వివరించినట్లు తెలిసింది. ఇక... ప్రవీణ్ ప్రకాశ్ సీఎం తరఫున కొన్ని విషయాలను గవర్నర్‌కు వివరించినట్లు సమాచారం. ముగ్గురు చెప్పిన విషయాలను సావధానంగా విన్న గవర్నర్... కొన్ని ఫైళ్లు చూసి వాటిలో కొన్ని పేపర్లు అడిగి తీసుకున్నట్లు సమాచారం.

### ఇతర వర్గాల నుంచీ...

కేవలం రాష్ట్ర ప్రభుత్వ అధికారులపై మాత్రమే ఆధారపడకుండా... ఇతర వర్గాల నుంచి కూడా రాజ్‌భవన్ వర్గాలు కూపీ లాగుతున్నాయి. స్థానిక ఎన్నికల్లో అక్రమాలపై విపక్షాల నుంచి ఆధారాలు సేకరిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం అఖిలపక్ష నేతలు గవర్నర్‌ను కలిసి, రాష్ట్ర ప్రభుత్వం తీరుపై ఆయనకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత కొద్దిసేపటికే... 'స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీ దౌర్జన్యాలపై మీ వద్ద ముఖ్యమైన ఆధారాలు ఉంటే పంపించండి' అని రాజ్‌భవన్ వర్గాలు టీడీపీని కోరాయి. ఆయా ఆధారాలను టీడీపీ నేతలు గవర్నర్‌కు అందించారు. మొత్తానికి... అధికార, ఇతర వర్గాల ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా గవర్నర్ త్వరలో కేంద్రానికి ఒక సమగ్ర నివేదిక పంపనున్నట్లు తెలిసింది.

# రెడ్డి రాజ్యాన్ని నడిపిస్తూ ఇతరులపై విమర్శలా!: యనమల

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): "రాష్ట్రంలో రెడ్డి రాజ్యాన్ని నడిపిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇతరుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది. ప్రాధాన్యం ఉన్న పోస్టుల్లో 250 మందిని తన కులం వారిని నియమించుకొన్నారు. ఓ పక్క తను రెడ్డి రాజ్యం నడిపిస్తూ గిట్టనివారిపై కులాల పేరుతో దాడి చేస్తున్నారు. కుల రాజకీయాల గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేనేలేదు" అని శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు మండిపడ్డారు. గురువారం ఆయన మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాగా, 'కరోనా వైరస్ చైనాలో పుట్టింది కాబట్టి బతికిపోయాం. లేకపోతే ఆ వైరస్ పుట్టుకకూ చంద్రబాబే కారణమని జగన్ ప్రచారం చేసి ఉండేవారు' అని టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ఎగతాళి చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ఎన్నికల కమిషనర్ రమేశ్‌కుమార్‌ని రాజీనామా చేయాలనే అధికారం వైసీపీ నేతలకు లేదని మాజీ మంత్రి దేవినేని ఉమా అన్నారు. రాజధాని తరలింపుపై హైకోర్టు ఆంక్షలు అమల్లో ఉండగానే మే నెలాఖరుకు విశాఖ వెళ్లడానికి సిద్ధంగా ఉండాలని సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎలా చెబుతారని ఎమ్మెల్సీ అశోక్‌బాబు ప్రశ్నించారు. టీడీపీ అధికార ప్రతినిధి పంచుమర్తి అనురాధా ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

## నామినేషన్ ఉపసంహరణకు
# ఆగని బెదిరింపులు!

- వారం రోజులుగా అభ్యర్థి అదృశ్యం
- చిత్తూరు జిల్లాలో వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో కాంతమ్మ

మదనపల్లె క్రైం, మార్చి 19:స్థానిక సంస్థల ఎన్నికలు ఆరు వారాలు వాయిదా పడినా, నామినేషన్ల ఉపసంహరణకు అభ్యర్థులపై వైసీపీ నేతల బెదిరింపులు మాత్రం ఆగలేదు. ఆ బెదిరింపులకు విసిగివేసారి ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు యత్నించింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోదరుడు ద్వారకనాథ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గ కేంద్రంలో ఈ దారుణం జరిగింది. తంబళ్లపల్లెకు చెందిన బోరెడ్డిగారి రాజారెడ్డి భార్య బి.సుగుణమ్మ తంబళ్లపల్లె జడ్పీటీసీ స్థానానికి ఈనెల 11న స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ ఉపసంహరించుకోకుంటే జరగబోయే పరిణామాలకు తాము బాధ్యులంకామంటూ వైసీపీ నేతలు హెచ్చరిస్తుండటంతో ఆ మరుసటిరోజే సుగుణమ్మ దంపతులు ఊరు విడిచి వెళ్లిపోయారు. ఇంట్లో రాజారెడ్డి తల్లి కాంతమ్మ(64), ఆయన ఇద్దరు కుమార్తెలు మాత్రమే ఉన్నారు. సుగుణమ్మ ఆచూకీ చెప్పాలంటూ ఆ ఇంటి చుట్టూ తిరిగిన వైసీపీ నేతలు మఫ్టీ పోలీసులమంటూ కాంతమ్మను బెదిరించారు. ఆచూకీ చెప్పకుంటే జైలుకు పంపుతామని హెచ్చరించారు. తనకు తెలియదని ఎంత చెప్పినా, వినకుండా ఆమెను బలవంతంగా జీపులో ఎక్కించుకుని బంధువుల ఊళ్లన్నీ తిప్పారు. బెదిరింపులు తారస్థాయికి చేరడంతో మనస్తాపం చెందిన కాంతమ్మ గురువారం గోళ్లపల్లెవారిపల్లెలో బంధువుల ఇంటికెళ్లి గుళిక మందుతిని ఫోన్ ద్వారా ఆ విషయాన్ని రాజారెడ్డికి తెలిపి కిందపడిపోయింది. దీంతో హుటాహుటిన 108 వాహనంలో మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించారు. రాజారెడ్డి, సుగుణమ్మ దంపతులు ఆస్పత్రికి చేరుకొని కన్నీటి పర్యంతమయ్యారు. తమ కుటుంబానికి వైసీపీ నేతల నుంచి ప్రాణహాని ఉందని, పోలీసు అధికారులు స్పందించి రక్షణ కల్పించాలని రాజారెడ్డి కోరారు. వైసీపీ నేతలపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కాంతమ్మ డిమాండ్ చేశారు.

## కమిషనర్ లేఖ సంగతి తేల్చండి: వైసీపీ

అమరావతి/రేపల్లె/న్యూఢిల్లీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్నికల కమిషనర్ రమేశ్ కుమార్ కేంద్రానికి రాసినట్లు పత్రికలు, టీవీల్లో వచ్చిన వార్తలపై నిజానిజాలు తేల్చాలని డీజీపీ గౌతమ్ సవాంగ్‌కు వైసీపీ ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేశారు. మంగళగిరిలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు గురువారం సాయంత్రం వచ్చిన వారు డీజీపీని కలిసి వినతిపత్రం అందజేశారు. కాగా, రమేశ్‌కుమార్ మానసిక పరిస్థితి బాగాలేదని, ఆయనను తప్పించాలని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. కేంద్రం జోక్యం చేసుకుని ఆయన్ను తొలగించాలని మంత్రి మోపిదేవి కోరారు. తాజా పరిణామాలపై ఢిల్లీలో వైసీపీ ఎంపీలు మథనపడుతున్నారు. గురువారం పార్లమెంటు భవనంలో తమలో తాము అంతర్మథనం చేసుకున్నారు. కమిషనర్ రమేశ్ కుమార్ విషయంలో అతిగా, చౌకబారుగా తాము ప్రవర్తించి ఉండాల్సింది కాదని ఓ ఎంపీ అభిప్రాయపడ్డారు. ప్రపంచమంతా కరోనాతో అట్టుడికిపోతుంటే స్థానిక ఎన్నికలు వాయిదా వేయడాన్ని ఎవరైనా సమర్థిస్తారని, తాము కూడా హుందాగా ఆరు వారాల తర్వాత ఎన్నికలకు సిద్ధమైతే బాగుండేదని మరో ఎంపీ పేర్కొన్నారు. ఎన్ని వారాల తర్వాత జరిగినా గెలుపు తమదేనన్న ధీమా వ్యక్తం చేయాలి గానీ.. పిచ్చెక్కినట్లు వ్యవహరించడం వల్ల ఆంధ్రలో బిహార్ తరహా పరిపాలన సాగుతున్నట్లు ఢిల్లీలో ప్రచారం జరుగుతోందని ఇంకో ఎంపీ ఆవేదన చెందారు. ఎన్నికల వాయిదాను సుప్రీంకోర్టు సమర్థించడం, భద్రతపై ఆందోళన వ్యక్తంచేసిన రమేశ్‌కుమార్‌కు కేంద్రమే రక్షణ కల్పించాల్సి రావడం జగన్‌కు చుక్కెదురేనని మరో ఎంపీ చెప్పారు. 'కరోనాపై ప్రధాని మోదీ ప్రకటన తర్వాత నిమ్మగడ్డ హీరో అయ్యారు.. మా వాడు జీరో అయ్యాడు' అని ఇంకో వైసీపీ ఎంపీ వ్యాఖ్యానించారు. జగన్ ప్రభుత్వం 9 నెలల్లో తన ప్రతిష్ఠను పూర్తిగా దిగజార్చుకుందని.. దీనివల్ల తమకు ఢిల్లీలో విలువ లేకుండా పోతోందని కొందరు వైసీపీ ఎంపీలు వాపోయారు.



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ, కాంగ్రెస్, సీపీఐ నేతలు

## ఎస్ఈసీ కార్యాలయానికి
# సీఆర్పీఎఫ్ భద్రత

- హైదరాబాద్‌లో రమేశ్ నివాసానికి ఆంధ్ర, తెలంగాణ పోలీసుల రక్షణ
- కేంద్రానికి లేఖతో రాష్ట్ర పోలీసుల అలర్ట్
- హుటాహుటిన గన్‌మెన్‌తో రక్షణ

అమరావతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కార్యాలయానికి సీఆర్పీఎఫ్ భద్రత కల్పించారు. తనకు, తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందంటూ కమిషనర్ రమేశ్‌కుమార్ పేరిట కేంద్రానికి అందిన లేఖ గట్టిగానే పనిచేసింది. విజయవాడలోని ఎస్ఈసీ కార్యాలయంలో గురువారం కేంద్ర సాయుధ బలగాలు మోహరించాయి. అలాగే హైదరాబాద్‌లోని రమేశ్ కుమార్ నివాసం వద్ద ఆంధ్ర, తెలంగాణ పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. కరోనా తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఆంధ్రలో స్థానిక సంస్థల ఎన్నికలను ఎస్ఈసీ రమేశ్‌కుమార్ వాయిదా వేయడంతో సీఎం జగన్ మొదలుకొని అధికార వైసీపీ నేతలు ఆయనపై విరుచుకుపడ్డారు. అయితే ఎన్నికల వాయిదాను సుప్రీంకోర్టు సమర్థించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పెద్దల అసహనాన్ని చూస్తే.. తనపైనా, తన కుటుంబ సభ్యులపైనా భౌతికదాడులు జరిగే అవకాశాలున్నట్లు స్పష్టంగా అర్థమవుతోందని.. హైదరాబాద్‌లో ఉండడమే క్షేమమని అనిపిస్తోందని ఆయన పేరిట కేంద్రానికి లేఖ అందింది. కేంద్ర బలగాలతో రక్షణ కల్పించాలని ఆ లేఖలో కోరారు. ఇదే విషయమై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ సైతం కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. ఈ పరిణామాల నేపథ్యంలో డీజీపీ గౌతమ్ సవాంగ్.. కేంద్ర హోంశాఖ కార్యదర్శికి లేఖ రాశారు. దీనిపై కేంద్ర హోంశాఖ అధికారులు స్పందించి.. గన్నవరం సీఆర్పీఎఫ్ 39వ బెటాలియన్‌కు చెందిన సిబ్బందితో ఎన్నికల సంఘ కార్యాలయం వద్ద భద్రతను ఏర్పాటు చేశారు. ఒక ఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్, 8 మంది కానిస్టేబుళ్లను నియమించారు.

### నలుగురు చొప్పున..

ఎన్నికల కమిషనర్ వ్యక్తిగత భద్రతపై రాష్ట్ర శాంతిభద్రతల అధికారులతో సమీక్షించిన డీజీపీ.. ఒక్కో షిఫ్ట్‌కు ఇద్దరు చొప్పున ఏఆర్ పోలీసులను రక్షణగా ఏర్పాటు చేశారు. నిరంతరం ఇద్దరు గన్‌మెన్ రమేశ్‌కుమార్‌కు భద్రతగా ఉంటారు. అయితే హైదరాబాద్‌లోని ప్రశాసన్ నగర్‌లో నివాసం ఉండే ఆయనకు అక్కడి పోలీసులతో మాట్లాడి మరో ఇద్దరు సిబ్బందితో భద్రత ఏర్పాటు చేయించారు. తెలంగాణ డీజీపీ మహేందర్‌రెడ్డితో బుధవారం రాత్రే సవాంగ్ మాట్లాడారు. హుటాహుటిన గన్‌మెన్‌తో రక్షణ కల్పించారు.

### అవును.. రిప్రజెంటేషన్ అందింది..

రక్షణ కోసం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నుంచి రిప్రజెంటేషన్ అందిందని కేంద్ర హోం శాఖ ధ్రువీకరించింది. భద్రత పెంపు కోరుతూ కమిషనర్ లేఖ రాశారన్న విషయమై వివాదం నెలకొనడంతో నీరజ్‌కుమార్ గూడపాటి అనే వ్యక్తి బుధవారం ఆర్‌టీఐ కింద హోం శాఖకు దరఖాస్తు చేశారు. దానిపై ఆ శాఖ కార్యదర్శి కార్యాలయం అదే రోజున జవాబిచ్చింది. రమేశ్‌కుమార్ నుంచి రిప్రజెంటేషన్ అందిందని.. దానిని, ఆర్‌టీఐ దరఖాస్తును హోంశాఖ సంయుక్త కార్యదర్శి కార్యాలయానికి పంపించామని తెలిపింది.



ఎస్ఈసీ రమేశ్ కుమార్ భద్రత కోసం వచ్చిన సీఆర్పీఎఫ్ బలగాలు

# జగన్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

- ఆయన సీఎంగా ఉంటే ప్రతిపక్షాలకు భద్రత లేదు
- రాష్ట్రపతి పాలన విధించాలి
- కేంద్ర బలగాల సమక్షంలో ఎన్నికలు నిర్వహించాలి
- గవర్నర్‌కు విజ్ఞప్తి చేసిన అఖిలపక్ష నేతలు

విజయవాడ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): "జగన్ సీఎంగా ఉండగా రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహిస్తే ప్రజలకు, ఇతర పార్టీలకు భద్రత ఉండదు. జగన్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలి. కేంద్ర బలగాల సమక్షంలో ఎన్నికలను నిర్వహించాలి" అని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళా వెంకట్రావు, టీడీఎల్పీ ఉపనేత కె.అచ్చెన్నాయుడు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగాధర్ తదితరులతో కూడిన అఖిలపక్ష బృందం విజయవాడ రాజభవన్‌లో గవర్నరు విశ్వభూషణ్ హరిచందన్‌ను గురువారం కలిశారు. స్థానిక ఎన్నికలు జరిగిన తీరును గవర్నర్‌కు వివరించారు. వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం నేతలు మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగ వ్యవస్థలో ఉన్న ఎన్నికల కమిషనర్ రమేశ్ కుమార్‌పై సీఎం జగన్మోహన్‌రెడ్డి సామాజిక దాడి చేయడం సిగ్గు చేటన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును అమలు చేయడానికి ఎన్నికల కమిషనర్ భయపడుతున్నారని వాపోయారు. "తనకు ప్రాణహాని ఉందని ఎన్నికల కమిషనర్ లేఖ రాశారు. మంత్రులు, పోలీసులను సీఎం జగన్మోహన్‌రెడ్డి రెచ్చగొడుతున్నారు. దీంతో వాళ్లంతా ప్రతిపక్ష అభ్యర్థులను బెదిరించి ఏకగ్రీవాలు చేయించారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ ప్రజాస్వామ్యబద్ధంగా జరగలేదు. వాటిన్నింటిని పరిశీలించి గవర్నరు సానుకూలంగా స్పందిస్తారని భావిస్తున్నాం. బలవంతంగా జరిగిన ఏకగ్రీవాలను రద్దు చేయాలి. ఎన్నికలకు మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వాలి. ఎన్నికల నిర్వహణకు ఇంకా సమయం ఉన్నందున బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయాలి" అని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. పారాసిటమల్ సిద్ధాంతాన్ని పక్కనపెట్టి సీఎం... కరోనా వ్యాప్తి చెందకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలి. పరీక్షా కేంద్రాలను పెంచి అన్ని జాగ్రత్తలనూ తీసుకోవాలి. కేసీఆర్ నుంచి అరువు తెచ్చుకున్న బ్లీచింగ్ విధానాలను జగన్ వదిలిపెట్టాలి అని వారు డిమాండ్ చేశారు.

## లోకం తీరు




మన సారే... ఎండలో కూర్చోవడం కుదరలేదట! అందుకే మాస్క్ పెట్టుకున్నారు...

## ఉత్తర కోస్తాలో వానలు

విశాఖపట్నం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం మొత్తం ఇప్పుడిప్పుడే ఎండలు ముదురుతుంటే... ఉత్తర కోస్తా ప్రాంతంలో మాత్రం వర్షాలు కురుస్తున్నాయి! మూడు రోజుల నుంచి ఉరుములు, మెరుపులు, పిడుగులు, అక్కడక్కడా వడగళ్లతో వర్షాలు పడుతున్నాయి. కొన్నిచోట్ల ఈదురుగాలులు వీస్తున్నాయి. వీటిని ప్రీమాన్‌సూన్ వర్షాలుగా నిపుణులు భావిస్తున్నారు. ఒకవైపు బంగాళాఖాతంలో అధికపీడనం కొనసాగుతుండగా... సముద్రం నుంచి తేమగాలులు భూఉపరితలంపైకి వీస్తుండడం, అదే సమయంలో ఎండలు ఎక్కువగా ఉండడంతో వాతావరణంలో అనిశ్చిత నెలకొంది. ఈ ప్రభావంతో క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడి ఈదురుగాలులు, పిడుగులు, వడగళ్లతో వానలు కురుస్తున్నాయి. గురువారం విశాఖ ఏజెన్సీలోని జి.మాడుగుల, అనంతగిరి, పెదబయలు మండలాల్లో వడగళ్లు పడ్డాయి. మాకవరపాలెం మండలం వెంకన్నపాలెంలో ఎనిమిది సెంటీమీటర్ల భారీ వర్షపాతం నమోదైంది. ఇంకా కొత్తవలస, ఉత్తరావల్లిలో ఆరు, అనంతగిరి, రావికమతంలో ఐదు, బుచ్చెయ్యపేట, ఎల్.కోటలో నాలుగు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మరో 24 గంటలు ఉత్తర కోస్తాలో ఉరుములు, పిడుగులతో వర్షాలు కురుస్తాయని, ఒకటి, రెండుచోట్ల భారీవర్షాలు కురుస్తాయని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం డైరెక్టర్ విజయభాస్కర్ తెలిపారు.



### ఆయుర్వేదిక్ టూత్‌పేస్ట్‌తో మొటిమల నివారణ

మొటిమల నివారణకు నేను ఆయుర్వేదిక్ టూత్ పేస్ట్‌నే వాడతాను. అందులో లవంగం నూనె ఉండటంతో సమర్థవంతంగా పని చేస్తుంది. మొటిమలకు నేను ఎన్నడూ అల్లోపతి వైద్యం చేయించుకోలేదు. ఇలా చెప్తే నా డాక్టరు స్నేహితులు విమర్శిస్తారని నాకు తెలుసు.

**- ప్రీతమ్ ముండే, బీజేపీ ఎంపీ, డెర్మటాలజిస్టు**



### ఆయుర్వేదంపై ప్రపంచం ఆసక్తి

భారత్‌లో పుట్టిన ఆయుర్వేదంపై ప్రపంచమంతా ఇప్పుడు ఆసక్తి కనబరుస్తోంది. ఆయుర్వేద ప్రచారంపై 14 దేశాలు సంతకాలు చేశాయి. 28 కేంద్రాల ద్వారా 58 దేశాల్లో ఆయుర్వేదంపై ప్రచారం నిర్వహిస్తున్నాం.

**- శ్రీపద్ యెస్సో నాయక్, కేంద్ర మంత్రి**



### ప్రతికూల, పరిపూర్ణ ఆలోచనలు రెండూ ఆరోగ్యానికి మంచివి కావు

సిడ్నీ, మార్చి 19: కొందరు ప్రతీ చిన్న విషయానికి అతిగా ఆందోళన చెందుతారు. మరి కొందరు ఏ పని చేసినా పరిపూర్ణంగా ఉండాలని కోరుకుంటారు. ఈ రెండు రకాల ఆలోచనా విధానాలు మానసిక ఆరోగ్యానికి మంచిది కాదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పిల్లల్లో ఈ ఆలోచన విధానం నిద్రలేమికి కారణమవుతోందన్నారు. ఫలితంగా వయసు పెరుగుతున్న కొద్దీ వారిలో ఇది తీవ్ర మానసిక సమస్యలకు దారితీస్తుందని చెప్పారు. 400 మంది టీనేజర్లపై అధ్యయనం నిర్వహించిన ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు ఈ వివరాలను స్లీప్ అనే జర్నల్‌లో ప్రచురించారు. నిద్రలేమి, డిప్రెషన్ కారణంగా పిల్లల ఏకాగ్రత దెబ్బతింటోందని, ఇది చదువు పైన తర్వాత జీవితంపైనా ప్రతికూల ప్రభావం చూపుతుందని చెప్పారు.

### సొంతంగా నిర్ణయాలు తీసుకునే టీనేజర్లలో నేర స్వభావం తక్కువ

వాషింగ్టన్, మార్చి 19: "నీ స్నేహితులెవరో చెప్పు నువ్వు ఎలాంటి వాడివో చెప్తా.." అనే మాట శాస్త్రీయంగా కూడా నిజమేనని అమెరికా శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడైంది. నేర స్వభావం ఉన్నవారు సానుకూల ఆలోచనలు ఉన్న వారితో స్నేహం చేస్తే వారిలో ఆ స్వభావం తగ్గుతుందని పరిశోధకులు చెప్పారు. తమకు సంబంధించిన నిర్ణయాలను సొంతంగా తీసుకొనగలిగే, సాధికారత ఉన్నట్లు భావించే టీనేజర్లు లైంగిక వేధింపులకు తక్కువగా పాల్పడతారని చెప్పారు. శాస్త్రవేత్తలు 2,232 మంది టీనేజర్లపై అధ్యయనం నిర్వహించి ఈ వివరాలను వెల్లడించారు.

# టీడీపీ రాష్ట్ర కార్యాలయంపై గురి



ఆత్మకూరులోని టీడీపీ రాష్ట్ర కార్యాలయం,



గుంటూరులోని జిల్లా టీడీపీ కార్యాలయాన్ని ఆక్రమిత ప్రభుత్వ స్థలంగా ఊటంకిస్తూ పేపర్ వర్క్ ప్రారంభించిన అధికారులు

- కూల్చివేతకు పడుతున్న అడుగులు
- గుంటూరులోని కార్యాలయంపైనా కన్ను
- వీటిని కూల్చి స్థలాలు ప్రభుత్వపరం చేసే వ్యూహం
- తహసీల్దార్ ఇంట్లో వరుస సమావేశాలు
- ఆళ్ల డైరెక్షన్..చకచకా ఫైల్స్‌లో కదలిక!

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయం, నిన్న మొన్నటి వరకు ఆ సేవల కోసం వినియోగించుకొన్న గుంటూరులోని జిల్లా కార్యాలయాన్ని కూల్చివేసి, వాటి పరిధిలోని స్థలాలను స్వాధీనం చేసుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్టు సమాచారం. అధికార పార్టీ నేతల ఫిర్యాదు మేరకు ఈ స్థలాలను ప్రభుత్వపరం చేసే కసరత్తును అధికారులు ఇప్పటికే మొదలుపెట్టినట్టు తెలుస్తోంది. గుంటూరు జిల్లా మంగళగిరి ప్రాంతంలోని ఆత్మకూరు గ్రామంలో టీడీపీ రాష్ట్ర కార్యాలయం ఉంది. ఎన్నికలకు ముందే ఈ భవన నిర్మాణం జరిగింది. టీడీపీ నేతల విజ్ఞాపన మేరకు గత ప్రభుత్వంలో ఈ కార్యాలయం కోసం మూడున్నర ఎకరాల వాగు పోరంబోకు స్థలాన్ని కేబినెట్ కేటాయించింది. 33 ఏళ్ల లీజు ప్రాతిపదికన ఈ స్థలాన్ని మంజూరు చేసింది. టీడీపీ ప్రభుత్వం హయాంలోనే ఆ ప్రాంతాన్ని చదును చేసుకొని..భవన నిర్మాణం పూర్తి చేసుకొన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతనే ఈ కార్యాలయం నుంచి టీడీపీ రాష్ట్ర వ్యవహారాలు మొదలయ్యాయి. అప్పటిదాకా టీడీపీ రాష్ట్ర కార్యాలయం గుంటూరు నగరంలోని జిల్లా పార్టీ ఆఫీస్‌లో కొనసాగింది. ఇప్పుడు ఈ రెండు కార్యాలయాలపై అధికార పార్టీ నేతల కన్నుపడినట్టు తెలుస్తోంది. ప్రజావేదిక కూల్చివేతకు అప్పట్లో ఒక పరంపరగా ఫిర్యాదులు చేసిన వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డే ఇప్పుడు వీటి తొలగింపు ప్రక్రియలో చురుగ్గా ఉంటున్నట్టు సమాచారం. మంగళగిరి ప్రాంతంలో ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు కూడా లేకపోవటంతో ఆళ్ల ఇదే పనిలో నిమగ్నమయ్యారని అంటున్నారు. దీనిపై స్థానిక తహసీల్దార్ ఇంట్లో గత వారం రోజులుగా పలు మార్లు సమావేశాలు జరిపినట్టు తెలిసింది. విశేషమేమిటంటే.. ఈ తహసీల్దార్ నివసించే ఆ ఇల్లు కూడా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిదే. అయితే, ఈ వ్యవహారానికి వత్తాసు పలికేందుకు తొలుత తహసీల్దార్ వెనుకంజ వేశారని తెలిసింది. వేరే విభాగం నుంచి వచ్చిన ఈ అధికారికి తహసీల్దార్‌గా ఇదే తొలి పోస్టింగ్ కావటం, ఎమ్మెల్యే ఒత్తిడి దానికి తోడు కావడంతో చివరకు పేపర్ వర్క్ ప్రారంభించినట్లు సమాచారం! గుంటూరులోని రాష్ట్ర పార్టీ పాత కార్యాలయం కూల్చివేతకు కూడా ఎమ్మెల్యే ఆళ్ల ఫిర్యాదు ఆధారంగానే అధికారులు పావులు కదుపుతున్నారని తెలిసింది. అరండల్‌పేటలోని పిచుకలగుంటగా పేరొందిన ప్రాంతంలో 20 ఏళ్ల క్రితం ఈ ఆఫీసును నిర్మించుకున్నారు. అప్పట్లో ఈ ప్రదేశం ఎందుకూ పనికిరాకుండా 18 అడుగుల లోతు గుంతలతో ఉండేది. అందుకే పిచుకలగుంటగా పేర్కొనేవారు. మున్సిపాలిటీకి చెందిన సుమారు రెండు వేల గజాల స్థలాన్ని ఆనాడు 30 ఏళ్లకు లీజు ప్రాతిపదికన తీసుకొని బాగు చేసుకున్నారు. ఆ గుంటలు పూడ్చేందుకు అప్పట్లోనే రూ.లక్షల్లో వ్యయమైంది. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో దీనిని క్రమబద్ధీకరించుకొనే అవకాశం ఉన్నప్పటికీ మున్సిపాలిటీకి అద్దె చెల్లించే విధానంతోనే నడిపించుకుంటూ వచ్చారు. ప్రస్తుతం ఏడాదికి సుమారు రూ.25 వేలు అద్దె చెల్లిస్తున్నారు. ఎమ్మెల్యే ఆళ్ల ఫిర్యాదుతో మున్సిపల్, పట్టణ అభివృద్ధి పరిపాలన విభాగం ఉన్నతాధికారులు ఈ కార్యాలయం తొలగింపుపై కసరత్తు ప్రారంభించారని, ఆక్రమిత స్థలంగా పేర్కొని.. దానిని స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం.



గుంటూరులోని జిల్లా టీడీపీ కార్యాలయం



అధికారులతో సమీక్షిస్తున్న సీఎం జగన్

## కొత్తగా 9 చోట్ల ఫిషింగ్ హార్బర్లు : సీఎం జగన్

అమరావతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కొత్తగా 9 చోట్ల ఫిషింగ్ హార్బర్లు నిర్మించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం మౌలిక సదుపాయాల కల్పనపై సీఎం సమీక్షించారు. మత్స్యకారుల జీవన ప్రమాణాలను పెంచేందుకు కీలక చర్యలు తీసుకోవాలని ఈసందర్భంగా అధికారులను సీఎం ఆదేశించారు. కొత్తగా 9 చోట్ల రెండు విడతల్లో 2901.61 కోట్ల రూపాయలతో ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం జరుగుతుందని అన్నారు. కాగా, ప్రకాశం జిల్లాలో విమానాశ్రయ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. భోగాపురం విమానాశ్రయానికి సంబంధించి మిగిలిన భూసేకరణ పనులు చేపట్టాలన్నారు.

## షెడ్యూల్ ప్రకారమే టెన్త్, ఇంటర్ పరీక్షలు

- విద్యార్థికి, విద్యార్థికి నడుమ మీటరు దూరం ఉండాలి
- జలుబు, దగ్గు ఉన్న వారిని వేరుగా పరీక్ష రాయించాలి
- 31 వరకు విద్యాసంస్థలు మూసేయాలి
- ఉల్లంఘించినవారిపై కఠిన చర్యలు: మంత్రి సురేశ్

అమరావతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్ పరీక్షలు ముందు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ ప్రకటించారు. గురువారం సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇంటర్ పరీక్షలు ప్రస్తుత షెడ్యూల్ ప్రకారమే కొనసాగుతాయని, టెన్త్ పరీక్షలు ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 17 వరకు జరుగుతాయని తెలిపారు. పదో తరగతి విద్యార్థులు పరీక్ష రాసే సమయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్ని పరీక్షా కేంద్రాలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. విద్యార్థికి, విద్యార్థికి మధ్య కనీసం మీటరు దూరం ఉండాలని, జలుబు, దగ్గు లక్షణాలున్న విద్యార్థులను వేరుగా కూర్చోబెట్టి పరీక్ష రాయించాలని చెప్పామని తెలిపారు. ఇంటర్ పరీక్ష పేపర్లు దిద్దే అధ్యాపకులకు కూడా జాగ్రత్తలు సూచించామని చెప్పారు. కరోనా వ్యాప్తి నేపథ్యంలో యూనివర్సిటీలు, డీమ్డ్, డీమ్డ్ టు బీ, ప్రైవేటు యూనివర్సిటీలు సహా విద్యాసంస్థలన్నిటినీ 31వ తేదీ వరకు మూసేస్తున్నట్లు తెలిపారు. ఈ ఆదేశాలు పాటించని విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేంద్రం ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యాసంస్థలు అక్కడ జరిగే పరీక్షల సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ పలు సూచనలు జారీ చేసినట్లు చెప్పారు. 'రాష్ట్రంలో కరోనా వ్యాప్తి నియంత్రణకు సీఎస్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ ఆదేశాలను అందరూ విధిగా పాటించాలి. విద్యాసంస్థలకు సెలవులు ఇచ్చిన నేపథ్యంలో విద్యార్థులంతా ఇళ్లలోనే ఉండాలి. బయటకు ఎక్కడకూ వెళ్లకూడదు. విద్యాసంస్థల్లోని టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయి' అని తెలిపారు. కరోనా వైరస్ అనుమానం ఉన్న వ్యక్తులు 104 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

## కుప్పం విమానాశ్రయ ప్రతిపాదనలు ఉపసంహరణ

న్యూఢిల్లీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కుప్పంలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం అభివృద్ధికి ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరి వెల్లడించారు. గతంలో ప్రతిపాదించి తిరిగి వెనక్కి తీసుకుందని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి కుప్పం, మదనపల్లిలో ఎయిర్‌పోర్టుల అభివృద్ధికి ఎటువంటి ప్రతిపాదనలూ అందలేదని తెలిపారు. లోక్‌సభలో వైసీపీ ఎంపీ ఎన్.రెడ్డప్ప అడిగిన ఓ ప్రశ్నకు కేంద్ర మంత్రి గురువారం ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. అయితే, కుప్పంలో ఎయిర్‌స్ట్రిప్ ఉందని, కానీ నిర్మాణ పనులు చేపట్టలేదని పేర్కొన్నారు. భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు కేటాయించిందని, అందులో రూ. 16.34 కోట్లను వినియోగించారని వివరించారు. అంతేకాకుండా, అక్కడ అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.60 లక్షల కేటాయించిందని, కానీ వినియోగించుకోలేదని తెలిపారు.

## 'అంచనాల' సభ్యులుగా కేశినేని, మాగుంట

న్యూఢిల్లీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు అంచనాల కమిటీ సభ్యులుగా టీడీపీ ఎంపీ కేశినేని నాని, వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు లోక్‌సభ సచివాలయం బులెటిన్ విడుదల చేసింది. మొత్తం 30 మంది ఉండాల్సిన కమిటీకి ఎన్నికలు నిర్వహించగా... గడువు ముగిసేలోగా 28 నామినేషన్లు వచ్చాయని, దాంతో నామినేషన్లు వేసిన అందరూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ప్రకటించింది. మిగతా ఇద్దరి సభ్యుల కోసం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ కమిటీ పదవీకాలం మే 1 నుంచి ప్రారంభమై 2021 ఏప్రిల్ 30న ముగుస్తుందని స్పష్టం చేసింది.

## వాటే పిటీ: సీపీఐ నారాయణ

- రన్‌వే మరమ్మతులతో విమానాలు ఆలస్యం

తిరుపతి సిటీ, మార్చి 19: 'వాటే పిటీ?' అంటూ తిరుపతి విమానాశ్రయ అధికారులపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం మధ్యాహ్నం 12.45 గంటలకు ఆయన హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో తిరుపతి బయలుదేరారు. తిరుపతి విమానాశ్రయంలో రన్‌వే మరమ్మతులు జరుగుతుండటంతో ల్యాండ్ చేయకుండా చెన్నైకి తీసుకెళ్లారు. మధ్యాహ్నం 2.30 గంటలకు చెన్నైలో ల్యాండ్ అయ్యింది. తిరిగి 3.00 గంటల తర్వాత అక్కడ బయలు దేరి 4.00 గంటలకు తిరుపతి చేరింది. దీనిపై నారాయణతోపాటు పలువురు ప్రయాణికులూ అసంతృప్తి వ్యక్తం చేశారు. 'రన్‌వే కొత్తది. అతి తక్కువ కాలంలోనే దెబ్బతినడం మన దౌర్భాగ్యం. కాంట్రాక్టరు ఏ మాత్రం నాణ్యత పాటించాడో అర్థమవుతోంది' అని నారాయణ పేర్కొన్నారు. రన్‌వే మరమ్మతుల కారణంగా పలు విమానాలు ఆలస్యంగా నడిచాయి.

## డిగ్రీలో కొత్త పాఠ్యప్రణాళిక

- యూనివర్సిటీల వీసీల సమావేశంలో నిర్ణయం

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలల్లో 2020-21 విద్యా సంవత్సరం నుంచి అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ కోర్సుల్లో కొత్త (రివైజ్డ్) పాఠ్య ప్రణాళిక అమలు కానుంది. చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం (సీబీసీఎస్) కింద బీఏ, బీకాం, బీఎస్సీ తదితర యూజీ కోర్సుల్లో సవరించిన పాఠ్యప్రణాళికను వర్తింపజేస్తారు. అడ్మిషన్లు ఆన్‌లైన్ విధానంలో చేపట్టడంతోపాటు లోపభూయిష్టంగా తయారైన అఫిలియేషన్ (అనుబంధ) విధానాన్ని సంస్కరించనున్నారు. వర్సిటీలు, వాటి అనుబంధ కాలేజీల్లో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేస్తారు. గురువారం మంగళగిరిలోని రాష్ట్ర ఉన్నత విద్యామండలిలో జరిగిన విశ్వవిద్యాలయాల వైస్ చాన్సెలర్ల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని అన్ని వర్సిటీలకు కామన్ అకడమిక్ క్యాలెండర్ వర్తింపచేయాలని, ఆన్‌లైన్ అడ్మిషన్ల కోసం వర్సిటీ కోఆర్డినేటర్‌ను నియమించాలని నిర్ణయించారు. అప్రెంటిస్‌షిప్ కోసం ఇన్‌స్టిట్యూట్లను/పరిశ్రమలను గుర్తించాలని, నైపుణ్య ఆధారిత విద్య మరియు అప్రెంటిస్‌షిప్ కోసం వర్సిటీ స్థాయిలో కోఆర్డినేటర్‌ను నియమించాలని సమావేశంలో నిర్ణయానికొచ్చారు. స్టూడెంట్ డేటా బేస్ నిర్వహణ, జీరో అడ్మిషన్, 25% కంటే తక్కువ అడ్మిషన్లు ఉన్న కాలేజీలకు డీ అఫిలియేషన్ చేయడంపైనా చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్, ఉన్నత విద్య స్పెషల్ సీఎస్ సతీశ్ చంద్ర, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, కళాశాల విద్య కమిషనర్ ఎం.ఎం.నాయక్ పాల్గొన్నారు.

### అన్ని వర్సిటీల్లోనూ 'కరోనా' చర్యలు

కరోనా వైరస్ నియంత్రణ, నివారణ చర్యలకు ఉన్నత విద్యాశాఖ ఉపక్రమించింది. రాష్ట్రంలోని ప్రైవేటు, డీమ్డ్, సెంట్రల్ యూనివర్సిటీలు అన్నీ కరోనా మహమ్మారి పట్ల విద్యార్థులను అప్రమత్తం చేయాలని సూచించింది. ఉన్నత విద్యాసంస్థలు తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించి వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ గురువారం విడుదల చేసిన ఉత్తర్వులను అమలు చేయాలని తెలిపింది.

## విజయవాడ డివిజన్‌లో 4 ప్రైవేటు రైళ్లు!

విజయవాడ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మంచి లాభాలు తెచ్చిపెట్టే విజయవాడ రైల్వే డివిజన్‌లోని రూట్లలో దశల వారీగా ప్రైవేటు రైళ్లను నడపడానికి రంగం సిద్ధమవుతోంది. కాకినాడటౌన్-లింగంపల్లి, లింగంపల్లి-విశాఖపట్నం, విజయవాడ-సికింద్రాబాద్, కాకినాడ-తిరుపతి రైళ్లు ఈ ప్రతిపాదనల్లో ఉన్నట్లు సమాచారం.

## 'అక్షయ గోల్డ్' నిందితులకు 1 వరకు రిమాండ్ పొడిగింపు

చిత్తూరు లీగల్, మార్చి 19: అక్షయ గోల్డ్ ఫామ్స్ అండ్ విల్లాస్ నిందితులకు ఏప్రిల్ ఒకటో తేదీవరకు రిమాండ్ పొడిగించారు. అధిక వడ్డీలు చెల్లిస్తామని, ఇంటి స్థలాలు అందజేస్తామని చెప్పి ప్రజలనుంచి భారీ స్థాయిలో నగదు డిపాజిట్లను సేకరించిన అక్షయ గోల్డ్ నిర్వాహకులపై కేసు నమోదు కాగా...ప్రకాశం జిల్లాకు చెందిన శ్రీనివాసరావు, పుల్లారావు, రమేష్, శ్రీనివాసరావు, వెంకట్రావు, అనంతపురానికి చెందిన మంజుల ఈనెల ఐదో తేదీన చిత్తూరు జిల్లా కోర్టులో లొంగిపోయిన విషయం విదితమే.

## దంతెవాడలో నక్సల్ ఎన్‌కౌంటర్

రాయ్‌పూర్, మార్చి 19: ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో ఓ నక్సల్‌ను భద్రతా దళాలు ఎన్‌కౌంటర్ చేశాయి. గంపూర్ గ్రామంలో గురువారం ఉదయం ఈ ఎన్‌కౌంటర్ జరిగిందని బస్తర్ రేంజ్ ఐజీ పి.సుందర్ రాజ్ చెప్పారు. డీఆర్‌జీ(జిల్లా రిజర్వు గార్డ్), ఎస్టీఎఫ్(ప్రత్యేక టాస్క్ ఫోర్స్), సీఆర్‌పీఎఫ్ బలగాలు సంయుక్తంగా నక్సల్ ఏరివేత ఆపరేషన్ చేపట్టాయని, గంపూర్ అటవీ ప్రాంతంలో నక్సల్స్ తారసపడటంతో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. అనంతరం అక్కడ ఓ నక్సల్ మృతదేహాన్ని, కొన్ని మజిల్ లోడింగ్ గన్‌లు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గాలింపు ఆపరేషన్ కొనసాగుతోందని తెలిపారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

కొనకనమిట్ల, మార్చి 19: అప్పులబాధ తాళలేక ప్రకాశం జిల్లాలో గురువారం ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. కొనకనమిట్ల మండలం పెదారికట్ల గ్రామానికి చెందిన బాపతి చెన్నారెడ్డి(30)కి 20 ఎకరాల పొలం ఉంది. పొలం తండ్రి పేరుపై ఉంది. ఈ నేపథ్యంలో తండ్రికి తెలియకుండా సొంతానికి రూ.7లక్షలకుపైగా అప్పు చేశాడు. అప్పు తీర్చలేక, తండ్రికి తెలిస్తే ఏమంటాడోననే భయంతో మనస్తాపం చెందేవాడు. కాగా.. రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో చెన్నారెడ్డి గురువారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకున్నాడు. సమాచారం అందుకుని ఎస్ఐ వెంకటేశ్వరనాయక్ సంఘటన స్థలం చేరుకుని మృతికిగల కారణాలను తెలుసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



ట్రాక్టర్‌పై తీసుకువచ్చి కోడిగుడ్లను విక్రయిస్తున్న రైతులు



# గుడ్డు ఢమాల్!

- భారీగా పడిపోయిన ధర
- 30గుడ్ల అట్ట రూ.60కే విక్రయం
- నేడు మరింత తగ్గే అవకాశం
- లారీలు, ట్రాక్టర్లపై తీసుకువచ్చి... గ్రామాల్లో పెద్దఎత్తున అమ్మకాలు

తణుకు, మార్చి 19 : గుడ్ల ధరలు భారీగా పతనమయ్యాయి. పౌల్ట్రీ పరిశ్రమను కరోనా కోలుకోలేని దెబ్బ కొట్టింది. ఈ వైరస్‌తో ఎలాంటి సంబంధం లేకున్నా ధరలు మాత్రం దారుణంగా పడిపోయాయి. వారం నుంచి తగ్గుతూ వచ్చిన గుడ్డు ధర ప్రస్తుతం రూ.2కు పడిపోయింది. అయినా కూడా కొనుగోలు చేసే నాథుడే లేడని రైతులు వాపోతున్నారు. శుక్రవారానికి ఈ రేటు రూ.1.75కు తగ్గొచ్చని అంచనాతో ట్రేడర్లు అదే ధరకు అడుగుతున్నట్లు చెబుతున్నారు. తాడేపల్లిగూడెం, నల్లజర్ల పరిసర ప్రాంతాల్లో పౌల్ట్రీ యజమానులు లారీలు, ట్రాక్టర్లలో గుడ్లు తీసుకువచ్చి 30గుడ్ల అట్ట రూ.60చొప్పున అమ్ముతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. కరోనా తీవ్రత నేపథ్యంలో ట్రేడర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తమిళనాడు, కర్ణాటక, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో గుడ్డు ధర రూ.1కి పడిపోయిందని, ఎక్కువ ధరకు కొనుగోలు చేయలేమంటూ చేతులెత్తేస్తున్నారు. దీంతో ఇప్పటికే తీవ్ర నష్టాల్లో ఉన్న రైతులు వచ్చిన ఉత్పత్తిని ఏం చేయాలో తెలియక గందరగోళ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

### తగ్గిన గుడ్ల ఉత్పత్తి

కోటి కోళ్లు ఉంటే సాధారణంగా 80లక్షల గుడ్లు ఉత్పత్తి అవుతుంటాయి. వాటిలో 20లక్షల వరకూ స్థానికంగా వినియోగించుకున్నా మిగిలినవి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం గుడ్డు ధర అంతకంతకూ దిగజారిపోవడంతో రైతులు కోళ్లను అయినకాడికి అమ్ముకోవడంతో పాటు మేత తగ్గించుకుంటున్నారు. దీంతో గుడ్ల ఉత్పత్తి భారీగా తగ్గిపోయింది. వచ్చే మూడు నాలుగు రోజుల్లో గుడ్ల ఉత్పత్తి సగం వరకూ తగ్గిపోయే అవకాశాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు.

## కోడి ఫ్రీ...!

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల పరిసరాల్లో గురువారం ఉచితంగా కోళ్లను పంపిణీ చేశారు. అయితే కరోనా వైరస్ సోకుతుందేమోనన్న భయంతో ఉచితంగా ఇచ్చినా కూడా కొందరు కోళ్లను తీసుకునేందుకు వెనుకాడుతున్నారు. - ఎచ్చెర్ల

## చికెన్‌దీ అదే దారి...

చికెన్ ధర సైతం పతనం దిశగా పయనిస్తోంది. కేజీ రూ.10కే అమ్ముకునే పరిస్థితి రావడంతో ప్రతి కోడికి రూ.150 వరకూ రైతుకు నష్టం వాటిల్లుతోంది. వెయ్యి కోళ్లు పెంచుకున్న రైతుకు రూ.1.50లక్షల వరకూ నష్టం వస్తుండటంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చికెన్ విక్రయాలు భారీగా పడిపోవడంతో రైతులు ఉన్న కోళ్లను మేపలేక, అయిన కాడికి అమ్ముకుంటున్నారు.



## మోదీ మాట

కరోనాపై పోరులో ఏమాత్రం అలసత్వం కూడదంటూ ప్రధాని నరేంద్రమోదీ మెత్తని మాటలతో గట్టి హెచ్చరికలే చేశారు. కరోనాకు మందు, మార్గాంతరం లేని స్థితిలో పౌరులు చిత్తం వచ్చినట్టు కాక, సమష్టి బాధ్యతతో నడుచుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నేను అడిగింది మీరెప్పుడూ కాదనలేదు, సాధించిందంతా మీ సహకారంతోనే అంటూ ప్రజల చేయూతను కాంక్షించారు. ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటున్నది విస్పష్టంగా చెబుతూనే, యావత్ ప్రపంచాన్ని ముంచెత్తుతున్న ఈ వ్యాధికి భారత్ అతీతమన్న ధైర్యం ఏమాత్రం కూడదని హెచ్చరిక చేశారు. కరోనా సమస్యను రెండు ప్రపంచయుద్ధాలకంటే పెద్దదని గుర్తుచేస్తూ, ప్రపంచయుద్ధాల పొగలూ సెగలూ సోకని దేశాలు కూడా ఉన్నాయి కానీ, కరోనా చుట్టుముట్టనివి లేవని హెచ్చరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలు గౌరవిస్తూ, సూచనలు పాటిస్తూ ప్రతీ ఒక్కరూ తాము క్షేమంగా ఉంటూ తద్వారా ఈ దేశాన్నీ ప్రపంచాన్నీ కూడా రక్షించాలని విజ్ఞప్తిచేశారు.

దేశ నాయకుడిగా మోదీ అరగంట పాటు చేసిన ఈ ప్రసంగం ఈ సంక్షోభ కాలంలో కచ్చితంగా ప్రజల్లో విశ్వాసం పెంచుతుంది. ఆయన మొఖంలో రవ్వంత ఆందోళనైనా కనిపించనట్టే, ప్రసంగం కూడా ప్రజల్లో ఎటువంటి భయాలూ కలిగించలేదు. సంయమనంతో, దృఢ సంకల్పంతో, పరస్పర సహకారంతో ముందుకు సాగితే ఈ మహమ్మారిమీద నెగ్గుకు రావచ్చునన్న ధైర్యాన్ని ఇచ్చింది. చెప్పిన జాగ్రత్తలు అనేకం విన్నవే కావచ్చును కానీ, ప్రధాని విజ్ఞప్తి ప్రభావం కచ్చితంగా ప్రజలమీద ఉంటుంది. ధైర్యంతో పాటుగానే పరిస్థితి తీవ్రతను తెలియచెప్పడానికి ఆయన సంకోచించలేదు. కరోనా ఏ మాత్రం లేదనో, అంతా సవ్యంగా ఉన్నదనో నిన్నమొన్నటి వరకూ నమ్మిన దేశాలు కూడా ఒక్కసారిగా భగ్గుమన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. వచ్చే ఆదివారం ఆయన ప్రకటించిన జనతాకర్ఫ్యూ అసలు లక్ష్యం రాబోయే సంక్షోభానికి మనని మనం సంసిద్ధం చేసుకోవడానికే. ఉదయం ఏడునుంచి రాత్రి తొమ్మిది గంటలవరకూ ఇళ్ళకే పరిమితమై తలెత్తబోయే పరిస్థితులకు మనలను అలవాటు పడమన్నారు. జనం కోసం జనమే విధించుకొనే ఈ కర్ఫ్యూ ప్రజలకు పరస్పరం దూరంగా ఉండటాన్ని అలవాటు చేస్తుంది. అవసరం లేనిదే బయటకు రాకండి, ఉద్యోగాలు, వ్యాపారాలు ఇంటినుంచే చేసుకోండి, ఆపరేషన్ల వంటివి వాయిదా వేసుకోండి వంటి సూచనలన్నీ ప్రజలను మానసికంగా సమాయత్తం చేస్తాయి. ఆదివారం సాయంత్రం సైరన్ సూచన వెంటనే ప్రజలంతా చప్పట్లు చరుస్తూ కరోనాపై పోరాడుతున్న సమస్త వ్యవస్థలకూ సంఘీభావం ప్రకటించాలన్నది మంచి సూచన. ప్రజలను ఈ పోరాటంలో మమేకం చేయడానికీ, సమష్టిగా పోరాడుతున్నామన్న భావన కలిగించడానికీ ఇది ఉపకరిస్తుంది.

నిజానికి నరేంద్రమోదీ జాతినుద్దేశించి ప్రసంగించబోతున్నారని తెలియగానే ప్రజలు తమ గత అనుభవాల రీత్యా అనేకం ఊహించుకున్నారు. మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటిస్తారనీ, ఇందిరమాదిరిగా దేశాన్ని అత్యయిక స్థితికి తెస్తారనీ, లాక్‌డౌన్ అంటారనీ ఏవేవో గాలి వార్తలు చక్కర్లు కొట్టాయి. గురువారం రాత్రి ప్రధాని ప్రసంగించబోతున్నట్టుగా రోజు ముందే అధికారిక ప్రకటన వెలువడం కూడా ప్రజల్లో కొన్ని అనుమానాలు రేకెత్తించింది. కొందరు ముందు జాగ్రత్త పేరిట ఏటీఎంల నుంచి డబ్బు విత్‌డ్రా చేయడం, నెలా రెండు నెలలకు సరిపడా సరుకులు కొనిపారేయడం వంటివి జరిగాయి. ఈ ప్రసంగం విన్న తరువాత అనేకుల మనసులు కచ్చితంగా తేటపడి ఉం టాయి. మందులు, అత్యవసరాలకు ఏలోటూ రాబోదని హామీ ఇస్తూ, హడావుడి కొనుగోళ్ళు ఎంతమాత్రం కూడదని ప్రధాని హితవు చెప్పారు. కఠినమైన చర్యలు ప్రకటించకుండా ఇలా కేవలం హితవు చెప్పినందువల్ల ప్రయోజనం ఏముంటుందని నిట్టూరుస్తున్నవారూ ఉన్నారు. ఎంతటి విపత్తులోనూ ప్రజలు తమకు తాముగా బాధ్యతాయుతంగా నడవరన్నది వారి వాదన. మరీ ముఖ్యంగా మోదీ తన ప్రసంగంలో లాక్‌డౌన్ వినా మరేం మాట్లాడినా ప్రయోజనం ఉండదని ట్వీట్ చేసిన మాజీ కేంద్రమంత్రి చిదంబరానికి ఈ ప్రసంగం కచ్చితంగా నిరాశ కలిగించి ఉంటుంది. ప్రధాని ప్రసంగానికి కాస్తముందు కరోనా వ్యాప్తి నియంత్రణకు ప్రభుత్వం మరిన్ని నిర్ణయాలు ప్రకటించింది. తన ఉద్యోగులకు సైతం ఇంటినుంచి పనిచేయగలిగే వెసులు బాటు కల్పించింది. కరోనా విషయంలో దేశం ప్రస్తుతం రెండో దశలో ఉన్నదనీ, ఇకపై స్థానిక వ్యాప్తిని గుర్తించడం, నిరోధించడం కష్టమేమీ కాదని కొందరి వాదన. చాలా దేశాల మాదిరిగా ప్రజాసమూహాలకు పెద్ద ఎత్తున పరీక్షలు నిర్వహించే విషయంలో మనం విఫలమైనందున తీవ్ర ప్రమాదం పొంచివున్నదని మరికొందరి భయం. దేశం ఒక పెద్ద విపత్తు ఎదుర్కొంటున్న స్థితిలో విజయమే లక్ష్యంగా రాజకీయపక్షాలూ ప్రజలూ సంఘటితంగా, బాధ్యతాయుతం వ్యవహరించడం ముఖ్యం.

# మంచి సమయం మించిపోయిందా?

అవి సమగ్రమైన చర్యలు కాకపోవచ్చు కానీ, భారత దేశం కరోనా వైరస్ విషయంలో సహేతుకంగా మంచి కృషే చేసింది. ఎయిర్‌పోర్టుల్లో స్క్రీనింగ్ కావచ్చు, క్వారంటైన్ కావచ్చు, ప్రజలకు అవగాహన కల్పించడం కావచ్చు, వైరస్ సోకిన వారి గుర్తింపు కావచ్చు.. ఇలా ఏ విషయంలోనైనా చెప్పుకోదగిన చర్యలు చేపట్టింది. చేయాల్సినదంతా చేస్తోంది. అయినా, కరోనా సామూహికంగా వ్యాప్తి చెందితే, దేశం నియంత్రించలేనన్ని కేసులు విస్ఫోటనంలా పెరుగుతాయని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అటువంటిది జరగొద్దని కోరుకుందాం. కానీ, వ్యాధి నిర్ధారణ సౌకర్యాలు సరిగ్గా లేకపోవడం వైరస్ విస్తరించే ప్రమాదముంది. ఈ సౌకర్యాలను పెంచడంలో 'నిదానం' ఎందుకో అర్థం కావడం లేదు. వనరులు లేక పోవడమా, చేస్తున్నది సరిపోతుందన్న భావనా, లేక కరోనా కేసుల సంఖ్యను కృత్రిమంగా తక్కువ చేసి చూపడంలో భాగమా?.. ఈ అన్నీ కూడా కారణాలే కావచ్చు.

ఐసీయూల్లో చేరిన శ్వాసకోశ వ్యాధిగ్రస్తుల్లో 500 మందికి 'ర్యాండమ్'గా టెస్టులు జరిపితే కరోనా లేనట్లు తేలిందని ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చి (ఐసీఎంఆర్) ప్రకటించింది. ఈ కారణంగా కరోనా లక్షణాలు కనిపించినప్పటికీ నిర్ధారణ పరీక్షలు జరప నిరాకరించడాన్ని సమర్థించుకోలేం. నా స్నేహితుడొకాయన తనకు కరోనా లక్షణాలున్నాయని భావించి ప్రభుత్వ హెల్ప్‌లైన్‌కు రోజంతా ఫోన్ చేయగా చేయగా చివరాఖరికి లైన్ కలిసింది. రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రికి వెళ్లండి అని చెప్పారు. తీరా అక్కడికెళితే 'ట్రావెల్ హిస్టరీ' లేకపోవడం, అంటే విదేశాల్లో పర్యటించకపోవడం, పర్యటించిన వారితో సంబంధాలు లేవన్న కారణంతో ఆయనకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయనిరాకరించారు. ఆయన ఒక్కడినే కాదు, చాలామందిని ఇలాగే వాపసు పంపించారు. వీరిలో ఏ ఒక్కరు కరోనా సోకిన వారున్నా కూడా ఏమవుతుంది? తనకు వ్యాధి లేదన్న ధీమాతో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల వారు వైరస్ వ్యాప్తికి దోహదం చేసే ప్రమాదముంది.

కరోనా రోగులు విపరీతంగా పెరుగుతోన్న చాలా దేశాలు ఇలాంటి తప్పిదమే చేశాయి. ఇరాన్‌తో సరిహద్దు కలిగిన టర్కీలో ఇప్పటి వరకూ కేవలం రెండు కేసులే నమోదయ్యాయంటే, వారు 'అనుమానితుల'కు నిర్ధారణ పరీక్షలు జరపడంలో క్రియాశీలంగా వ్యవహరించడమే కారణం. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించడం వల్లనే అమెరికాలోనూ కేసులు అనూహ్యంగా పెరిగిపోతున్నాయి. (భారత దేశం టర్కీ నుంచి వచ్చే పర్యాటకులపై నిషేధం విధించింది కానీ, అమెరికా నుంచి వస్తున్న వారిపై నిషేధం లేకపోవడం ఆశ్చర్యకరం).

వ్యాధి నిర్ధారణ పరీక్షలను విస్తృతంగా కొనసాగిస్తున్న దేశాలు, ప్రాంతాలే కరోనా వ్యాప్తిని కట్టడి చేసి, కేసులను తగ్గించగలిగాయి. ఇలా టెస్టుల నిర్వహణలో క్రియాశీలంగా ఉన్న దక్షిణ కొరియా, తైవాన్, సింగపూర్, జపాన్, హాంగ్‌కాంగ్‌లు, కరోనా సోకిన వారికి చికిత్సలు అందించేందుకు అవసరమైన డాక్టర్లు, వైద్య సిబ్బంది, క్వారంటైన్, తదితర సర్వ సౌకర్యాలను కూడా సిద్ధంగా ఉంచాయి.

చాలా కేసుల్లో వ్యాధి లక్షణాలు కనిపించక పోవడం వల్ల ముందస్తు సామూహిక వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ప్రాథమిక దశలో జరిపే నిర్ధారణ పరీక్షల వల్లనే కరోనాను కట్టడి చేసే అవకాశం లభిస్తుంది. వైరస్ వ్యాప్తిని నివారించగలిగిన దేశాలకు, పరీక్షలు చేస్తున్నా కూడా నివారించలేకపోతున్న దేశాలకు ఈ విషయంలోనే తేడా ఉంది. వ్యాధిగ్రస్తులను గుర్తించలేకపోవడం వల్ల పిల్లలు, వృద్ధులు వంటి దుర్బలురకు కరోనా సులభంగా సోకుతోంది. దక్షిణ కొరియాలో జరుపుతున్న సామూహిక పరీక్షల్లో తేలిన విషయమేమిటంటే, కరోనా సోకిన చాలామంది పిల్లల్లో ఈ వ్యాధి లక్షణాలు అతి స్వల్పంగా కనిపిస్తున్నాయి, లేదా అసలు కనిపించడమే లేదు. ఇటువంటి వారిని గుర్తించి ఒంటరిగా (ఐసొలేషన్‌లో) ఉంచడం వల్ల వైరస్ వ్యాప్తిని నిరోధించడమే కాదు, మరణాల సంఖ్యను కూడా తగ్గించగలుగుతున్నారు. కరోనా లక్షణాలు కనిపించని పేషెంట్లను గుర్తించి 'ఐసొలేషన్'లో పెట్టడం అనేది ఇటలీలో కూడా మంచి ఫలితాలను ఇస్తోంది. 'వో' అనే పట్టణంలోని మొత్తం 3,300 మందికి రెండు సార్లు సామూహికంగా నిర్ధారణ పరీక్షలు జరపారు. వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి 'ఐసొలేషన్'లో పెట్టడం ద్వారా ఆ ప్రాంతంలో కరోనా వ్యాప్తిని ఆపగలిగారు. కొత్తగా ఎవరికీ సోకడం లేదని తేలింది. వ్యాధి లక్షణాలు కనిపించిన వారికి కూడా పూర్తి స్థాయి నిర్ధారణ పరీక్షలు జరపడానికి భారత దేశం నిరాకరిస్తుండగా, అటువంటి లక్షణాలు లేని వారికి సైతం దక్షిణ కొరియా పరీక్షలు నిర్వహిస్తుండడం గమనార్హం.




> కరోనా నివారణకు వ్యాక్సిన్ లేనందున సామూహిక వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరపడమే మనం చేయగలిగింది. మానవాళికి, వైరస్‌కు మధ్యన పరుగు పందెంలా ఉంటుందిది. ఈ పరుగులో మానవాళి బాగా వెనుకపడింది. టీకా అనేది దాదాపు ఏడాది దూరంలో వెలుగు రేఖలా కనిపిస్తున్న ప్రస్తుత తరుణంలో నిర్ధారణ పరీక్షల ద్వారానే కరోనాను కట్టడి చేయగలం. మరి, భారత దేశంలో ఎందుకు ఎక్కువ మందికి పరీక్షలు జరపడం లేదు?

కరోనా నివారణకు వ్యాక్సిన్ లేనందున సామూహిక వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరపడమే మనం చేయగలిగింది. మానవాళికి, వైరస్‌కు మధ్యన పరుగు పందెంలా ఉంటుందిది. ఈ పరుగులో మానవాళి బాగా వెనుకపడింది. టీకా అనేది దాదాపు ఏడాది దూరంలో వెలుగు రేఖలా కనిపిస్తున్న ప్రస్తుత తరుణంలో నిర్ధారణ పరీక్షల ద్వారానే కరోనాను కట్టడి చేయగలం. మరి, భారత దేశంలో ఎందుకు ఎక్కువ మందికి పరీక్షలు జరపడం లేదు? అంత శక్తి లేకపోవడమైతే కారణం కాదు, అసోసియేటెడ్ ప్రెస్ తెలిపిన సమాచారం ప్రకారం భారత్‌కు రోజుకు 8,000 శాంపిల్స్‌ను పరీక్షించగల సామర్థ్యం ఉంది. కానీ, మార్చి 18 నాటికి రోజుకు కేవలం 90 శాంపిల్స్‌ను మాత్రమే పరీక్షించింది. ఇప్పటి వరకూ నాలుగు మరణాలు సంభవించిన ప్రస్తుత సమయంలో ఈ సంఖ్య ఇంకా పెరుగనున్నట్లు, వైరస్ విజృంభించే ప్రమాదం కనిపిస్తున్న నేపథ్యంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు పూర్తి స్థాయిలో జరపకపోవడం విచిత్రమే.

కరోనా మరణాలకు కేంద్రం రూ. 4లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. దేశంలో ఇది విలయం సృష్టించనుందన్న ఆందోళన ఉంది కాబట్టే భారత ప్రభుత్వం ఈ ప్రకటన చేసిందని అర్థమవుతోంది కదా! మరయితే, సామూహిక వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరపడానికి అయిష్టత చూపుతోంది ఎందుకు? మోదీ ప్రభుత్వం, పది లక్షల వ్యాధి నిర్ధారక కిట్‌ల కొనుగోలుకు జర్మనీకి ఆర్డరిచ్చింది. మరో పక్క ఐసీఎంఆర్ ఈ పరీక్షలను నిదానంగా పెంచుతోంది. ఈ వారంలో చోటుచేసుకున్న ముఖ్యమైన పరిణామమిది. అయితే, ప్రపంచవ్యాప్తంగా కరోనా వ్యాపిస్తోందని తెలిసిన ఫిబ్రవరిలో లేదా కేరళలోని ఒకటి రెండు కేసులతోనే ఆగదనీ, మన దేశంలోనూ విస్తరిస్తుందని అర్థమైన మార్చి మొదటి వారంలో కానీ ఈ చర్యలు తీసుకుంటే బావుండేది. దక్షిణ కొరియా, సింగపూర్, తైవాన్, టర్కీ దేశాలు బాటలోనే మనమూ ఆ కీలకమైన సమయంలో సామూహిక వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి ఉంటే కరోనా మహమ్మారి కట్టడి అయ్యేది. కానీ, ఆ సమయం మించిపోయింది. ఈ విధంగా సరైన సమయంలో సత్వర పరీక్షలు నిర్వహించనందునే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్నారు. ట్రంప్ ఈ వైఖరికి కారణం ఏంటనే అంశంపై ఆ దేశ మీడియా పరిశోధనలు చేసింది. కానీ, మన దేశంలో మీడియా అలాంటి పరిశీలనలు ఏమీ చేయలేకపోయింది. నిర్ధారణ పరీక్షలు చేయకుండా నిధులు విడుదల చేయడం ద్వారానూ, 'డేటా'ను గోప్యంగా ఉంచడంవల్లనూ కరోనాను అధిగమించగలమని ప్రభుత్వం భావిస్తోంది కాబోలు. దేశంలో రైతు ఆత్మహత్యల వివరాలు, వినియోగదారుల వ్యయ సమర్థతనూ దాచినట్టుగా, కరువు అనే పదాన్ని వాడకుండా అది సంభవించనే లేదని చెప్పినట్టుగా ఇదీ అంతే కావచ్చు. ఖండించడమనేదే వ్యూహమైతే, త్వరలోనే ఘోరమైన షాక్‌కు గురవుతాం. అటువంటి పరిస్థితులు ఉత్పన్నం కాకూడదని ఆశిద్దాం.

■ శివమ్ విజ్

*(ద ప్రింట్)*

## నార్లమాట

### అబద్ధాల వేట

> **తర్కంలోని నిష్కర్ష, సత్యంలోని కాఠిన్యం, ఏకాగ్రతలోని నిశ్చలత్వం శ్రీ రాయ్ వ్యక్తిత్వంలో ప్రస్ఫుటమౌతూ ఉండేవి. ఆలోచనకు ఆయనెంత ప్రాధాన్యమిచ్చినా, దాని వెనుక 'తక్కిన జంతుకోటి నుంచి తమను వేరు చేస్తున్న మెదడు తమకు ఉండి కూడా మానవులు దాన్ని వినియోగించరేం?' అనే తీవ్రావేదన దాగి వుండేది.**

మానవ జీవిత సాఫల్య వైఫల్యాలకు మానదండాలేవి? ఆర్జించిన సిరి సంపత్తులా? అనుభవించిన సుఖ సం తోషాలా? అధిష్ఠించిన పదవులా? సాధించిన ప్రాబల్యమా? పొం దిన ప్రశంసలా? ఇట్టి మానదండాలను వర్తింపజేస్తే శ్రీ ఎం.ఎన్. రాయ్ జీవితాన్ని నిరర్థకమైనదిగానే పరిగణించవలసి వస్తుంది. ఇంచుమించు ఆరు దశాబ్దాలకు నాలుగు ఖండాలకు విస్తరించిన ఆయన జీవితంలో సామాన్య దృష్టికి కానవచ్చేవి జారవిడిచిన మహదావకాశాలే, కాలదన్నిన కీలక పదవులే, చేజేతుల మంటగలుపుకున్న పేరు ప్రఖ్యాతులే! అద్భుత మేధా సంపత్తి ఉండి కూడా అసాధారణ ప్రజ్ఞా ప్రాభవాలుండి కూడా ఈ విధంగా ఆయన వర్తించడం సామాన్య జనులకు విపరీతంగా తోస్తుంది. ఉన్మాదుల పట్టికలో ఆయన పేరును కూడా వారు చేర్చుతారు.



ఆ పట్టికలో చార్వాకుని సరసను, మఖ్ఖలి గోశాలుడి సరసను, సంజయ వేళట్టి పుత్రుని సరసను, అజితకేశ కంబళుని సరసను, డెమోక్రటీజ్ సరసను, టి.హెచ్. హక్స్లీ సరసను, కార్ల్ మార్క్స్ సరసను తన పేరు కనబడినందుకు శ్రీరాయ్ మాత్రం ఎంతో సంతోషించేవాడని ప్రత్యేకించి చెప్పనక్కర లేదు. వారివలె ఈయన కూడా 'అబద్ధాల వేట'నే తన వృత్తిగా పెట్టుకున్నాడు; అప్రియ సత్యాలను పలకడమే తన పరమ ధర్మంగా భావించుకున్నాడు; అనాదృత సిద్ధాంతాల ప్రతిపాదననే తన విశిష్ట లక్ష్యంగా ఎంచుకున్నాడు. అపజయం వాటి ముఖాన స్పష్టంగా వ్రాసిపెట్టబడి వున్న యుద్ధాలలో దూకడానికే తన జీవితాన్ని అంకితం చేశాడు. ఇతరుల ఆమోద ప్రమోదాలను లెక్క చేయక, ప్రాపంచిక దృష్టి నుంచి జయాపజయాలను సరకు గొనక, సత్యపథం వెంట నిత్యపథికులుగా నిలవడాన్ని మాత్రమే ఈ కోవకు చెందిన ఉన్మాదులు కాంక్షిస్తారు.

తర్కంలోని నిష్కర్ష, సత్యంలోని కాఠిన్యం, ఏకాగ్రతలోని నిశ్చలత్వం శ్రీ రాయ్ వ్యక్తిత్వంలో ప్రస్ఫుటమౌతూ ఉండేవి. అందువల్లనే పెక్కుమంది ఆయనను మెదడు తప్ప హృదయం లేనివానిగా అపార్థం చేసుకునే వారు; ఔదార్యానికి, ప్రేమకు, క్షమకు ఆయన అపరిచితుడని భ్రమపడేవారు. ఆయనను కేవలం ఒక 'థింకింగ్ మెషీన్'గా పరిగణించేవారు. ఆలోచనకు ఆయనెంత ప్రాధాన్యమిచ్చినా, దాని వెనుక 'తక్కిన జంతుకోటి నుంచి తమను వేరు చేస్తున్న మెదడు తమకు ఉండి కూడా మానవులు దాన్ని వినియోగించరేం?' అనే తీవ్రావేదన దాగి వుండేది. సత్యపరిశోధన కోసం ఎంత దీక్షతో తపస్సు చేసినా, అది కేవలం సత్యసాక్షాత్కారాన్ని పొందగలిగానన్న వ్యక్తిగత సంతృప్తి కోసం కాదు, మత మౌఢ్యాల నుంచి, నీచ స్వార్థాల నుంచి, ఆత్మ విధ్వంసక విధానాల నుంచి మానవజాతిని సముద్ధరించవలెనన్న గాఢ తపనతోనే! జాతి, మత, వర్ణ, కుల, వర్గాది విభేదాలనెరుగని ఆయన విశ్వమానవప్రేమే ఆయనను మానవతావాదిని చేసింది.

*1965 సెప్టెంబర్ 5 ఆంధ్రజ్యోతిలో*
*'మానవతావాది: శ్రీ మానవేంద్రనాథ్ రాయ్' వ్యాసం నుంచి*

## జనవాక్యం

### మోడల్ స్కూల్ టీచర్లకు హెల్త్ కార్డులు అందించాలి

ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్స్, జూనియర్ కళాశాలల రెగ్యులర్ సిబ్బందికి హెల్త్ కార్డులు అందించాలి. ఇతర ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా సేవలు అందుతున్నాయి. ఏపీ మోడల్ స్కూల్ సిబ్బందిని కూడా అదేవిధంగా ఆరోగ్య స్కీం పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వానికి మోడల్ స్కూల్ టీచర్లు విన్నవిస్తున్నారు. ఇదివరకే హెల్త్ మేనేజ్మెంట్ కమిటీలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయాలి. ఎన్నో ఏళ్ళుగా సిబ్బంది చేస్తున్న విజ్ఞప్తులను పరిశీలించి ప్రభుత్వం ఆదర్శ పాఠశాలల సిబ్బందిని కూడా హెల్త్ స్కీం పరిధిలోకి తీసుకురావాలి.

***– బి. సురేష్,*** *శ్రీకాకుళం జిల్లా*

### ఆంధ్రప్రదేశ్ బడి పిల్లల కథలు

కొత్తనీరు ప్రవాహాన్ని పరివ్యాప్తం చేయడమేకాక జవసత్వాల్నిస్తుందన్నది నిజం. అది ఇవ్వాళ్ళ మన పిల్లలు చదువుకునే సాహిత్యంలో స్పష్టంగా కనిపిస్తోంది. మన బడి పిల్లలు రాసిన రచనలతో దాదాపు రెండు తెలుగు రాష్ట్రాల నుండి ఈ మధ్య కాలంలో రెండు వందల యాభైకి పైగా పుస్తకాలు రావడం అందుకు నిదర్శనం. ఇక 'బాల చెలిమి' విషయానికి వస్తే తెలుగు బాలల సాహిత్య చరిత్రలోనే తొలిసారిగా 'తెలంగాణ బడి పిల్లల కథలు' పేర తెలంగాణలోని పాత పది జిల్లాల వారీగా బడి పిల్లలు రాసిన కథలను ప్రచురించి పది పుస్తకాలన ఒకే వేదికపైన ఆవిష్కరించి కొత్త చరిత్రను సృష్టించింది. 'ఆంధ్రప్రదేశ్ బడి పిల్లల కథలు' పేర పదమూడు జిల్లాల వారీగా మన బడి పిల్లలు రాసిన కథలను సంకలనాలుగా ప్రచురించాలని బాలచెలిమి సంకల్పించింది.. ఈ సంకలనాల కోసం ఆయా జిల్లాల లోని బాలబాలికలు తమ స్వీయ రచనలను/కథలను పంపాల్సిందిగా కోరుతున్నాం. విజ్ఞానం, వినోదం, ఆనందం, మానవ సంబంధాలు, జీవజంతుజాలాలపై ప్రేమ, పర్యావరణ పరిరక్షణ వంటి వివిధ అంశాలపై కథలను ఏప్రిల్ 20లోగా పంపించాలి. చిరునామా: సంపాదకులు, బాలచెలిమి& అధ్యక్షులు, చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమి, భూపతి సదన్, 3–6–716, స్ట్రీట్ నెం.12, హిమాయత్ నగర్, హైదరాబాద్– 500029.

***– మణికొండ వేదకుమార్***



## పిచ్చుకల జాడేదీ!

పూర్వం పిచ్చుకల కిచకిచలతో నిద్ర లేచేవాళ్ళం. అవి మన ఇంటి చూర్లలోనూ గోడల నెర్రెల్లోనూ గూడు కట్టుకొని ఉండేవి మనసుకు ఆహ్లాదాన్నే కాదు, ప్రకృతి సమతౌల్యాన్నీ కాపాడేవి. ఇప్పుడు వాటి సందడి కనుమరుగైంది. నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం. ఇది 2010 నుంచి జరుగుతున్నది. అంతర్జాతీయంగా పిచ్చుకల సంరక్షణ కోసం నేచర్ ఫరెవర్ సొసైటీ ఆఫ్ ఇండియా, మరికొన్ని ఇతర జాతీయ సంస్థల తోడ్పాటుతో ఈ దినోత్సవం జరుగుతున్నది. మానవ జీవితానికి మరింత సౌలభ్యాన్ని జత చేసేందుకు దినదినమూ పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం ఈ చిన్న జీవుల పట్ల శాపంగా మారింది. మనం వాడే సెల్ ఫోన్ తరంగాలు, ఇతర రేడియేషన్లు, వాతావరణంలో పెరుగుతున్న కాలుష్యం అనేక జీవ రాశుల జీవితాన్ని దుర్భరం చేస్తున్నది. కొన్ని జాతులు క్రమంగా అంతరిస్తున్నాయి కూడా. అలాంటి జాతుల్లో ఈ పిచ్చుకలు ఒకటి. ప్రతి జీవికీ ప్రకృతి సమతౌల్యంలో ఒక స్థానం ఉంటుంది. ఏ జీవజాతి జనాభా తగ్గినా ప్రకృతిపై దాని ప్రతికూల ప్రభావం ఖచ్చితంగా పడుతుంది. మనిషి తన స్వార్థం కోసం తోటి గ్రహవాసులను పట్టించుకోకుండా ప్రవర్తిస్తే చివరకు దాని ప్రభావం అతని మీద కూడా పడుతుంది. అంతరించిపోతున్న పిచ్చుకల జాతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.

**□ సయ్యద్ షఫీ, హన్మకొండ**

(నేడు అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవం)

# రాజ్యాంగ వ్యవస్థల్నీ కుల పంకిలంలోకి లాగుతారా?

తమ నిర్ణయాలను వాయిదా వేసిన, ప్రశ్నించిన వ్యవస్థలను, వ్యక్తులను చిదిమేసేందుకు వెనుకాడని దుష్ట సంస్కృతి రాష్ట్రంలో నెలకొన్నది. అధికారంలో ఉన్న వైకాపా వ్యవహారం నియంతృత్వానికి, సంకుచిత రాజకీయానికీ నిర్వచనంగా మారుతోంది. ప్రజాప్రయోజనాల కన్నా తమ రాజకీయ ప్రయోజనమే ముఖ్యమన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, స్పీకర్ నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్నారు. వ్యవస్థల పట్ల, వ్యక్తుల పట్ల గౌరవం లేకుండా మాట్లాడుతూ ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను మంట కలుపుతున్నారు.

ప్రపంచాన్ని కబళిస్తున్న కరోనా వైరస్‌ను దృష్టిలో పెట్టుకొని స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించడంతో ఒక్కసారిగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కాళ్ల కింద భూమి కంపించినట్లుగా వ్యవహరించారు. ఎన్నికలు వాయిదా వేయడంతో ఎన్నికల కమీషన్ మీద ముఖ్యమంత్రి, మంత్రులు, స్పీకర్ హద్దులు దాటి ఆరోపణలు చేశారు. కరోనా ప్రపంచాన్ని వణికిస్తున్న పరిస్థితుల్లో ఎన్నికలు వాయిదా వేయడాన్ని ఎవరూ వ్యతిరేకించాల్సిన పని లేదు. ముఖ్యమంత్రి అయిన పది నెలల్లో ఒక్కసారి కూడా మీడియా ముందుకు వచ్చి మాట్లాడని జగన్మోహన్ రెడ్డి ఎన్నికల సంఘం ఎన్నికలు వాయిదా వేసిందని తెలియగానే ఆగమేఘాల మీద మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల సంఘంపై అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. రాష్ట్రంలో అధికారం ముఖ్యమంత్రిదా రమేష్ కుమార్దా? అని ముఖ్యమంత్రి ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల కమీషన్ అధికారాల గురించి ప్రశ్నిస్తున్న ముఖ్యమంత్రి ముందు తన అధికార పరిధి ఏమిటో గుర్తించాలి. 151మంది ఎమ్మెల్యేలు వున్నారని రాజ్యాంగ వ్యవస్థ మీకు అనుకూలంగా భజన చేయాలి అంటే ఎలా సాధ్యం?

హైకోర్టు జడ్జితో సమానమైన హోదా కలిగిన రాజ్యాంగబద్ధ పదవి రాష్ట్ర ఎన్నికల కమీషనర్‌ది. అటువంటి హోదా వున్న వ్యక్తికీ దురుద్దేశ్యాలు ఆపాదించడం చట్ట ఉల్లంఘనే. అందులోనూ బాధ్యతాయుతమైన పదవిలో వున్న ముఖ్యమంత్రి బాధ్యతారహితంగా ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే సమాజంలో కుల విద్వేషాలు ప్రబలే ప్రమాదం ఉంది. రాజ్యాంగం మీద ప్రమాణం చేసినవారు రాజ్యాంగ వ్యవస్థల విలువలను, గౌరవాన్నికాపాడాలి. ముఖ్యమంత్రి తన స్థాయిని మరచి కమీషన్ కి కులం ఆపాదించడంతో ఆయనలోవున్న మరుగుజ్జు నాయకత్వం బయటపడ్డది. తప్పనిసరి పరిస్థితుల్లో ఎన్నికలు వాయిదా వేస్తే ప్రతిపక్షనాయకుడికీ, ఎన్నికల సంఘానికీ కులం ఆపాదించడం ఎంత బాధ్యతారాహిత్యం? ఎన్నికల సంఘానికి రాజ్యాంగం కల్పించిన అధికారాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రశ్నించజాలరు. ఎన్నికల కమీషన్ స్వతంత్రతను, స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే విధంగా బెదిరింపు ధోరణితో మంత్రులు, స్పీకర్ ఆవేశంతో వీరంగాలు చేశారు. కరోనా వైరస్సా, కమ్మ వైరస్సా అని స్పీకర్ చాలా నీచమైన స్థాయిలో మాట్లాడారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి రాజ్యాంగ వ్యవస్థకు ప్రాతినిధ్యం వహించే అధికారిపై అంత వ్యక్తిగతంగా ఎలా దాడి చేస్తారు? ఎన్నికలు వాయిదా వేయడాన్ని పార్టీ అధినేతగా జగన్ తప్పుపట్టవచ్చు. కానీ రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎన్నికలు నిర్వహించవచ్చని సియస్‌తో ఎన్నికల సంఘానికి లేఖ రాయించడం అంటే అది రాజ్యాంగం మీద దాడే అవుతుంది. స్వార్థమే పరమావధిగా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు. రాజధానికి కులం ఆపాదించారు, ఎన్నికల సంఘానికి కులం ఆపాదించారు. ఎన్నికలు సంఘం ఎన్నికలను ఆరు వారాలు వాయిదా వేయడంపై సుప్రీం కోర్టుకు వెళ్లారు. ఇప్పుడు సుప్రీం కోర్టు రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సమర్థించింది. మరి ఇప్పుడు సుప్రీం కోర్టుకు కూడా కులం ఆపాదిస్తారా? కరోనా సమస్యే కాదనీ, ఎన్నికలే ముఖ్యమన్న తీరులో ముఖ్యమంత్రి, మంత్రులు మాట్లాడటం చూస్తుంటే.. వీరికి ఎన్నికల్లో గెలుపు సాధించడంపై వున్న ప్రేమ, ప్రజల ప్రాణాలపై లేదని అర్థం అవుతుంది.




> **రాజధానికి కులం ఆపాదించారు, ఎన్నికల సంఘానికి కులం ఆపాదించారు. ఎన్నికలు సంఘం ఎన్నికలను ఆరు వారాలు వాయిదా వేయడంపై సుప్రీం కోర్టుకు వెళ్లారు. ఇప్పుడు సుప్రీం కోర్టు రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సమర్థించింది. మరి ఇప్పుడు సుప్రీం కోర్టుకు కూడా కులం ఆపాదిస్తారా? కరోనా సమస్యే కాదనీ, ఎన్నికలే ముఖ్యమన్న తీరులో ముఖ్యమంత్రి, మంత్రులు మాట్లాడటం చూస్తుంటే.. వీరికి ఎన్నికల్లో గెలుపు సాధించడంపై వున్న ప్రేమ, ప్రజల ప్రాణాలపై లేదని అర్థం అవుతుంది.**

రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థలు ఎన్నికలు వాయిదా వేసిన తరువాత ఇంత కాలం వైకాపాకి అనుకూలంగా వున్న బిజెపి నాయకులు కూడా మొత్తం ఎన్నికలకు కొత్తగా నోటిఫికేషన్ విడుదల చెయ్యాలని డిమాండ్ చేస్తున్నా బిజెపిని ఒక్క మాట అనకుండా ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని ఒక్క తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబుకి మాత్రమే అం టగట్టడం కేవలం రాజకీయ ప్రయోజనం కోసమే. ఎన్నికలు రద్దు చేయడాన్ని అన్ని రాజకీయ పార్టీలు సమర్థించినా ఒక్క చంద్రబాబు పైనే ముఖ్యమంత్రి, మంత్రులు విరుచుకుపడటం కూడా రాజకీయ ప్రయోజనం కోసమే. 2019 అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో చం ద్రబాబు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు చీఫ్ సెక్రటరీని ఎన్నికల సంఘం మార్చినప్పుడు ప్రతిపక్ష నాయకుడుగా వున్న జగన్ ఆనందపడ్డారు. మరి ఆ రోజు ముఖ్యమంత్రి చంద్రబాబా, ఎన్నికలసంఘమా అని జగన్ ఎందుకు అడగలేదు? మీకు అనుకూలంగా వ్యవహరిస్తే ఒకరకంగానూ, మీకు నచ్చినట్లు చెయ్యకపోతే మరోరకంగానూ మాట్లాడటం ఏమిటి? కరోనా ఉధృతి గ్రహించే కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించి రాష్ట్ర ప్రభుత్వాలను అప్రమత్తం చేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వ అధికారులతో చర్చించిన తరువాతనే ఎన్నికలను వాయిదా వేసినట్లు ఎన్నికల సంఘం ప్రకటిస్తే, కరోనా వైరస్ అసలు సమస్యే కాదన్నట్లు సియం జగన్ మాట్లాడటం సమర్థనీయం కాదు? ప్రపంచమంతా విపత్తుగా భావిస్తున్న కరోనా వైరస్పై చులకనగా మాట్లాడి తన స్థాయిని దిగజార్చుకున్నారు. ఎన్నికలు వాయిదా పడితే కేంద్రం నుండి నిధులు రావని ప్రభుత్వం చెప్పటం కూడా బూటకమే. బెంగాల్, మహారాష్ట్ర, ఒడిస్సా రాష్ట్రాలు కూడా స్థానిక సంస్థల ఎన్నికలను కరోనా మూలంగా వాయిదా వేశాయి.

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అయిన దగ్గర నుండి రాష్ట్రంలో మున్నెన్నడు ఎరుగని విధంగా విచిత్ర విన్యాసాలు సాగాయి. అధికార పార్టీ చేసిన అరాచకం అంతా ఇంతా కాదు. పది నెలల అధికారంలో తాము చేసిన సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించి రాష్ట్ర ప్రజలను ఓట్లు అడగాల్సినవారు, అక్రమాలకు, అరాచకానికి, బెదిరింపులకు దిగుతున్నారు. ఒక పక్కన ప్రజలు హర్షించే పాలన తాము అందించామనీ నమ్మకంగా చెబుతున్నారు. జగన్ పరిపాలన జనరంజక పరిపాలన అని మంత్రులు కీర్తనలు చేస్తున్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైసిపిదే విజయం అంటున్నారు. మరి అంత భరోసా వున్నప్పుడు రాజ్యాంగ వ్యవస్థపై కులం పేరిట దాడి చేయడంఎందుకు? మీది నిజంగా ప్రజలు మెచ్చే పాలనే అయితే ప్రజలు స్థానిక సంస్థల్లో మీకే బ్రహ్మరథం పడతారు కదా? దౌర్జన్యాలకు, దాడులకు ఎందుకు దిగాల్సి వచ్చింది? మీ పరిపాలన నిజంగా అంత బ్రహ్మాండంగా ఉంటే రాష్ట్రంలో ఎన్నడూ లేనంతగా అసహన వాతావరణం ఎందుకు విజృంభించింది? మీ రాజకీయ అవసరాలకు అనుగుణంగా మాత్రమే రాజ్యాంగ వ్యవస్థలు పని చేయలనుకోవడం దేన్ని సూచిస్తోంది? మీ ప్రయోజనాలే ముఖ్యమైతే మరి ప్రజా ప్రయోజనాలమాటేమిటి? రాష్ట్ర రాజకీయం అంతా కుట్రలమయం అయింది. అధికార దాహంతో విచక్షణ మరిచి రాజ్యాంగ వ్యవస్థపై దాడి చేస్తున్నారు. కాబట్టి ఈ స్వార్థ నాయకుల దుష్ట పన్నాగాలను ఎదిరించి రాజ్యాంగ సంస్థలనూ, ప్రజాస్వామ్యాన్నీ కాపాడుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు రాష్ట్ర ప్రజలపైనే ఉన్నది.

**◆ నీరుకొండ ప్రసాద్**


మహువా మొయిత్రా

## శుభ్రత సందేశం!

కరోనా వైరస్ రోజురోజుకు విజృంభిస్తుంటే, తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటూ ప్రముఖులు, సెలబ్రిటీలూ వివిధ మాధ్యమాల ద్వారా సూచనలు చేస్తున్నారు. ముఖ్యంగా 'చేతులు శుభ్రంగా ఉంచుకునేందుకు శానిటైజర్లు వాడాల'ని చెబుతున్నారు. బడ్జెట్ సమావేశాలకు హాజరైన మహిళా ఎంపీలు మహువా మొయిత్రా, ఒకప్పటి నటి నవనీత్ రవి రాణా, హేమాద్రీ సింగ్‌లు పార్లమెంట్ ఆవరణలో శానిటైజర్‌తో చేతులు శుభ్రం చేసుకుంటున్న దృశ్యం.


నవనీత్ రవి రాణా
హేమాద్రీ సింగ్

# నిర్భయకు న్యాయం జరిగింది

**ఎన్నో ఏళ్ల నిరీక్షణకు తెరపడే రోజు ఇది. 'నిర్భయ'ను కిరాతకంగా హత్యాచారం చేసిన దోషులకు దారులన్నీ మూసుకుపోయాయి. ఇక ఉరే మిగిలింది. ఈ నేపథ్యంలో అందరి దృష్టి తలారి పవన్‌కుమార్ జల్లాద్‌పై పడింది. ఢిల్లీలోని తీహార్ జైలు అధికారుల అభ్యర్థన మేరకు నలుగురు నేరస్థులకు ఉరితాళ్లు బిగించేందుకు సిద్ధమైన ఆయన జీవన చిత్రం ఇది...**

న్యూస్ మేకర్



పవన్ కుమార్ జల్లాద్... ఇప్పుడీ పేరు దేశమంతా మారుమోగుతోంది. 'జల్లాద్' అంటే 'తలారి'. ఆయనకు ఇది వంశపారంపర్యంగా వచ్చిన వృత్తి. 1988లో పాటియాలా కేంద్ర కారాగారంలో ఇద్దరిని ఉరి తీసినప్పుడు... తాత కల్లూరామ్‌కు పవన్ సహాయకుడిగా వ్యవహరించారు. అలా 23 ఏళ్ల వయసులో ఆయన వృత్తి జీవితం ప్రారంభమైంది. పవన్ తండ్రి కూడా తలారీనే! 'పాటియాలా జైల్లో తాతకు సహాయకుడిగా ఉండడంవల్ల చాలా విషయాలు తెలుసుకోగలిగాను. న్యాయసూత్రాలకు లోబడి ఉరిశిక్షను ఎలా అమలు చేయాలో అనుభవం గడించాను. అందుకే వృత్తిలో అడుగుపెట్టాక ఆ మొట్టమొదటి రోజు నాలో ఎలాంటి భావోద్వేగాలు లేవు' అంటారు పవన్. నేరం చేసినవాడు శిక్ష అనుభవించాల్సిందేనన్నది ఆయన చెప్పే మాట.

**ఇదే మొదటిసారి...**

నిబంధనల ప్రకారం 'నిర్భయ' కేసులో నలుగురు దోషులు... ముకేష్ సింగ్, వినయ్ శర్మ, అక్షయ్ సింగ్, పవన్ గుప్తాలను ఒకేసారి ఉరి తీయాలి. నిజానికి ఇది అంత సామాన్యమైన విషయం కాదు. దీని కోసమే మీరట్‌లో ఉండే పవన్‌ను తీహార్ జైలు అధికారులు ప్రత్యేకంగా పిలిపించారు. జీవితంలో తాను ప్రొఫెషనల్ తలారిగా మారిన తరువాత ఎవరి సహాయం లేకుండా ఉరిశిక్ష అమలు చేయడం పవన్‌కు ఇదే తొలిసారి. అయినా ఆయన ఎంతో నిబ్బరంగా ఉన్నారు. 'నలుగురినీ ఒకేసారి ఉరి తీయడానికి ప్రత్యేకమైన టెక్నిక్ ఏమీ అవసరం లేదు. సహాయకులూ అక్కర్లేదు. నేనొక్కడినే చాలు' అంటారు పవన్. 'ప్రతీకారం తీర్చుకోవడం తప్ప మరేదీ లేదు' అనేది ఉరిశిక్ష గురించి పేరుపొందిన తలారీ అల్బర్ట్ పెర్రీపాయింట్ అభిప్రాయం. 1931 నుంచి 1956 మధ్య కాలంలో ఆయన 400 పై చిలుకు మందిని ఉరి తీశారు. కానీ అల్బర్ట్‌తో పవన్ ఏకీభవించరు. 'నిర్భయను అతి దారుణంగా అత్యాచారం చేసి, హతమార్చిన నేరస్థులను ఉరి తీస్తే నాకూ, ఆమె తల్లితండ్రులకూ, అందరికీ రిలీఫ్‌గా ఉంటుంది' అంటూ ఆ మధ్య ఆయన వ్యాఖ్యానించడమే ఇందుకు నిదర్శనం.

ఎప్పుడైతే 'నిర్భయ' దోషుల తలారిగా పవన్ పేరు బయటకి వచ్చిందో... అప్పటి నుంచి అయనకు కంటి మీద కునుకు ఉండడంలేదట! అందుకు కారణం ఎక్కడికి వెళ్లినా మీడియా చుట్టుముడుతోందట! 'కనీసం రెండు గంటలు కూడా నిద్రపోనివ్వడం లేదు' అంటూ ఓ సందర్భంలో ఆయన దీనంగా చెప్పారు. వంశంలో మూడో తరం తలారీ అయిన పవన్... తనకు ఇప్పుడు వచ్చే జీతం ఏ మూలకూ సరిపోవడంలేదంటున్నారు. 'నాకు వచ్చే జీతం రూ.5వేలు. ఆ డబ్బుతో కుటుంబాన్ని నెట్టుకురావడం చాలా కష్టంగా ఉంది. ప్రభుత్వం ఆలోచించి జీతాన్ని రూ.20 వేలకు పెంచాలి' అని ఆయన కోరుతున్నారు.

**కుమార్తెదీ అదే మాట...**

కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా పవన్ ఎనిమిదో తరగతిలోనే చదువు మానేశారు. బట్టలు ఉతుకుతూ, టైర్లకు పంక్చర్లు వేస్తూ... ఆ వచ్చే చిల్లర డబ్బులతోనే సంసారం నెట్టుకొచ్చారు. పేదలకు ఇచ్చే సింగిల్ రూమ్ ఇంటిలోనే నివాసం. కానీ... పవన్ కుటుంబం పెద్దది. ఐదుగురు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు. అందరూ ఆ ఒక్క గదిలోనే తలదాచుకోవాలి. అయితే ఆయన పిల్లల్లో ఎవరూ ఇటువైపు రాలేదు. ఉన్నంతలో కష్టపడి చదువుకున్నారు. అందరి కన్నా చిన్న కూతురు వందన మాస్టర్స్ చేస్తున్నారు. పిల్లలంతా తమ తండ్రి వృత్తిని గొప్పగా చెప్పుకొంటారు. 'మమ్మల్ని చుట్టుపక్కలవాళ్లు సెలబ్రిటీల్లా చూస్తారు. నిర్భయ కేసులో దోషులకు ఉరే సరైన శిక్ష' అంటారు వందన కూడా!


నిర్భయ తల్లిదండ్రులతో సీమ

## అది ఆమె మొదటి కేసు

ఎనిమిదేళ్ల క్రితం దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన నిర్భయ ఘటనలో నలుగురు నిందితులకు ఉరి శిక్ష ఖరారు చేయడంలో న్యాయవాది సీమా సమృద్ధి కుష్వహ కీలకంగా వ్యవహరించారు. అలాగనీ ఆమె పేరుమోసిన లాయర్ కాదు. ఆమెకు అదే తొలి కేసు. నిర్భయ కుటుంబంతో అనుబంధం ఉన్న సీమ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసును సవాల్‌గా తీసుకొని పక్కాగా సాక్ష్యాధారాలు సేకరించారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా పలు కోణాల్లో అధ్యయనం చేసి కోర్టుకు తుది నివేదిక అందించారు. నిందితులకు శిక్ష పడేలా చేసి విజయం సాధించారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి దోషులకు ఉరిశిక్ష విధిస్తున్నట్టు తీర్పు చదివినప్పుడు కోర్టు ఆవరణలో సంబరాలు మొదలయ్యాయి. ఆ క్షణం నిర్భయ తల్లి ఆనందంతో కంటతడి పెట్టుకున్నారు. మొదటి కేసులోనే విజయం సాధించడంతో పాటు, నిర్భయ కుటుంబానికి న్యాయం జరిగేలా చేసిన సీమకు అభినందనలు వెల్లువెత్తాయి. చిన్నప్పటి నుంచి చదువులో చురుకైన విద్యార్థి అయిన సీమ ఢిల్లీ యూనివర్సిటీలో చదవు అవగానే సివిల్ సర్వీస్ పరీక్షలకు హాజరయ్యారు. ప్రస్తుతం ఆమె సుప్రీంకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు.

సొగసు

# ధోతీ ధమాల్!



కుర్తీ అడుగున ధరించే ప్యాంట్ వెరైటీగా ఉంటేనే డ్రెస్ మొత్తానికి అందం చేకూరుతుంది. ఇందుకోసం బోలెడన్ని రకాల ప్యాంట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే వాటన్నింటిలో 'ధోతీ ప్యాంట్' తాజా ఫ్యాషన్ ట్రెండ్‌గా మారింది. మరి మీరూ ట్రెండ్‌కు తగ్గట్టు ఇవే ప్యాంట్లను ఎంచుకోండి!

- కుర్తీ పొట్టిగా ఉన్నా, పొడవుగా ఉన్నా... స్లీవ్స్ ఉన్నా, లేకున్నా ధోతీ ప్యాంట్ చక్కగా సూటవుతుంది. వీటిలో ప్లెయిన్‌వే ధరించాలనే రూలేం లేదు. డిజైన్ ఉన్నవీ ఎంచుకోవచ్చు.
- అనార్కలి, అంబెరిల్లా, స్ట్రెయిట్.... మోడల్ ఏదైనా కుర్తీకి కొత్త రూపం తేవాలంటే ధోతీ ప్యాంట్ ఎంచుకోవాలి. అయితే ఈ ప్యాంట్ ఎంచుకునేటప్పుడు యాంకిల్ లెంగ్త్ ఉండేలా చూసుకోవాలి. కురచగా ఉంటేనే ఈ తరహా ప్యాంట్లు అందంగా కనిపిస్తాయి.
- క్యాజువల్ వేర్‌గా ధరించదగిన ఈ ప్యాంట్లకు శాండిల్స్, ఫ్లాట్స్ చక్కగా సూటవుతాయి. డ్రెస్, సందర్భాలను బట్టి హై హీల్స్ కూడా ధరించవచ్చు.

ఫస్ట్‌పర్సన్

**కొవిడ్-19 (కరోనా)... ప్రపంచాన్ని వణికిస్తోన్న ఈ వైరస్ ఇప్పటికే చాలామందిని పొట్టనబెట్టుకుంది. వేల మంది ఐసొలేషన్ సెంటర్లలో ప్రత్యేక చికిత్స పొందుతున్నారు. అలాంటి ప్రమాదకర వైరస్‌ను ఓడించింది అమెరికాకు చెందిన 37 ఏళ్ల ఎలిజబెత్ ష్నీడర్. చికిత్స అనంతరం పూర్తి ఆరోగ్యంతో ఇంటికి చేరిన ఆమె ప్రజలకు ఒక నమ్మకం ఇవ్వాలనే ఆలోచనతో తన అనుభవాలను ఫేస్‌బుక్‌లో పంచుకుంది. ప్రస్తుతం ఆమె చేసిన పోస్ట్ తెగ వైరల్ అవుతోంది. కరోనా వైరస్‌ను తను ఎలా జయించిందంటే...**

# కరోనాను జయించింది!



"మేము ఉండేది వాషింగ్టన్‌లోని సియాటెల్‌లో. నేను బయో టెక్నాలజీ కంపెనీలో మార్కెటింగ్ మేనేజర్‌గా చేస్తున్నా. ఫిబ్రవరి 22న ఒకరింట్లో జరిగిన చిన్నపార్టీకి హాజరయ్యా. ఫిబ్రవరి 25వ తేదీన నేను జలుబు, జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులతో బాధపడ్డా. అయితే ఎప్పుడోసారి అలానే ఉంటుంది అనుకొని ఆఫీసుకు వెళ్లాను. ఆ వారం అంతా ఆఫీసు పనితో బిజీగా ఉండిపోయా. ఒకరోజు మధ్యాహ్నం తలనొప్పి మొదలైంది. దాంతోనే జ్వరం, ఒళ్లు నొప్పులు పెరిగాయి. దాంతో ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేసి కొద్ది సేపు నిద్రపోయా. లేచి చూసేసరికి ఒళ్లు మరీ వేడెక్కింది. 103 డిగ్రీల జ్వరం. తెలియకుండానే వణుకు రావడం మొదలైంది. దాంతో మందులు తెప్పించుకొని వేసుకున్నా. జ్వరం మరీ ఎక్కువైతే నన్ను ఎమర్జెన్సీ రూమ్‌లోకి తీసుకెళుతుందని నా స్నేహితురాలికి ఫోన్‌చేశాను. కానీ జ్వరం మెల్లగా తగ్గడంతో హమ్మయ్య అనుకున్నా. మరుసటి రోజు కరోనా వైరస్ గురించి, అది సోకిన వారిలో కనిపించే లక్షణాల గురించి వార్తాపత్రికల్లో చదివా. అయితే నాకు శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది, దగ్గు వంటి కరోనా లక్షణాలు లేకపోవడంతో నాకేం కాలేదు. అయినా నాకెందుకు ఆ వైరస్ వస్తుంది అనుకున్నా. అంతేకాదు డాక్టర్ వద్దకు వెళితే ఇంటికి వెళ్లి పండ్ల రసాలు ఎక్కువగా తాగు అని చెబుతారు అంతే అని భావించాను.

**ఆ విధంగా...**

తరువాత ఒక రోజు ఫేస్‌బుక్‌లో మా ఫ్రెండ్ పెట్టిన పోస్ట్ చూశా. ఆరోజు పార్టీకి వచ్చిన 40 శాతం మందికి నాలానే జ్వరం, తలనొప్పి వచ్చాయని తెలిసింది. దాంతో నాలోనూ భయం మొదలైంది. వెంటనే మా దగ్గర్లోని స్టడీ సెంటర్లో నాజల్ స్వాబ్ కిట్ తెచ్చుకొని శాంపిల్ పంపించా. కోవిడ్-19 పాజిటివ్ వచ్చిందని చెప్పారు. అమ్మకు చెబితే ఆమె ఒక్కసారిగా ఏడ్చేసింది. స్థానికంగా ఉన్న ఆరోగ్యశాఖ అధికారులు నన్ను వారం రోజులు ఇంటిపట్టునే ఉండమన్నారు. దాంతో ఇంటి నుంచే ఆఫీస్ పని చేసేదాన్ని. చికిత్స, వైద్యుల సూచనలతో నేను ఇప్పుడు కరోనా వైరస్ నుంచి బయటపడ్డా. అందరికి నేను చెప్పేది ఒక్కటే.... ఆందోళన పడకండి. మీరు ఆరోగ్యంగా ఉంటే తగిన జాగ్రత్తలు తీసుకోండి. కరోనా లక్షణాలు కనిపిస్తే వెంటనే టెస్ట్ చేయించుకోండి. ఇంట్లోనే ఉండండి. మందులు టైమ్‌కు వేసుకోండి. తొందరగా కోలుకుంటారు. మీ వయసును బట్టి కూడా కోవిడ్-19 వైరస్ రకరకాల లక్షణాలతో బయటపడుతుంది. ఆ రోజు పార్టీకి వచ్చిన వాళ్లు 40, 50 ఏళ్ల మధ్యలో ఉంటారు. నేను 30ల్లో ఉన్నాను కాబట్టి తొందరగా కోలుకున్నా. వైరస్ సోకగానే మొదటి మూడు రోజులు తలనొప్పి, జ్వరం (తొలి మూడు రోజులు అదేపనిగా, ఆతర్వాత వస్తూ పోతూ), ఒళ్లునొప్పులతో బాధపడ్డా. కొందరికి విరోచనాలు కూడా అయ్యాయట. దగ్గు, జలుబుతో గొంతునొప్పి, శ్వాస పీల్చుకోవడం కష్టం అవుతుంది. జ్వరం లక్షణాలు 10-16 రోజుల పాటు ఉంటాయి. చాలామంది దగ్గు ఉంటే పరీక్షలు చేయించుకోవడాన్ని నిర్లక్ష్యం చేస్తుంటారు. నేను త్వరగా స్పందించడంతో నా శాంపిల్స్‌ను దగ్గర్లోని 'కింగ్ కౌంటీ పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్'కు పంపారు. అక్కడే నాకు కరోనా ఉందని తేలింది. 7 రోజుల పాటు ఐసోలేషన్‌లో ఉండమన్నారు. డాక్టర్లు చెప్పిన జాగ్రత్తలు పాటిస్తూ నెమ్మది నెమ్మదిగా వైరస్ బారి నుంచి సురక్షితంగా బయటపడ్డాను. కరోనా విజృంభిస్తున్న ఈ సమయంలో నా అనుభవాన్ని ఫేస్‌బుక్‌లో పెడితే అందరికీ ఉపయోగపడుతుందని నా స్నేహితులు కోరడంతో పోస్ట్ చేశాను. కరోనా లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం అలసత్వం ప్రదర్శించకుండా పరీక్షలు చేయించుకోండి. లేదంటే కరోనాను వ్యాప్తి చేసినవారవుతారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నా".

అవగాహన

# చేతులెలా కడుక్కోవాలి?

కరోనా వైరస్ హడలెత్తిస్తోంది. ఈ దశలో ఎవరికి వారు వ్యక్తిగత శుభ్రత పాటించడం చాలా ముఖ్యం. ముఖ్యంగా ఎక్కువ సార్లు చేతులు శుభ్రం చేసుకోవడం అవసరం. అయితే చాలామందికి చేతులు శుభ్రం చేసుకొనే విధానంపై అవగాహన ఉండదు. ఇంతకీ చేతులెలా కడుక్కోవాలి? నిపుణులు ఏమంటున్నారంటే...

- కొన్ని వేల బ్యాక్టీరియాలు, వైరస్‌లు చేతుల్లో దాగుంటాయి. షేక్‌హ్యాండ్ ద్వారా ఇవి ఒకరి నుంచి మరొకరికి విస్తరిస్తుంటాయి. 'కరోనా' వైరస్ ఇందుకు పెద్ద ఉదాహరణ. దగ్గడం, తుమ్మడం వల్ల కూడా వైరస్ ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాప్తి చెందుతోంది.



- సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవడానికి 20 సెకన్లకు మించి సమయం పట్టదు. ఇంత తక్కువ సమయంలోనే చేతులను పక్కాగా శుభ్రం చేసుకోవచ్చని సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్‌కు చెందిన వైద్యులు అంటున్నారు. అయితే చాలామంది 5 సెకన్లకు మించి చేతులు కడగడం లేదట!
- రెస్ట్‌రూమ్‌ను ఉపయోగించిన తరువాత 5 శాతం మంది 15 సెకన్ల కన్నా ఎక్కువ సమయాన్ని చేతులు శుభ్రం చేసుకోవడానికి ఉపయోగిస్తున్నారు. 10 శాతం మంది చేతులు శుభ్రం చేసుకోవడానికి ఆసక్తి చూపించడం లేదట!
- చేతులు శుభ్రం చేసుకునే సమయంలో పైపైన కాకుండా చేతి వేళ్ల మధ్య కూడా శుభ్రం చేసుకోవాలని, అప్పుడే వైరస్ పూర్తిగా తొలగిపోతుందని నిపుణులు సూచిస్తున్నారు.
- కొందరు వేడి నీళ్లతో శుభ్రం చేసుకుంటే అన్ని క్రిములు చనిపోతాయని అనుకుంటున్నారు. కానీ వేడి నీళ్లు క్రిములపై ప్రభావం చూపించవని అంటున్నారు నిపుణులు.
- చేతులు శుభ్రం చేసుకోగానే సరిపోదు. పొడి తువ్వాలుతో తుడుచుకోవాలి. చేతులు తడిగా ఉంటే వైరస్ మళ్లీ వ్యాపించే అవకాశం ఉంటుంది. చేతులు ఆరబెట్టుకోవడానికి బ్లోయర్స్‌ను ఉపయోగిస్తే మరీ మంచిది.
- చేతులు శుభ్రం చేసుకున్న తరువాత కుళాయిని ఆపు చేయడానికి నేరుగా చేతులను కాకుండా, టిష్యూ పేపర్‌ను ఉపయోగించాలి.
- చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవడం మేలు. ఆల్కహాల్ ఉన్న శానిటైజర్స్‌ను కూడా ఉపయోగించవచ్చు. 60 శాతం ఆల్కహాల్ ఉన్న శానిటైజర్లు కరోనా వైరస్‌ను నిర్మూలిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

**ఇలా చేయండి!**

- ముందుగా చేతులను నీళ్లతో కడగండి. తరువాత శానిటైజర్, లేదా సబ్బు తీసుకోండి.
- అరచేతిపై మరో అరచేతితో రుద్దండి.
- చేతిని తిరగేసి వేళ్లపై, మణికట్టుపై రాయండి.
- రెండు చేతి వేళ్లనూ ముడివేసినట్టుగా చేసి, వేళ్లతో చేతి మధ్య రుద్దండి.
- ఒక చేతి వేళ్ల మధ్య మరో చేతి వేళ్లతో రుద్దండి.





లోకాన్ని శోభాయమానం చేసే పండుగ...
అఖండ కాల ప్రవాహానికి ఆనవాలైన వేడుక...
ప్రకృతి కొత్త చిగుళ్ళను అలంకరించుకొనే సంబరం...
వసంత ఋతు ఆగమన సూచిక...
అదే తెలుగు వారి కొత్త యుగాది... ఉగాది.

# సృష్టి మొదలైన రోజు!

ఈ నెల 25న శ్రీశార్వరినామ సంవత్సరాది



కాలం అనంతమైనది. అనంతుడైన కృష్ణ పరమాత్మ తానే కాలస్వరూపుణ్ణని భగవద్గీతలో చెప్పాడు. ఈ అనంతమైన కాలం లెక్కకు అందదు. అందుకే దాన్ని 'యుగం' అన్నారు. 'యుగం' అంటే రెండు అని అర్థం. గణనలో కాలాన్ని రాత్రి, పగలు అని రెండుగా విభజించారు. అలా ఒక రోజు ఏర్పడింది. ఈ కాలాన్ని సూర్య, చంద్ర, నక్షత్ర గమనాన్ని అనుసరించి రోజులను వారాలు, పక్షాలు, మాసాలు, ఋతువులు, ఆయనాలుగా పూర్వ ఋషులు విభజించారు. దీనికోసం ఒక సంవత్సర కాలాన్ని ప్రమాణంగా తీసుకున్నారు. భూ భ్రమణం, చంద్ర భ్రమణం ఆధారంగా సూర్యుడి చుట్టూ తిరిగే కాలాన్ని 'ఒక సంవత్సరం' అని నిర్ధరించారు. రాశులు, ఋతువులు, ఆయనాలు... ఇవన్నీ ఒక ఆవృతంలో వస్తాయి. ప్రతి సంవత్సరం వస్తూనే ఉంటాయి. సూర్య గమనాన్ని బట్టి సౌరమానం, చంద్ర గమనాన్ని బట్టి చాంద్రమానం ఏర్పడ్డాయి. వీటి ఆధారంగానే జ్యోతిష శాస్త్రం ఆవిష్కృతమయింది. తద్వారా పంచాంగాలు రూపొందాయి.

తెలుగువారు చాంద్రమానాన్ని అనుసరిస్తారు. ఉగాది (యుగాది)ని సృష్టి ఆరంభానికి ఎంచుకున్నాడని కమలాకర భట్టు తన 'నిర్ణయ సింధు' గ్రంథంలో స్పష్టం చేశాడు. సృష్టితో పాటే కాల విభజన కూడా బ్రహ్మ చేసినట్టు ఈ కింది శ్లోకం చెబుతోంది:

చైత్రే మాసి జగద్బ్రహ్మ ససర్జ ప్రథమేహని
శుక్ల పక్షే సమగ్రంతు తథా సూర్యోదయే సతి

'ఉగ' ఉంటే నక్షత్ర గమనం. 'ఉగస్య ఆదిః ఉగాది' అని పెద్దల వాక్కు. ఆ నక్షత్ర గమనం ఎంతో ప్రత్యేకమైనది. సంవత్సరారంభంలో ప్రథమ ఆయనమైన ఉత్తరాయణంలో ఋతువులకు రారాజైన వసంత ఋతువులో, మాసాలలో మహత్తరమైన మధుమాసం (చైత్రం)లో, పక్షాలలో వెలుగు ఏరోజుకారోజు విస్తరించే శుక్లపక్షంలో, తొలి నక్షత్రం అశ్విని నాడు, తొలి తిథి పాడ్యమి రోజున ఉగాదిని జరుపుకోవడం అనూచానంగా వస్తోంది. ఉగాదికి ఇంతటి ప్రత్యేకత ఉంది. చాంద్రమానంలో అరవై సంవత్సరాలు ఉన్నాయి. ఇవే పునరావృతం అవుతూ ఉంటాయి. కొత్త సంవత్సరం ప్రారంభమైన రోజును ఉగాదిగా వ్యవహరిస్తారు.

కాగా, శాలివాహన చక్రవర్తి (క్రీస్తు శకం డెబ్భై తొమ్మిది) ఉగాది నాడే పట్టాభిషిక్తుడు అయ్యాడనీ, శాలివాహన శకం ఆరంభ దినాన్నే ఉగాదిగా జరుపుకొంటున్నామనీ కొందరు చరిత్రకారులు పేర్కొంటున్నారు. మహోన్నతమైన మానవ జన్మను భగవంతుడికి కైంకర్యం చేయాలి. ఆయనను పొందడానికి మనసా వాచా కర్మణా విధిని నిర్వర్తించాలి. ప్రతియేటా దానికి సంకల్పం చేసుకోవడానికి సదవకాశంగా అందివచ్చిన రోజు... ఉగాది!

● ఎ. సీతారామారావు

## పంచాంగ శ్రవణం దేని కోసం?

ఉగాది విధి విధానాలలో పంచాంగ శ్రవణం అతి ముఖ్యమైనది. తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ చదవడమో లేక ఆలయాల్లో పండితులు చదివేది శ్రద్ధగా వినడమో చేయాలి. 'పంచాంగం' అంటే తిథి, వార, నక్షత్ర, కరణ, యోగాలనే అయిదు అంగాలతో కూడుకొని ఉన్నది. ప్రతి వ్యక్తి మీదా ఆయా గ్రహాలూ, నక్షత్రాలూ కలిగించే ఫలితాలు దీని ద్వారా తెలుస్తాయి. ఇవన్నీ భగవంతుడి ఆధీనంలో ఉంటాయి. కనుక ఈశ్వరానుగ్రహం కోరుతూ పంచాంగ శ్రవణం చేసిన వారికి శుభ ఫలితాలు ప్రాప్తిస్తాయి. ఆరోగ్యం, సంపద, ఆయువు, విజయం, పాప విముక్తి లాంటి విషయాలు పంచాంగం ద్వారా తెలుస్తాయి. ఒకవేళ ఏవైనా దుష్పరిణామాలు పొంచి ఉన్నాయని తెలిస్తే, వాటి నుంచి రక్షణ పొందడానికి పరమ శక్తి సంపన్నుడయిన పరమేశ్వరుణ్ణి సభక్తికంగా ఆశ్రయించాలి. తద్వారా వాటిని తొలగించుకోవచ్చు.

## ఉగాది నాడు ఏం చేయాలి?

ఉగాదిని అనుష్ఠించడానికి కావలసిన శాస్త్ర విధిని మన పూర్వ ఋషులు నిర్ణయించారు. ఆ విధి విధానాలను కూడా స్పష్టంగా తెలియజేశారు.

**విధిగా ఆచరించవలసినవి:**

అభ్యంగన స్నానం, నూతన వస్త్ర ధారణ, ఇష్టదేవతా పూజ, షడ్రుచుల ఉగాది పచ్చడి నివేదన, ఇంటి పెద్దల ఆశీస్సులు పొందడం, నింబ కుసుమ (వేప పువ్వు) భక్షణం, పంచాంగ శ్రవణం.

ఉగాదికి ముందురోజునే ఇల్లు, వాకిళ్ళు కడగాలి. గుమ్మాలకు పసుపు, కుంకుమలు పెట్టాలి. ద్వారాలకు మామిడి ఆకులు, వేప మండలు తోరణాలుగా కట్టాలి. పూజామందిరాన్ని ఉగాది పూజకు సిద్ధం చేసుకోవాలి. ఉగాది నాడు బ్రాహ్మీ ముహూర్తాన నిద్ర లేచి, కాలకృత్యాలు తీర్చుకొని, అభ్యంగన స్నానం చేయాలి. ఇంటిలో పెద్దల ఆశీస్సులు తీసుకొని, తలపై నువ్వుల నూనె పెట్టించుకొని, స్నానం ఆచరించడం శుభప్రదం. అనంతరం నూతన వస్త్రాలు ధరించాలి. పూజామందిరంలో ఇష్టదైవాన్నీ, గణపతినీ అర్చించి, షోడశోపచారాలతో పూజించి, ధూప, దీప, నివేదనలూ, హారతి సమర్పించాలి.



## ఉగాది పచ్చడే ఎందుకు?

చైత్ర శుద్ధ పాడ్యమి రోజున అంటే, సంవత్సరం తొలి రోజున దైవానికి చేసే నివేదనలో విధిగా షడ్రుచుల ఉగాది పచ్చడిని ఉంచాలి. ఈ పచ్చడి ఎలా తయారు చేయాలో పూర్వులే వివరించారు:

'కించ యద్వర్షాదౌ నింబ కుసుమం - శర్కరామ్ల ఘృతైర్యుతం
భక్షతం పూర్వ యేమేస్యాత్ - తద్వర్షం సౌఖ్యదాయకం' అని.

కొత్త సంవత్సరం తొలి రోజున వేప పూవు, బెల్లం, కొత్త చింతపండు పులుసు, మామిడికాయ ముక్కలు, ఆవు నెయ్యి, మిరియాల పొడి, రుచికోసం లవణం కలిపి తయారు చేసిన షడ్రుచుల పచ్చడిని ప్రసాదంగా పరగడుపున భుజించాలి. ఈ పచ్చడి ఆయుర్వేద శాస్త్రరీత్యా ఎంతో విలువైనది. సంవత్సరం పాటు వాత, పిత్త, కఫ రోగాలను నివారించడమే కాకుండా శరీర ఆరోగ్యాన్ని కుదుటపరుస్తుందని పెద్దలు చెప్పారు.

---

సందేశం

# పధ్నాలుగు ఆజ్ఞలు

మానవాళి ఎలా జీవించాలో దైవం దివ్య ఖురాన్‌లో నిర్దేశించాడు. మానవులు పాటించాల్సిన నియమాలను పధ్నాలుగు ఆజ్ఞల ద్వారా దివ్య ఖుర్ఆన్‌లో (బనీఇస్రాయిల్ 17: 23-39) స్పష్టంగా వివరించాడు. అవి:

- మీ ప్రభువు మీకు ఆజ్ఞాపించాడు. ఆయనను తప్ప మరెవరినీ ఆరాధించకూడదు. తల్లితండ్రులవిషయంలో ఉత్తమంగా వ్యవహరించాలి. వారు వృద్ధాప్యానికి చేరుకున్నట్టయితే వారి పట్ల విసుగు చెందకూడదు. వారితో మర్యాదగా మాట్లాడాలి. "ఓ ప్రభూ! బాల్యంలో వీరు నన్ను ప్రేమానురాగాలతో పోషించినట్టే నీవు వారిపై దయచూపించు" అని వారి కోసం ప్రార్థిస్తూ ఉండాలి.
- మీ ఆంతర్యాలలో ఏముందో మీ ప్రభువుకు బాగా తెలుసు. మీరు మంచివారుగా మసలుకుంటే అల్లాహ్ క్షమిస్తాడు. బంధువుల, నిరుపేదల, ప్రయాణికుల హక్కును వారికి ఇస్తూ ఉండాలి. దుబారా చేయకూడదు. అలా ఖర్చు చేసేవారు సైతాను సోదరులు.
- ఎవరి విషయంలోనైనా ముఖం తిప్పుకోవాల్సి వస్తే, వారికి చెప్పాల్సింది మృదువుగా చెప్పండి.
- చేతులను మెడమీద ఉంచకండి. అలా అని విచ్చలవిడిగా వదిలెయ్యకండి. చేతులు అదుపులో లేకపోతే నిందలపాలు అవుతారు.
- ప్రభువు తాను కోరిన వారికి ఉపాధిని విస్తృతం చేస్తాడు. అలా కోరకపోతే పరిమితం చేస్తాడు. నిస్సందేహంగా ఆయన తన దాసుల గురించి అన్నీ తెలిసినవాడు, అన్నీ చూస్తున్నవాడు.
- దారిద్ర్య భయంతో మీ సంతానాన్ని చంపకండి. వారికీ, మీకూ ఉపాధి ఇచ్చేది మేమే. వారి హత్య ముమ్మాటికీ మహా పాతకం.
- వ్యభిచారం దరిదాపులకు కూడా వెళ్ళకండి. ఎందుకంటే అది నీతి బాహ్యమైన చేష్ట. చాలా చెడ్డ మార్గం.
- న్యాయ సమ్మతంగా తప్ప ఏ ప్రాణినీ హతమార్చకూడదు.
- అనాథల ఆస్తి దరిదాపులకు కూడా వెళ్ళకండి. వారు యుక్త వయసుకు వచ్చే వరకూ వాగ్దానాన్ని వారి విషయంలో నెరవేర్చండి.
- మీరు కొలిచి ఇస్తున్నప్పుడు నిండుగా కొలవండి. సరైన త్రాసులో తూచండి. అదే ఉత్తమమైన పద్ధతి. దాని ఫలితం గొప్పగా ఉంటుంది.
- మీకు అవసరం లేని విషయాల వెంటపడకండి.
- నేలపై నిక్కుతూ నడవకండి. మీరు నేలను చీల్చనూ లేరు. పర్వత శిఖరాలను అందుకొనేంత ఎత్తుకు ఎదగనూ లేరు.
- మీ చర్యలలో చెడు ఉండకూడదు. మీరు ప్రభువు సన్నిధికి వెళ్ళినప్పుడు ఆ చర్యలను ఆయన నిరాకరిస్తాడు.
- అల్లాహ్‌తో పాటు మరొకరిని ఆరాధ్యునిగా మీరు కల్పించవద్దు. అలా చేశారంటే నిందితులు అవుతారు.

● మహమ్మద్ వహీదుద్దీన్



---

సద్గురువాణి

# ప్రశాంతతే ఆయుధం!

కోపాన్ని జయించాలన్న మాట తరచూ వినబడుతుంటుంది. ఎవరైనా విలువైన దాన్ని జయించాలని అనుకుంటారు. అవసరం లేని దాన్ని గెలుద్దాం అనుకోరు కదా! అందుకే 'జయించడం' అనే ఆలోచనను వదిలెయ్యండి. మనకు ఎప్పుడో ఒకసారి కోపం వస్తుంది. ఎందుకంటే, మన శరీరం, మన మనస్సు, మన శక్తి మీకు అనుకూలంగా ప్రవర్తించడం లేదు కాబట్టి! అంటే, కోపం అన్ని సమయాల్లోనూ లేదు. అన్ని సమయాల్లోనూ లేని దాన్ని జయించడం లేదా నియంత్రించడం వృథా శ్రమ.

మన మనసు ఒక్కోసారి చిరాకుగా మారుతుంది. అలాంటి చిరాకులో ఒక రూపాన్ని మనం 'కోపం' అంటాం. ఈ ప్రపంచంలో చిరాకు పుష్కలంగా ఉంది. ఈ ప్రపంచంలో నడుస్తున్నపుడు కొన్ని పరిస్థితుల్లో జోక్యం చేసుకోవాల్సి వస్తుంది. ఎంత ఆపాలని చూసినా, ఎక్కడో ఒక చోట చిరాకులోకి అడుగుపెడుతూనే ఉంటాం. చుట్టూ ఉన్న పరిస్థితులు చిరాకుగా అనిపించినప్పుడు మనం కూడా చిరాకుగా మారిపోవడం తెలివైన పని కాదు. అలాంటి సమయంలోనే ప్రశాంతంగా ఉండాలి. ప్రసన్నంగా ఉండాలి. అదీ ముఖ్యం.

అలాగని కోపం తెచ్చుకోవద్దని చెప్పడం లేదు. ఒకవేళ కోపం మధురానుభూతిగా అనిపిస్తే, ఎల్లప్పుడూ కోపం తెచ్చుకుంటూనే ఉండవచ్చు. కానీ మన కోపానికి గురైన వాళ్ళ కన్నా మనమే ఎక్కువ బాధపడతాం. అప్పుడు దానివల్ల మనకు ఉపయోగం ఏముంది?



**వారి ఆకలి తీరుద్దాం! ఆ వైరస్‌ను తరిమేద్దాం!**

"ఇప్పుడు కరోనా వైరస్ ప్రపంచాన్ని కల్లోలం చేస్తోంది. దీని కారణంగా అన్ని వర్గాలు ఆందోళనలో ఉన్నాయి. ఎందరికో ఉపాధి పోయింది. రోజుకూలి డబ్బుతో బతికే వారి జీవనోపాధి ఎలా? ఇది చాలా కీలకమైన విషయం. ఆదాయం లేక ఆకలి తీర్చుకోలేనప్పుడు చావుకు దారితీసే పరిస్థితులు ఏర్పడతాయి. సామాజిక అశాంతి తలెత్తుతుంది. జీవనోపాధి దెబ్బతిన్న వారికి రోజూ పోషకాహారం అందించడం సమాజంలో ఉన్న మన అందరి కనీస బాధ్యత. అందరం కలిసికట్టుగా నిలబడదాం. వైరస్‌ను తరిమికొడదాం!"

కళ్ళు మూసుకొని కారు డ్రైవ్ చెయ్యడానికి ప్రయత్నించామనుకోండి. ఎంతో కష్టపడి, ఒకరిద్దరిని ఢీకొట్టి, ఎలాగో ఇంటికి చేరుకోవచ్చేమో! కానీ ప్రతిసారీ ఇలాగే చేస్తే కొద్ది రోజుల తరువాత మనం జీవించి ఉండం.. చిరాకు, కోపం విషయంలో ప్రవర్తనలు కూడా ఇలాగే ఉంటాయి. మన శ్రేయస్సును మనం కళ్ళు మూసుకొని నియంత్రించాలని చూస్తున్నాం. దాని వల్ల శ్రేయస్సు దొరకదు. నియంత్రించాల్సింది కళ్ళు మూసుకొని కాదు, కళ్ళు తెరచుకొని! కోపం విషయంలోనూ అంతే. ప్రశాంతత అలవరచుకుంటే... చుట్టూ పరిస్థితులు ఎలా ఉన్నా అంతర్గతంగా చిరాకు పెరగదు. అది ఇక కోపంగా మారే ప్రశ్నే లేదు! కాబట్టి దాన్ని జయించడానికి గొప్ప ప్రయత్నాలు అవసరం లేదు.

● సద్గురు జగ్గీ వాసుదేవ్

---

# దృష్టి పని మీద ఉండాలి!

భగవద్గీత గురించి ఒక్కమాటలో చెప్పమంటే 'నిష్కామకర్మ' అని చెప్పొచ్చు. దాని గురించి భగవద్గీత 3వ అధ్యాయం 19వ శ్లోకంలో శ్రీకృష్ణపరమాత్మ వివరించాడు.

తస్మాదసక్తః సతతం కార్యం కర్మ సమాచర
అసక్తో హ్యాచరన్ కర్మ పరమాప్నోతి పూరుషః

భగవంతుడు ఏదీ ఆశించకుండా పని చేయమని చెప్పడం లేదు. జీతం ఆశించకుండా ఉద్యోగం చేయం కదా! కాబట్టి ఫలితం ఆశించకుండా కాదు, ఫలితం మీద దృష్టి లేకుండా పనిచేయాలి. అదే అసక్తత! ఆశ లేకుండా జీవితం లేదు. ఆశ లేకుండా అభివృద్ధి లేదు. 'కార్యం కర్మ' అంటే చేయవలసిన కర్మ. అన్ని పనులూ మీద వేసుకోవడం కాదు. అవసరమైనవి మాత్రమే చేయాలి. అలాగే పనిమీదే దృష్టి పెట్టాలి. ఫలితం మీద కాదు. రమణ మహర్షిని ఒక వ్యక్తి నిష్కామకర్మ అంటే ఏంటని అడిగాడు. "రా చూపిస్తాను" అని ఆ వ్యక్తిని గిరిప్రదక్షిణకు తీసుకెళ్లాడు. మధ్యలో ఒక తుమ్మ చెట్టు దగ్గర రమణుడు ఆగి, విరిగిన కొమ్మ తీసుకొని, పదునైన రాయితో రెండు గంటల సేపు చెక్కి, నునుపుగా చేశాడు. మళ్లీ బయలుదేరాడు. దారిలో గొర్రెలు కాస్తున్న బాలుడు ఆయనను పలకరించాడు. "బాగున్నావా?" అంటూ ఆ కర్రను ఇచ్చాడు. ఆ బాలుడు సంతోషంగా అది తీసుకొని వెళ్ళాడు. తరువాత తన వెంట వస్తున్న ఆ వ్యక్తితో "నిష్కామ కర్మ అంటే ఇది" అని ఆయన చెప్పాడు. ఆ కర్ర రమణమహర్షికి అవసరం లేదు. అయినా దాన్ని రాయితో చెక్కాడు. అది ఎవరికి అవసరమో వారికి ఇచ్చేశాడు. అదే నిష్కామకర్మ. ఫలితం మీద దృష్టి పెట్టకు. పని మీద దృష్టి పెట్టు. ఇది అందరూ పాటించాలి.



● డా. గరికిపాటి నరసింహారావు

నవజీవన వేదం



చిత్రం: కేశవ్

---

దైవమార్గం

# సర్వదా కృతజ్ఞతతో ఉండాలి!



ఒకసారి ఏసు ప్రభువు జెరూసలేమ్‌కు ప్రయాణం చేస్తున్నాడు. ఒక గ్రామంలో నుంచి వెళ్తూ ఉండగా, పది మంది వ్యక్తులు ఆయనకు ఎదురయ్యారు. వారందరూ కుష్టు వ్యాధిగ్రస్తులు. వారు ఏసు ప్రభువు సమీపానికి వచ్చి నిలబడి, గట్టిగా అరిచారు, "జీసస్! ఓ బోధకుడా! మా మీద దయచూపు" అని. వారిని ఏసు చూసి, "వెళ్ళండి. మీ మతాధికారులకు వెళ్ళి కనబడండి" అన్నాడు.

ఆ వ్యక్తులకు కుష్టు వ్యాధి లేదని నిర్ధారించవలసింది ఆ మతాధికారులే. కాబట్టి వారు బయలుదేరారు. మార్గమధ్యంలోనే వారి వ్యాధి నయమైపోయింది.ఆ రోగులలో ఒక వ్యక్తి తనకు స్వస్థత లభించిన సంగతి గ్రహించాడు. ఆ పది మందిలో తొమ్మిదిమంది యూదులు కాగా అతను ఒక్కడే సమరయుడు. అతను పరుగుపరుగున వెనక్కి వచ్చి, ఏసును కలుసుకొని ధన్యవాదాలు చెప్పాడు. "మొత్తం పదిమందికీ నయం అయింది కదా! ఈ బయటి వ్యక్తి తప్ప మిగిలిన వారెవరూ వెనక్కి రాలేదు, దేవుణ్ణి ప్రార్థించలేదు. మిగిలిన వారు ఏరీ?" అని ఏసు ప్రశ్నించాడు. తరువాత ఆ వ్యక్తిని చూస్తూ లేచి "వెళ్ళు. నీ విశ్వాసం నీకు స్వస్థత చేకూర్చింది" అని అన్నాడు.

మనలోనూ చాలామంది ఆ తొమ్మిదిమంది మాదిరిగానే ప్రవర్తిస్తూ ఉంటాం. దేవుణ్ణి ఎన్నో కోరుకుంటాం. వాటిని దేవుడు నెరవేర్చినప్పుడు ఆయనకు కృతజ్ఞత చెప్పడం, ప్రార్థన చేయడం కనీసం చేయాల్సిన విధి అని మరచిపోతాం. ఎల్లవేళలా దైవం మనను ఒక కంట కనిపెట్టి, కాపాడుతూ ఉంటాడు. అందుకే ఆయనకు నిరంతరం కృతజ్ఞులమై ఉండాలి. సంతోషంలో ఉన్నా, కష్టంలో ఉన్నా ఎప్పుడూ ఆయనను ప్రార్థిస్తూ ఉండాలి.

---

## డైలీ సుడోకు - 313

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | | | | | | | | 9 |
| | 1 | | | | | | 2 | |
| | | 9 | 4 | 2 | 1 | | | 3 |
| | | 6 | | 7 | | | | |
| 2 | 4 | | 6 | | 9 | | 1 | 8 |
| | | | | 1 | | 3 | | |
| 4 | | | 3 | 6 | 7 | 9 | | |
| | 8 | | | | | | 7 | |
| 7 | | | | | | | | 2 |

### సుడోకు- 312 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | 8 | 6 | 5 | 1 | 7 | 2 | 9 | 4 |
| 5 | 4 | 7 | 6 | 2 | 9 | 8 | 3 | 1 |
| 1 | 9 | 2 | 3 | 8 | 4 | 7 | 6 | 5 |
| 2 | 1 | 5 | 8 | 9 | 6 | 4 | 7 | 3 |
| 6 | 3 | 8 | 4 | 7 | 5 | 9 | 1 | 2 |
| 4 | 7 | 9 | 2 | 3 | 1 | 5 | 8 | 6 |
| 8 | 2 | 4 | 7 | 6 | 3 | 1 | 5 | 9 |
| 7 | 6 | 1 | 9 | 5 | 2 | 3 | 4 | 8 |
| 9 | 5 | 3 | 1 | 4 | 8 | 6 | 2 | 7 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

# ముగిసిన నిర్భయ కాండ!

**నేడు ఉదయం 5-30 గంటలకు ఉరి!**

న్యూఢిల్లీ, మార్చి 7: నిర్భయ హత్యాచార దోషుల కథ ఎట్టకేలకు పరిసమాప్తమైంది. ఆఖరి క్షణంలో ఏవైనా అవాంతరాలు, అభ్యంతరాలు, అద్భుతాలు జరిగితే తప్ప... మీరు ఈ పత్రిక చదివే సమయానికి నలుగురు దోషుల ఉరితీత జరిగిపోతుంది. మార్చి 20వ తేదీ ఉదయం 5:30 గంటలకు ఉరితీత జరపాలని కోర్టు గతంలోనే పటియాలా హౌస్ ప్రత్యేక కోర్టు ఆదేశించింది. ఇలా డెత్ వారెంట్ జారీ చేయడం ఇది నాలుగోసారి. మార్చి 3న జరగాల్సిన ఉరితీత వాయిదాపడడంతో మార్చి 5న నాలుగోసారి బ్లాక్ వారెంట్ జారీ చేస్తూ ప్రత్యేక కోర్టు జడ్జి ధర్మేంద్ర రాణా ఆదేశించిన సంగతి తెలిసిందే. దీన్ని సవాలు చేస్తూ, ఉరిపై స్టే ఇవ్వాలని కోరుతూ నలుగురు దోషులూ ఆయన కోర్టులోనే పిటిషన్ వేశారు. ఆ పిటిషన్లో, వాదనల్లో పస లేదని పేర్కొంటూ గురువారం ఆయన దీనిని తిరస్కరించారు. రేప్ ఘటన జరిగేనాటికి తాను మైనర్‌నంటూ మరో దోషి పవన్ గుప్తా వేసిన క్యూరేటివ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కూడా గురువారం తిరస్కరించింది. జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఆర్ భానుమతి, జస్టిస్ రోహింగ్టన్ నారిమన్, జస్టిస్ ఏఎస్ బోపన్నలతో కూడిన బెంచ్ తమ చాంబర్లలోనే దీన్ని పరిశీలించింది. ఇందులో కొత్త విషయం లేదని తేల్చింది. ఉరి తప్పదని భావించి కొన్ని డాక్యుమెంట్లను తాము కోర్టులకు చూపలేదని పేర్కొంటూ ముఖేశ్ సింగ్, అక్షయ్ సింగ్ అనే దోషులు వేసిన మరో పిటిషన్‌ను జస్టిస్ ఆర్ భానుమతి, జస్టిస్ ఏఎస్ బోపన్న, జస్టిస్ అశోక్ భూషణ్‌ల బెంచ్ కొట్టేసింది. ఓ వైపు కోర్టు కేసులు నడుస్తుండగానే.. అటు తిహార్‌లో ఉరికి ఏర్పాట్లు చకచకా సాగాయి. దోషులు పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తేల్చారు. కాగా, నిర్భయ దోషుల్లో ఒకరైన అక్షయ్ సింగ్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేయడంతో అతని భార్య పునీతా దేవి... కోర్టు బయట స్పృహ తప్పి పడిపోయారు. అనంతరం స్పృహలోకి వచ్చిన ఆమె.. ఆత్మహత్య చేసుకుంటానంటూ రోదించింది. అక్షయ్‌ను కాపాడుకునేందుకు గాను ఆమె గత వారం విడాకులకు కూడా దరఖాస్తు చేశారు.

# అబద్ధంతో ఆగిన ఉరి!

- చలపతి రావు, విజయవర్ధన్‌లకు ఊపిరి
- క్షమాభిక్షను తిరస్కరించినా... పరిశీలిస్తున్నారంటూ సుప్రీం జడ్జివద్దకు!
- మరికొన్ని గంటల్లో అమలు కావాల్సిన శిక్ష
- వారం... ఆ తర్వాత మూడు నెలలు వాయిదా
- చివరికి... యావజ్జీవంగా మార్పుతో ఊపిరి

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ముఖానికి ముసుగు తొడిగాక, తలారీ చెయ్యి లివర్‌లాగే ముందు.... 'ఆ...పం.....డి' అని కేక వినిపించి, ఉరి ఆగిపోవడానికి ఇది 'అభిలాష' సినిమా కాదు! కానీ.... సినిమాకు మించిన నాటకీయ పరిణామాల మధ్య, ఇద్దరి ఉరి ఆగిపోయింది. వారే... చిలకలూరిపేట బస్సు దహనం కేసులో దోషులైన సాతులూరి చలపతి రావు, గంటెల విజయవర్ధన్‌రావు! తమకు ఊపిరి మిగిల్చిన ఈ సస్పెన్స్ థ్రిల్లర్ గురించి చలపతిరావు తన అముద్రిత పుస్తకంలో వివరించారు. నిర్భయ కేసులో నలుగురు దోషులకు ఉరితీత నేపథ్యంలో... వీరిద్దరి అంశాన్ని అనేకమంది గుర్తుకు తెచ్చుకుంటున్నారు. ఆ రోజు ఏం జరిగిందంటే...

**సీన్1: రాజమండ్రి సెంట్రల్ జైల్**

1997 మార్చి 29... వారి జీవితానికి ఆఖరిరోజు! వారికి తెల్ల వారదు! 1993లో చిలకలూరిపేట వద్ద ఆర్టీసీ బస్సు దగ్ధమై 23 మంది చనిపోయారు. దోపిడీ ప్రయత్నంలో భాగంగా చలపతిరావు, విజయవర్ధన్‌లే బస్సు తగలబెట్టారన్నది అభియోగం! ఇది రుజువైంది. 1995 మార్చిలో వీరికి ఉరిశిక్ష పడింది. సుప్రీం కోర్టు కూడా ఉరినే ఖాయం చేసింది. దీంతో దళిత, ప్రజాసంఘాలు, మానవహక్కుల సంఘాలు, అమ్నెస్టీ ఇంటర్నేషనల్ రంగంలోకి వచ్చాయి. అప్పటి రాష్ట్రపతి శంకర్‌దయాళ్ శర్మ 1997 మార్చి 14న రెండో సారి కూడా క్షమాభిక్ష పిటిషన్‌ను తిరస్కరించారు. మార్చి 29న ఉరిశిక్ష అమలుకు అంతా సిద్ధమైంది. రాజమండ్రి సెంట్రల్ జైలులో తెల్లవారుజామున 3 గంటలకు ఉరిశిక్ష అమలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. చలపతిరావును కడసారి చూసేందుకు అతని తల్లిదండ్రులు, భార్యను అధికారులు జైలువద్దకు పిలిపించారు. కొద్దిసేపు వారితో మాట్లాడే అవకాశాన్ని కల్పించారు. రాత్రి 9గంటల సమయంలో చలపతిరావు తన తల్లిదండ్రులతో మాట్లాడి, వారికి అప్పగింతలు పూర్తిచేశాడు. ఆస్తిలో తనకు రావాల్సిన వాటాను తన భార్యకు ఇవ్వాలని, కూతురును బాగా చూసుకోవాలని కోరాడు. తన భార్యను పిలిచి మళ్లీ పెళ్లి చేసుకొమ్మని సలహా ఇచ్చాడు. ములాఖత్ అయిపోయింది. 'మూడు గంటలకు ఉరిశిక్ష అమలు చేస్తాం, నాలుగు గంటలకల్లా మృతదేహాన్ని అప్పగిస్తాం. జైలు వాహనంలోనే పంపిస్తాం' అని జైలు అధికారులు చెప్పారు. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులంతా జైలు బయట, విచారంగా, నిర్వికారంగా వేచి చూస్తున్నారు.

**సీన్2: ఢిల్లీ రాష్ట్రపతి భవన్**

'నేరస్తులనుకాదు... నేర స్వభావాన్ని చంపాలి' అనే సిద్ధాంతంతో ఉరిశిక్షను వ్యతిరేకిస్తున్న వారెందరో ఉన్నారు. చలపతిరావు, విజయవర్ధన్‌కు ఉరి శిక్ష ఆపేందుకు వీరు అప్పటికే ఎన్నో ప్రయత్నాలు చేశారు. శిక్ష అమలుకు ఒక్కరోజు ముందు... అంటే 1997 మార్చి 28వ తేదీన, ప్రఖ్యాత రచయిత్రి మహాశ్వేతాదేవితో సహా నలుగురు మానవహక్కుల నేతలు రాష్ట్రపతి భవన్ వెళ్లారు. రాత్రి 9గంటల సమయంలో రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ అక్కడికి వచ్చారు. అతికష్టం మీద రాష్ట్రపతిని కలిసిన హక్కుల నేతలు క్షమాభిక్ష కోసం మళ్లీ పిటిషన్ ఇచ్చారు. 'ఇప్పటికే రెండు సార్లు తిరస్కరించాను. ఇక నేను చేయగలిగిందేమీ లేదు. దయచేసి మీరు వెళ్లండి' అని శంకర్ దయాళ్‌శర్మ వారికో నమస్కారం పెట్టి, ఆ పిటిషన్ కాపీని తన పక్కనే నడుస్తున్న సహాయకుడికి అందజేశారు. అక్కడ జరిగిందంతే! తమ చివరి ప్రయత్నం కూడా విఫలమైన తర్వాత... రాష్ట్రపతి భవన్ నుంచి తిరుగు ప్రయాణమవుతుండగా, ఆ బృందంలో ఉన్న ఓ మహిళా న్యాయవాది మదిలో ఓ ఐడియా మెరిసింది. 'ఇంతదాకా వచ్చింది! ఓ చిన్న అబద్ధం చెబుదాం' అన్నారు. ఇందుకు ఇతరులూ అంగీకరించారు. రాత్రి 10 గంటల సమయంలోనే అట్నుంచి అటే ఒక సుప్రీంకోర్టు జడ్జి ఇంటికి వెళ్లారు. "మేము రాష్ట్రపతికి పిటిషన్ అందించాం. సానుభూతితో పరిశీలిస్తానని అన్నారు. ఒక్క వారం రోజులు ఉరిని వాయిదా వేయండి' అని జడ్జిని కోరారు. మరో జడ్జిని కూడా కలిస్తే బాగుంటుందని ఆయన సూచించడంతో... ఈ బృందం దగ్గర్లోనే ఉన్న మరో జడ్జి ఇంటికి వెళ్లి ఆయనను బతిమలాడి మొదటి జడ్జి ఇంటికి తీసుకు వచ్చారు. ఇద్దరూ చర్చించుకున్న మీదట రాష్ట్రపతి పిటిషన్‌పై నిర్ణయం తీసుకునేలోపు ఎవరూ చనిపోకూడదన్న ఉద్దేశంతో వారంరోజులు గడువిస్తూ ఏప్రిల్ 5వ తేదీ వరకు ఉరితీయ వద్దని అప్పటికప్పుడు ఆదేశాలు ఇచ్చారు.

**సీన్ 3: రాజమండ్రి సెంట్రల్ జైల్**

అబద్ధంతో చేసిన ప్రయత్నం ఫలించింది. కానీ... చేతిలో ఎక్కువ సమయం లేదు. అప్పటికే రాత్రి 11 గంటలు దాటింది. నాలుగు గంటల వ్యవధి మాత్రమే ఉంది. ఆలోపు సుప్రీంకోర్టు ఉత్తర్వులు రాజమండ్రి జైలు అధికారులకు చేరకపోతే... చేసిన ప్రయత్నమంతా వృథా అవుతుంది. అప్పట్లో... సెల్‌ఫోన్లు లేవు. బ్రేకింగ్ న్యూస్‌లు ఇచ్చే మీడియా లేదు. ఒకవైపు టెన్షన్ పెరిగిపోతుండగానే ఆ బృంద సభ్యులు కేంద్ర హోంశాఖ కార్యదర్శి ఇంటికి వెళ్లారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రతిని ఆయనకు చూపించారు. దీంతో ఆయన ఆంధ్రప్రదేశ్ హోం శాఖ కార్యదర్శికి ఫోన్ చేసి... ఉరిశిక్షను నిలిపివేయాలని ఆదేశించారు. హోం శాఖ కార్యదర్శి ఇదే విషయాన్ని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌కు ఫోన్‌లో చెప్పారు. కలెక్టర్ హుటాహుటిన రాజమండ్రి సెంట్రల్ జైలు అధికారులకు సుప్రీం ఆదేశాల గురించి వివరించారు. ఉరిశిక్షను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించారు. అప్పటికే అర్ధరాత్రి 12గంటలు దాటిపోయింది. జైలు అధికారులు ఒకటి రెండు సార్లు ఈ సమాచారాన్ని ధ్రువీకరించుకున్నారు. చలపతి, విజయవర్ధన్ రావు ఉన్న సెల్ వద్దకు ఇద్దరు అధికారులు వెళ్లారు. ఉరితీత ఖైదీలకు జైలు సిబ్బంది యమ భటుల్లా కనిపించారు. వారితోపాటు ఉరి కంబం వద్దకు బయలుదేరేందుకు ఖైదీలు సిద్ధమయ్యారు. 'మీ ఉరి శిక్ష వాయిదాపడింది. అది చెప్పేందుకే వచ్చాం' అని సిబ్బంది తెలిపారు.

**ఇలా యావజ్జీవమైంది...**

వారం వాయిదా పడిన ఉరి శిక్ష... ఆ తర్వాత యావజ్జీవంగా మారింది. ఆ వారంలోనే అప్పటి ప్రధాని దేవెగౌడ పదవి నుంచి వైదొలిగారు. ప్రభుత్వం కూలిపోయింది. ప్రత్యామ్నాయ ప్రభుత్వ ఏర్పాట్లలో రాష్ట్రపతి బిజీగా ఉన్నారు. ఆదే అదనుగా మానవహక్కుల పరిరక్షణ బృందం మరోసారి సుప్రీంకోర్టు జడ్జీలను కలిశారు. అప్పుడున్న రాజకీయ సంక్షోభ పరిస్థితుల్లో రాష్ట్రపతి నిర్ణయం తీసుకునే అవకాశం లేనందున ఓ మూడు నెలల వ్యవధి ఇమ్మని కోరారు. అప్పటి పరిస్థితుల దృష్ట్యా ఆది సమంజసమే అని కోర్టు భావించింది. ఆ గడువు ముగిసే సమయానికి రాష్ట్రపతి శంకర్‌దయాళ్ శర్మ పదవీ కాలం ముగిసిపోయింది. కేఆర్ నారాయణన్ రాష్ట్రపతి అయ్యారు. దళిత, ప్రజాసంఘాలు, మానవహక్కుల నేతలు మరోసారి నారాయణన్‌తో భేటీ ఆయ్యారు. ఉరిశిక్షను యావజ్జీవ శిక్షగా మార్పించుకోగలిగారు. ఇక్కడితో సీన్ కట్ చేస్తే... చలపతి, విజయవర్ధన్ ప్రస్తుతం నెల్లూరు సెంట్రల్ జైలులోనే ఉన్నారు! యావజ్జీవ ఖైదీలుగా!

# చివరి రోజున ఏకాంతంలోకి!

**జైలు గార్డులతోనూ మాట్లాడని నిర్భయ దోషులు.. ఉరి తాళ్లను పరీక్షించిన తలారి**

న్యూఢిల్లీ, మార్చి 19: ఉరి అనివార్యం, ఇక బయట పడడం అసాధ్యం అని తేలిపోయాక, నలుగురు నిర్భయ దోషుల ప్రవర్తన మారిపోయింది. నిన్న మొన్నటిదాకా వారిలో అసలు భయంగానీ, నిరాశగానీ, పశ్చాత్తాపంగానీ కనబడలేదు. జైలు గార్డులతో సహా అందరితో మామూలుగా మాట్లాడుతూ వచ్చారు. మామూలుగానే భోజనాదికాలు తీసుకునేవారు. ఎలాంటి ఫిర్యాదులూ చేసేవారు కాదు. అలాంటిది ఆఖరిరోజున వారు ఏకాంతంలోకి, నిశ్శబ్దంలోకి జారిపోయారు. ఎవరితోనూ మాట్లాడకుండా తమ గదుల్లో ఓ మూల కూర్చుండిపోయారు. ఎవరూ కన్నీరు పెట్టకపోయినా ఓ రకమైన నిర్లిప్త వైఖరి వారి ముఖాల్లో కనిపించినట్లు ఓ అధికారి చెప్పారు. ప్రస్తుతం ఆ నలుగురినీ మూడో నంబరు జైలులో ఉరితీసే ప్రాంగణానికి పక్కనే వేరు వేరుగదుల్లో ఉంచారు. ఒక్కో దోషి కదలికలనూ ఇరవై నాలుగ్గంటలూ సీసీటీవీ కెమెరాల ద్వారా నలుగురేసి అధికారులు పరిశీలిస్తూ నిఘా పెట్టారు. తొలిసారిగా నలుగురిని ఒకేమారు ఉరితీసే పరిస్థితి రావడంతో ఇందుకోసం రెండు రోజులుగా డమ్మీ ఉరితీత నిర్వహించారు. పవన్ జల్లాడ్ అనే తలారిని ఈ పని నిమిత్తం ప్రత్యేకంగా పిలిపించారు. నలుగురినీ ఉరితీసినందుకు అతనికి రూ 15,000 చెల్లిస్తారు. గురువారం రాత్రి సూపరింటెండ్లతో పాటు నలుగురు అధికారులు ఒక్కో దోషి వద్దకు వెళ్లి మీ చివరి కోరిక ఏమైనా ఉందా.. అని ప్రశ్నించినట్లు సమాచారం. అయితే వారి సమాధానం ఏంటన్నది బయటకు తెలియరాలేదు.

**తాగుబోతులు... తిరుగుబోతులు**

నిర్భయ దోషుల వివరాలను, కుటుంబ చరిత్రను పరిశీలిస్తే వారు తాగుబోతులనీ, తిరుగుబోతులనీ అర్థమవుతుంది.

**రామ్ సింగ్**

2012 డిసెంబరు 16న బస్సును నడిపిన ప్రధాన నిందితుడు. 20 ఏళ్లకిందటే రాజస్థాన్ నుంచి బతుకు తెరువు కోసం ఢిల్లీ వచ్చి రవిదాస్ మురికివాడలో ఉండేవాడు. తాగి వచ్చి అక్కడ ఇరుగుపొరుగు వారితో తరుచూ గొడవ పడేవాడు. అయితే మరణం తప్పదని గ్రహించిన రామ్‌సింగ్ 2013 మార్చిలోనే జైలు గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.



**ముఖేశ్ సింగ్**

వీడు రామ్‌సింగ్‌కు చిన్న తమ్ముడు. బస్సు నడిపినది తానేనని, అన్న కాదని, తాను రేప్ చేయలేదని అడ్డగోలుగా వాదించినా మిగిలిన దోషులు అది నిజం కాదని చెప్పడంతో ఏం చేయలేకపోయాడు.

**ఆరో దోషి (మైనర్)**

అతి కిరాతకంగా నిర్భయను అత్యాచారం చేసి, చిత్రహింసల పాల్జేసిన ఓ వ్యక్తి...మైనర్ అన్న నెపంతో బతికి బయటపడ్డాడు. వీడు రామ్ సింగ్ దగ్గర క్లీనర్‌గా పనిచేసిన వ్యక్తి. అత్యాచార ఘటన జరిగిన రోజు రాత్రి నిర్భయ కడుపులో పేగులను పెకలించినట్లు వార్తాకథనాలు వచ్చాయి. 'మర్ సా.. అని బూతులు తిట్టి ఆమెను కుళ్లబొడిచిన కిరాతకుడు. అతన్ని విడిచిపెట్టడంపై దేశవ్యాప్త చర్చ జరిగింది. 18 కాదు 16 ఏళ్ల వరకే బాలనేరస్థుల గరిష్ఠ వయోపరిమితి ఉండాలన్న డిమాండ్లు వచ్చాయి. ఘటన జరిగేనాటికి అతని వయసు 17 ఏళ్ల 285 రోజులు. అంటే 18 ఏళ్ల కంటే తక్కువ కాబట్టి అతనిని బాలనేరస్థుల బోర్డు విచారణ జరిపింది. అతన్ని మూడేళ్ల తరువాత రహస్యంగా విడుదల చేసి పంపేశారు.

**అక్షయ్ ఠాకూర్**



నేరం జరిగిన రోజు ఢిల్లీలో లేనని, బిహార్‌లోని ఔరంగాబాద్ జిల్లాలో ఉన్న తన స్వగ్రామానికి అంతకు ముందు రోజు అంటే డిసెంబరు 15నే వెళ్లిపోయానని వాదించాడు. నేరం చేసిననాటికి ఇతని వయసు 28 ఏళ్లు. పెళ్లయి ఓ కొడుకు కూడా ఉన్నాడు.



**పవన్ గుప్తా**

నిర్భయను, ఆమె స్నేహితుణ్ని ఇనుపరాడ్‌తో చితగ్గొట్టి, ఆమెను ఈడ్చుకొచ్చినది పవన్ గుప్తాయే. ఆ ఘోరం జరిగేనాటికి 19 ఏళ్ల వాడు. తాను చేయరాని మహాపాపం చేశానని పవన్ ఒప్పుకున్నాడు. ఇతనిని ఎలాగైనా ఉరి నుంచి తప్పించే ఉద్దేశంతో... మైనర్ అని నమ్మించే ప్రయత్నమూ జరిగింది.

**వినయ్ శర్మ**



ఇతను కూడా రవిదాస్ మురికివాడలో రామ్‌సింగ్ ఇంటికి దగ్గర్లోనే ఉండేవాడు. రామ్‌సింగ్‌కు ఫ్రెండు. ఓ జిమ్‌లో శిక్షకుడిగా పనిచేసేవాడు. పాతికేళ్ల వయసు. ఇంగ్లిషులో మాట్లాడగలడు. మొదట ఆ బస్సులో తాను లేనే లేనని బుకాయించాడు. ఆ సాయంత్రం మరో దోషి పవన్ గుప్తాతో కలిసి ఓ సంగీత కార్యక్రమానికి వెళ్లానని కోర్టులో వాదించాడు. నిర్భయ, ఆమె స్నేహితుడి వద్ద ఉన్న డబ్బు, బంగారం దొంగిలించి, అత్యాచారం చేసినవాడు.

## ఏపీలో వన్‌ధన్ కేంద్రాలకు రూ.10కోట్లు

న్యూఢిల్లీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని 11 జిల్లాలలో 211 వన్‌ధన్ కేంద్రాల ఏర్పాటు కోసం రూ.10.64 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ సహాయమంత్రి రేణుకా సింగ్ వెల్లడించారు. గురువారం రాజ్యసభలో వైసీపీ సభ్యుడు విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖిత పూర్వకంగా జవాబిచ్చారు. గిరిజనులు అడవుల్లో సేకరించే చిన్నపాటి అటవీ ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్ ద్వారా అధిక విలువ చేకూర్చేలా గిరిజన సహకార మార్కెటింగ్ అభివృద్ధి సమాఖ్య(ట్రైఫెడ్) ఆధ్వర్యంలో వన్‌ధన్ వికాస్ కేంద్రాల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కడప, కర్నూలు మినహా ఇతర జిల్లాల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. కాగా.. ఆర్గానిక్ పత్తి సాగు ప్రోత్సాహకం కోసం రూ.1185 కోట్ల నిధులు కేటాయించినట్లు కేంద్ర జౌళిశాఖ మంత్రి స్మృతి ఇరానీ రాజ్యసభలో చెప్పారు. సంప్రదాయక, బీటీ పత్తి విత్తనాల సాగుకంటే ఆర్గానిక్ పత్తి సాగుకు అయ్యే వ్యయం తక్కువగా ఉంటుందని తెలిపారు.

## ఎల్వీ సెలవు పొడిగింపు

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఏపీ మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం తన సెలవును మరోమారు పొడిగించుకున్నారు. ఈ నెల 8 నుంచి వచ్చే నెల 26 వరకు (మొత్తం 38 రోజులు) సెలవు మంజూరు చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

# విచారణకు రావలసిందే!

- బొండా, బుద్దాలకు మళ్లీ నోటీసులు
- నా ఆఫీసుకే రావాలి: గురజాల డీఎస్పీ
- కోడ్ ఎత్తివేతతో మారిన స్వరం

గుంటూరు, మార్చి 19: గుంటూరు జిల్లా మాచర్ల, వెల్దుర్తిలో ఈ నెల 11న టీడీపీ నేతలపై జరిగిన హత్యాయత్నం, దాడి ఘటనల నేపథ్యంలో వాంగ్మూలం ఇచ్చేందుకు టీడీపీ నేతలు తన కార్యాలయానికి రావాలని గురజాల డీఎస్పీ శ్రీహరిబాబు తాజాగా మరోసారి నోటీసులు జారీ చేశారు. మాచర్ల నియోజకవర్గ పరిధిలో స్థానిక ఎన్నికల సందర్భంగా టీడీపీ అభ్యర్థులను నామినేషన్ వేయకుండా వైసీపీ నాయకులు బెదిరించడం, నామినేషన్ పత్రాలు గుంజుకోవడం వంటి సంఘటనల నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు పార్టీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, న్యాయవాది కిశోర్ తదితరులు ఈ నెల 11న వెల్దుర్తి బయల్దేరారు. వీరు వస్తున్న విషయం తెలిసి వీరి వాహనాలపై వైసీపీ నాయకులు దాడిచేశారు. మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు తురకా కిశోర్, మరికొందరు ఈ దాడికి పాల్పడ్డారు. కిశోర్ ఓ పెద్ద దుడ్డుకర్రతో టీడీపీ నేతల వాహనాల అద్దాలను ధ్వంసం చేయడమే కాక వారిపై హత్యాయత్నం చేశారు. వైసీపీ కార్యకర్తల రాళ్లదాడిలో న్యాయవాది కిశోర్ తీవ్రంగా గాయపడ్డారు. దాడి అనంతరం టీడీపీ నేతలు వెల్దుర్తి వైపు వెళ్తుండగా.. గురజాల డీఎస్పీ వారిని తన వాహనంలోకి ఎక్కించుకున్నారు. ఆయన వాహనంపైనా వైసీపీ కార్యకర్తలు దాడి చేసి ధ్వంసం చేశారు. ఆయన సమక్షంలోనే మరోసారి టీడీపీ నేతలపై దాడికి యత్నించారు. ఈ ఘటనలపై పోలీసులు మాచర్ల, వెల్దుర్తి పోలీస్ స్టేషన్లలో సుమోటోగా బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించడం.. టీడీపీ అధినేత చంద్రబాబు డీజీపీ ఆఫీసు ముందు ధర్నా చేయడం.. తీవ్రంగా గాయపడిన న్యాయవాది ఆస్పత్రిలో చేరడంతో మెడికో లీగల్ కేసు (ఎంఎల్‌సీ) నివేదిక ఆధారంగా పోలీసులు హత్యాయత్నం సెక్షన్ (307) జోడించారు.





**ఐజీ ప్రకటనకు విరుద్ధంగా..**

ఈ కేసును తొలుత గురజాల సీఐ దుర్గాప్రసాద్‌కు అప్పగించారు. ఈ ఘటనను రాష్ట్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించడంతో గురజాల డీఎస్పీ శ్రీహరిబాబుకు దర్యాప్తు బాధ్యతలు అప్పగించారు. ఈ నెల 17న తన కార్యాలయానికి వచ్చి.. ఆ రోజు ఏం జరిగిందో వాగ్మూలం ఇవ్వాలని ఈ నెల 16న బుద్దా వెంకన్న, బొండా ఉమ, కిశోర్‌లకు ఆయన నోటీసులు జారీ చేశారు. అయితే పల్నాడు ప్రాంతంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో తాము విచారణకు హాజరు కాలేమని టీడీపీ నేతలు బహిరంగంగా ప్రకటించారు. తమ హత్యకు కుట్ర జరుగుతున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై సౌత్ కోస్టల్ జోన్ ఐజీ జె.ప్రభాకరరావు స్పందించారు. అక్కడకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంటే పోలీసు అధికారులే టీడీపీ నేతల వద్దకు వచ్చి వాంగ్మూలం నమోదు చేస్తారని ప్రకటన చేశారు. అనంతర పరిణామాల్లో స్థానిక ఎన్నికలు వాయిదా పడ్డాయి. కోడ్‌ను సుప్రీంకోర్టు ఎత్తివేసింది. దీంతో పోలీసుల స్వరం మారింది. ఐజీ ప్రకటనకు భిన్నంగా మళ్లీ టీడీపీ నేతలకు గురజాల డీఎస్పీ బుధవారం నోటీసులు జారీచేశారు. తన కార్యాలయానికి ఈ నెల 21న స్వయంగా హాజరై వాంగ్మూలం ఇవ్వాలని పేర్కొన్నారు. అక్కడి పరిస్థితులు ఉద్రిక్తంగా ఉన్నాయని.. రక్షణ లేని ప్రాంతానికి రాలేమని టీడీపీ నేతలు స్పష్టం చేస్తున్నారు.

# మధ్యప్రదేశ్‌లో నేడే బలపరీక్ష

న్యూఢిల్లీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌లో రాజకీ య అనిశ్చితికి శుక్రవారం తెరపడనుంది. జ్యోతిరాదిత్య సింధి యా వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేయడంతో మైనారిటీలో పడ్డ కమల్‌నాథ్ సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభు త్వం అసెంబ్లీలో బలాన్ని నిరూపించుకోనుంది. శుక్రవారం అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశపరచాలని ఆ రాష్ట్ర శాసనసభ స్పీకర్ ఎన్‌పీ ప్రజాపతిని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ కార్యక్రమాన్ని సాయంత్రం 5 గంటల్లోగా పూర్తిచేయాలని డీవై చంద్రచుడ్, హేమంత్ గుప్తాలతో కూడిన సుప్రీం బెం చ్ గురువారం స్పష్టం చేసింది. ఓటింగ్ కోసం అసెంబ్లీకి హాజరుకానున్న కాంగ్రెస్ రెబెల్ ఎమ్మెల్యేలకు కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని మధ్యప్రదేశ్, కర్ణాటక డీజీపీలను అదేశించింది. నిర్బంధంలో ఉన్నామన్న భయాందోళనలను తొలగించేందుకు కాంగ్రెస్ రెబెల్ ఎమ్మెల్యేలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చించాలని స్పీకర్‌కు సుప్రీంకోర్టు సూచించింది. లేదంటే తామే ఓ పరిశీలకుడిని నియమిస్తామని పేర్కొంది. ఈ రెండు ప్రతిపాదనలను స్పీకర్ ప్రజాపతి తిరస్కరించా రు. 230 స్థానాలున్న మధ్యప్రదేశ్ అసెంబ్లీలో 2018లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ 114 స్థానాల్లో, బీజేపీ 109 స్థానాల్లో గెలిచాయి. బీఎస్పీ, 2 స్థానాల్లో, ఎస్పీ ఒక స్థానంలో గెలుపొందగా నాలుగు సీట్లలో ఇండిపెండెంట్లు గెలిచారు. సింధియా వర్గానికి చెందిన ఆరుగురు మంత్రులు సహా 22 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేయడంతో కాంగ్రెస్ సర్కారు సంక్షోభంలో పడింది. సుప్రీంకోర్టు ఉత్తర్వుపై న్యాయ సలహా తీసుకుంటామని సీఎం కమల్‌నాథ్ అన్నారు.

## గో.. గో... గొగోయ్!

**విపక్షాల నిరసనల మధ్య గొగోయ్ ప్రమాణం**

న్యూఢిల్లీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు మాజీ ప్ర ధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ గురువారం ప్రతిపక్షాల నిరసనల మధ్య రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణం చేశారు. 'గో, గో, గొగోయ్, డీల్, సిగ్గు.. సిగ్గు' మొదలైన నినాదాలు చేస్తూ కాంగ్రెస్, డీఎంకేతోపాటు ఇతర ప్రతిపక్ష సభ్యులు నిరసన తెలిపారు. ఆయన ప్రమాణ స్వీకారం చేస్తుండగా ఎస్పీ తప్ప మిగతా విపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. రాష్ట్రపతి రాజ్యాంగబద్ధంగా నిర్ణయం తీసుకున్నారని, అభ్యంతరాలుంటే సభ వెలుపల వ్యక్తం చేయాలని రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు చెప్పారు.

**ఇది క్విడ్ ప్రో కో: కాంగ్రెస్**

"గొగోయ్‌ను రాజ్యసభకు నామినేట్ చేయడం క్విడ్ ప్రో కో లాంటిదే. ఇది న్యాయవ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీస్తుంది." అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఆనంద్ శర్మ విమర్శించారు.

# మీకు అర్థమవుతోందా?

- మేం భూములిచ్చింది దేనికి?
- మీరు వాడాలనుకుంటోంది దేనికి?
- ప్రభుత్వాన్ని నిలదీసిన అమరావతి రైతులు
- 93వ రోజు కొనసాగిన ఆందోళనలు

గుంటూరు, తుళ్లూరు, మంగళగిరి, తాడికొండ, మార్చి 19: 'రాజధాని సమస్య మా 29 గ్రామాల ప్రజలది మాత్రమే కాదు. ఇది యావత్ ఆంధ్రుల ఆత్మాభిమానానికి సంబంధించిన విషయం. మా వద్దకు వచ్చి సంఘీభావం తెలపటం కాదు. మీ ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేయండి. మేం వచ్చి పరిస్థితి వివరిస్తాం. ఒక్క వైసీపీ తప్ప అన్ని పార్టీలు అమరావతిని కొనసాగించాలంటున్నాయి. 175 నియోజకవర్గాల్లో పోటీ చేసిన అభ్యర్థులు శిబిరాలు ఏర్పాటు చేయండి' అంటూ అమరావతి ప్రాంత మహిళలు, రైతులు, రైతు కూలీలు పిలుపునిచ్చారు. రాజధానిగా అమరాతినే కొనసాగించాలంటూ వరుసగా 93వ రోజూ(గురువారం) ఆందోళనలు కొనసాగించారు. తుళ్లూరు, మందడంలో మహాధర్నా, వెలగపూడి, రాయపూడి, కృష్ణాయపాలెం, యర్రబాలెం, తాడేపల్లి, నీరుకొండ, పెనమాక, తాడికొండ అడ్డరోడ్డు, పెదపరిమి, తాడేపల్లి తదితర ప్రాంతాల్లో రిలే నిరాహార దీక్షలు, ఆందోళనలు కొనసాగించారు.



తుళ్లూరులో దీక్ష శిబిరంలో మహిళలు, రైతుల నినాదాలు

ప్రజలందరూ అమరావతికి మద్దతు తెలుపుతున్నారని, అది చేతల్లో చూపుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగిద్దామని పిలుపునిచ్చారు.

**బ్లీచింగ్, పారసిటమల్‌తో నిరసన**

అతి భయంకరమైన కోవిడ్-19 ప్రబలకుండా బ్లీచింగ్ చల్లుకొని, పారసిటమల్ మాత్ర వేసుకుంటే సరిపోతుందని సీఎం జగన్ చెప్పారని, అయితే, తమ గ్రామాల్లో బ్లీచింగ్ చల్లిన నాథుడే లేడని రాయపూడిలో రైతులు, మహిళలు పేర్కొన్నారు. గ్రామంలో బ్లీచింగ్ చల్లి, పారాసిటమల్ టాబ్లెట్లు పంపిణీ చేసి వినూత్నంగా నిరసన తెలిపారు. నారాకోడూరు రైతులు శివపార్వతుల వేషాలతో శిబిరాల్లో శివతాండవం చేసి నిరసన తెలిపారు. అమరావతితో పెట్టుకోవటం అంటే భస్మాసుర హస్తమే అంటూ చేసిన నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కాగా, 'మేము భూములు దేనికి ఇచ్చాం. మీరు దేనికి వాడాలనుకుంటున్నారు?' అంటూ సీఆర్‌డీఏ కమిషనర్‌కు అభ్యంతర పత్రం అందజేసేందుకు మందడం రైతులు సిద్ధం చేశారు. కమిషనర్‌కు శుక్రవారం అందజేస్తామని తెలిపారు. యర్రబాలెం, కృష్ణాయపాలెం, నవులూరు, నిడమర్రు గ్రామాల్లో రిలే నిరాహార దీక్షలు 93వ రోజుకు చేరాయి. పలువురు జేఏసీ నాయకులు దీక్ష శిబిరాల్లో పాల్గొని రైతులకు సంఘీభావం తెలిపారు. తాడేపల్లి మండలం పెనుమాక, ఉండవల్లిలోనూ దీక్షలు కొనసాగాయి. తాడికొండ అడ్డరోడ్డులో నిరసనలు 76వ రోజుకు చేరాయి.

**ఇక ఇంటింటికీ 'అమరావతి': జేఏసీ**

అమరావతి పోరులో నీరుకొండవాసులు చేరారు. గ్రామంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని గురువారం జేఏసీ కన్వీనర్ కే శ్రీనివాస్ ప్రారంభించారు. కరోనా సాకుతో శిబిరాలను ఖాళీ చేయిస్తే ఇంటింటికి అమరావతి పేరుతో పోరు సాగిద్దామని ఆయన పిలుపునిచ్చారు.



| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 28,288.23 | 8,263.45 | 40,496 | 35,220 | 75.12 | 28.06 |
| 581.28 | 205.35 | ముంబై 10 గ్రాములు (99.9 శాతం స్వచ్ఛత) 41 | 295 | (86 పైసలు) | |

కరోనా వైరస్ విజృంభణతో భారత కార్పొరేట్ రంగం కుదేలవుతోంది. అవ్యవస్థీకృత వ్యాపారాలూ వెలవెలబోతున్నాయి. ఈ మహమ్మారి వ్యాప్తితో విమానయానం, పర్యాటకం, ఆతిథ్యం, రవాణా, లోహాలు, ఆటో, టెక్స్‌టైల్, ఆభరణాలు, రియల్టీ రంగాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. గిరాకీ కరువైంది.. ఆదాయం పడిపోయింది. ఫలితంగా పలు కంపెనీల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఈ సంక్షోభ పరిణామంలో ఉద్యోగుల భవిష్యత్ అనిశ్చితిలో పడింది. ఎయిర్‌లైన్స్, రెస్టారెంట్లు, హోటళ్లు సహా తదితర సంస్థలు వేతనం లేని సెలవులు.. జీతాల్లో కోతలు.. చిట్టచివరి ప్రత్యామ్నాయంగా ఉద్యోగుల తొలగింపు వంటి చర్యలకు పూనుకుంటున్నాయి. ప్రభుత్వ మద్దతు, ఆర్థిక చేయూతతో పాటు నిబంధనల సడలింపులు, మినహాయింపులిస్తే తప్ప కోవిడ్ ప్రభావిత రంగ కంపెనీలు మళ్లీ నిలదొక్కుకునే పరిస్థితి లేదని ఇండస్ట్రీ ప్రతినిధులంటున్నారు. ఈ నేపథ్యంలో పారిశ్రామిక రంగానికి ఊరట కల్పించడంతోపాటు ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేందుకు కేంద్రం, ఆర్‌బీఐ పరస్పర సహకారంతో ఆర్థిక, ద్రవ్య విధానపరమైన చర్యలకు సిద్ధమవుతున్నట్లు సంకేతాలందుతున్నాయి.

# కరోనా గుప్పిట..

## అన్ని రంగాల్లోనూ భయాందోళనలు

## ఉద్దీపనల కోసం కార్పొరేట్ల డిమాండ్

### ఉద్యోగాలకు కరువైన భద్రత



భారత ప్రభుత్వం కరోనా మహమ్మారిని వచ్చే త్రైమాసికం (ఏప్రిల్-జూన్) చివరినాటికి కట్టడి చేయగలిగితే పరిశ్రమలు తిరిగి కోలుకునేందుకు 6 నుంచి 9 నెలలు పట్టవచ్చని ఇండస్ట్రీ వర్గాలంటున్నాయి. కరోనా ప్రభావంతో భారత పరిశ్రమలు పలు అవాంతరాలు ఎదుర్కొంటున్నాయని, ఈ పరిణామంతో దేశ ఆర్థిక వృద్ధి చక్రం పూర్తిగా గాడితప్పవచ్చని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

**ప్రభుత్వ సాయానికి క్రెడాయ్ డిమాండ్**

గడిచిన కొన్ని నెలల్లో దేశంలో గృహ విక్రయాలు గణనీయంగా తగ్గడంతో పాలు చాలావరకు ప్రాజెక్టుల్లో నిర్మాణాలు నిలిచిపోయాయని క్రెడాయ్ అంటోంది. ఈ నేపథ్యంలో రియల్టీ కంపెనీల రుణ చెల్లింపులకు 3 నెలల మారటోరియం కల్పించాలని, మార్కెట్లో అదనపు ద్రవ్య లభ్యత కోసం చర్యలు తీసుకోవాలని, ప్రస్తుత ప్రాజెక్టుల పూర్తికి అదనపు గడువు ఇవ్వాలని క్రెడాయ్ ప్రభుత్వాన్ని కోరుతోంది. ఇప్పటికే కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు లేఖ కూడా రాసింది.

**సిబ్బందిని తొలగించవద్దు: సీఐఐ**

సవాళ్ల సమయమే అయినప్పటికీ సిబ్బందిని తొలగించవద్దని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తన సభ్య కంపెనీలను కోరింది. గత ఏడాది చివరి నాటికి 9,325 కంపెనీలు ఈ వాణిజ్య మండలి సభ్యత్వం కలిగి ఉన్నాయి.

**ఇంధన డిమాండ్ 11 శాతం డౌన్**

కరోనాతో విమానయానం, రవాణా రంగాలు తీవ్రంగా ప్రభావితం కావడంతో దేశంలో ఇంధన డిమాండ్ మార్చి ప్రథమార్ధంలో 10-11 శాతం తగ్గింది.

**శాఖలకు రావొద్దు: యాక్సిస్ బ్యాంక్**

బ్యాంక్ బ్రాంచీలకు వచ్చే బదులు నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, చాట్‌బోట్ సౌకర్యాలను ఉపయోగించుకోవాలని యాక్సిస్ బ్యాంక్ తన కస్టమర్లను కోరింది. ఈ మేరకు ఖాతాదారులకు ఈ-మెయిల్స్ పంపింది.

**ఉద్దీపనలివ్వండి: ఎఫ్‌హెచ్ఆర్ఏఐ**

కరోనా భయాలతో హోటళ్లు, రెస్టారెంట్లకు కస్టమర్లు భారీగా తగ్గారు. దాంతో ఆతిథ్య సేవల వ్యాపారాలు వెలవెలబోతున్నాయి. నష్టాల్లోకి కూరుకుపోతున్న తమ రంగానికి ఉద్దీపనాలివ్వాలని ఫెడరేషన్ ఆఫ్ హోటల్, రెస్టారెంట్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌హెచ్ఆర్ఏఐ) ప్రభుత్వాన్ని కోరింది.

**ఆర్‌బీఐ సిబ్బందికి వర్క్ ఫ్రం హోమ్**

భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) తన మెజారిటీ ఉద్యోగులకు ఇంటి నుంచే ఆఫీసు పనులు చక్కబెట్టేందుకు అనుమతిచ్చింది. అన్ని రీజియన్ల కార్యాలయాల్లోని సిబ్బందికి ఆర్‌బీఐ ఈ వెసులుబాటు కల్పించింది.

### కంపెనీలకు సెబీ ఊరట

కార్పొరేట్ కంపెనీలకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ కొంత ఊరట కల్పించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసిక (జనవరి-మార్చి) ఆర్థిక ఫలితాలను ప్రకటించేందుకు 45 రోజుల అదనపు గడువు కల్పించింది. దీంతో కంపెనీలకు నాలుగో త్రైమాసిక ఫలితాల ప్రకటనకు జూన్ 30 వరకు సమయం లభించనుంది. అంతేకాకుండా వార్షిక ఫలితాల సమర్పణకు నెల రోజుల అదనపు సమయం ఇచ్చింది. కంపెనీ ఒక బోర్డు సమావేశం తర్వాత మరో సమావేశం నిర్వహణకు పాటించాల్సిన గడువు విషయంలోనూ వెసులుబాటు కల్పించింది. త్రైమాసిక కార్పొరేట్ గవర్నెన్స్ నివేదికల సమర్పణకు గడువును మే 15 వరకు పొడిగించింది.

### ఎయిర్‌లైన్స్‌కు రూ.12,000 కోట్ల ప్యాకేజీ?



దేశీయ విమానయాన రంగాన్ని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.10,000-12,000 కోట్ల విలువైన ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఇందులో భాగంగా ఎయిర్‌లైన్స్‌కు విమాన ఇంధన పన్నుతోపాటు ఇతర పన్నులను తాత్కాలికంగా రద్దు చేసే అవకాశం ఉంది. కాగా, కరోనా ప్రభావం నుంచి ప్రపంచ వ్యాప్త ఎయిర్‌లైన్స్‌ను గట్టెక్కించేందుకు 20,000 కోట్ల డాలర్ల ఆర్థిక సాయం అవసరమని ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) అంచనా వేసింది.

### పని 'తీరు' మారింది

కరోనా నుంచి తమ ఉద్యోగులను కాపాడుకునేందుకు కంపెనీలు పలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ వెసులుబాటు కల్పించడం దగ్గరి నుంచి వారి విదేశీ పర్యటనల రద్దు వరకు పలు చర్యలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉద్యోగుల పని విధానంపై టైమ్స్ జాబ్స్ సర్వే నిర్వహించింది. పలు రంగాలకు చెందిన 1,256 మంది వృత్తి నిపుణుల నుంచి వివరాలు సేకరించింది. కరోనా కారణంగా ఈ మధ్య తమ పని విధానం తీవ్రంగా ప్రభావితమైందని 63 శాతం మంది ఉద్యోగులు అభిప్రాయపడ్డారు. వృత్తి సంబంధిత పర్యటనను రద్దు చేసుకోవాల్సి వచ్చిందని మరో 33 శాతం మంది తెలిపారు. ఐటీ రంగ ఉద్యోగులపై అధిక ప్రభావం పడిందని 27 శాతం మంది చెప్పారు. ఎగుమతి, దిగుమతి వాణిజ్యం (23%) ఆ తర్వాత స్థానంలో ఉంది.

# ఎల్ఐసీకి వైరస్ దెబ్బ

**ఈ ఏడాది పెట్టుబడుల్లో రూ.1.9 లక్షల కోట్ల తరుగుదల**



ముంబై: వ్యక్తులకు సంక్షోభ సమయాల్లో బీమాతో ధీమా కల్పించే భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)కు సైతం కరోనా నుంచి రక్షణ లేకుండాపోయింది. కరోనా విజృంభణతో స్టాక్ మార్కెట్లు పేకమేడలా కుప్పకూలాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు బీఎస్ఈ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ నిఫ్టీ సూచీలు 30 శాతం మేర పతనమయ్యాయి. దీంతో స్టాక్ మార్కెట్లో ఎల్ఐసీ పెట్టుబడుల విలువ కూడా అదే స్థాయిలో కరిగిపోయింది. 2019 డిసెంబరు చివరినాటికి మార్కెట్లో ఎల్ఐసీ మొత్తం పెట్టుబడుల విలువ రూ.6.02 లక్షల కోట్లు. స్టాక్ సూచీల వరుస పతనాలతో కంపెనీ పెట్టుబడుల విలువ ప్రస్తుతం రూ.4.14 లక్షల కోట్లకు పడిపోయింది. అంటే, ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ.1.88 లక్షల కోట్లు (31 శాతం) హరించుకుపోయింది. మార్కెట్లో లిస్టయిన బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీ, ఇన్సూరెన్స్ కంపెనీల్లోని ఎల్ఐసీ పెట్టుబడుల విలువ భారీగా కరిగిపోయింది. ఈ కంపెనీల కారణంగా ఎల్ఐసీ మొత్తం పెట్టుబడుల విలువ 30 శాతం లేదా రూ.56,810 కోట్ల మేర తగ్గిపోయింది. ఆయిల్ అండ్ గ్యాస్ సెక్టార్ రూ.36,020 కోట్లు, సిగరెట్ల తయారీ కంపెనీలు మరో రూ.17,374 కోట్ల మేర పెట్టుబడులను హరించివేశాయి. ఐటీ కంపెనీల్లోని పెట్టుబడుల విలువ రూ.15,826 కోట్ల మేర తగ్గగా.. మెటల్స్ రూ.12,045 కోట్లు, ఆటోమొబైల్ రూ.11,329 కోట్లు, ఇన్‌ఫ్రా కంపెనీలు రూ.10,669 కోట్లు కరిగించివేశాయి.

# వేచి చూడాల్సిందే

### కోవిడ్-19 ప్రభావంపై సీఈఏ సుబ్రమణియన్



న్యూఢిల్లీ: కోవిడ్-19 ప్రభావానికి భారత ఆర్థిక వ్యవస్థ రానున్న నెలల్లో ఏ మాత్రం ప్రభావితం అవుతుందనేది వేచి చూడాలని ముఖ్య ఆర్థిక సలహాదారు కేవీ సుబ్రమణియన్ అన్నారు. ప్రస్తుతం నెలకొన్న అనిశ్చిత స్థితిలో వాస్తవ ప్రభావం ఎంత ఉండవచ్చునని చెప్పడం కష్టమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుత వాతావరణంలో వచ్చే ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో వృద్ధిరేటు ప్రభావితం కాక తప్పదంటూ క్రికెట్‌లో ట్వంటీ ట్వంటీ మ్యాచ్‌ల పరిస్థితితో దీన్ని పోల్చినట్టయితే మొదట్లో మందంగానే ఉన్నా ముందుకు సాగుతున్న కొద్దీ వేగం పుంజుకునే ఆస్కారం ఉన్నదని ఆయన అన్నారు. ఈ కారణంగానే ఏప్రిల్ నెలను వేచి చూడాల్సిన సమయంగా తాను పరిగణిస్తున్నట్టు ఆయన చెప్పారు. ప్రభుత్వం ఫిబ్రవరిలో ప్రకటించిన గణాంకాల ప్రకారం డిసెంబరు త్రైమాసికంలో వృద్ధిరేటు 4.7 శాతం ఉంది.

**నగదు బదిలీపై యోచన**

కోవిడ్-19ని దీటుగా ఎదుర్కొనడంలో భాగంగా నగదు బదిలీ అనేది ప్రభుత్వం పరిశీలిస్తున్న ప్రత్యామ్నాయాల్లో ఒకటని సుబ్రమణియన్ అన్నారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే అసంఘటిత కార్మికులకు నగదు బదిలీని ప్రకటించింది. హాంకాంగ్ ప్రభుత్వం కూడా వెయ్యి కోట్ల డాలర్ల విలువ గల నగదు బదిలీలను ప్రకటించింది. ఇది కూడా ఒక ప్రత్యామ్నాయంగా ఆలోచించవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు. ఆ మహమ్మారి విజృంభణ వల్ల ఏర్పడనున్న పరిస్థితిని ఎదుర్కొనేందుకు తగు చర్యలు తీసుకునేందుకు అవసరం అయిన ఆర్థిక వెసులుబాటు ప్రభుత్వానికి ఉన్నదని ఆయన చెప్పారు.

# అనిల్ అంబానీపై ప్రశ్నల వర్షం

### 9 గంటల పాటు విచారించిన ఈడీ



ముంబై: రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీ.. గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారుల ముందు హాజరయ్యారు. తన నిర్వహణలోని తొమ్మిది కంపెనీలకు యెస్ బ్యాంక్ నుంచి రూ.12,800 కోట్ల రుణాలు తీసుకోవటంపై ఈడీ అధికారులు అనిల్ అంబానీని దాదాపు తొమ్మిది గంటల పాటు ప్రశ్నించారు. ఈ రుణాలు ఇచ్చినందుకు బ్యాంక్ మాజీ ఎండీ, సీఈఓ రాణా కపూర్, ఆయన భార్య బిందు వారి కుమార్తెలకు లేదా వారి నిర్వహణలోని కంపెనీలకు 'ఇతర' చెల్లింపులేమైనా చేశారా? అని ఈడీ అధికారులు గుచ్చిగుచ్చి ప్రశ్నించినట్టు సమాచారం. ఈ నెల 30న మరోసారి తమ ముందు హాజరు కావాలని ఈడీ అధికారులు అంబానీని కోరారు.

**రూ.4,300 కోట్ల ముడుపుల ఖాతా !**

రాణా కపూర్, ఆయన నిర్వహణలోని కంపెనీల ఖాతాల్లో ఈడీ అధికారులు రూ.4,300 కోట్ల అక్రమ నిధులను గుర్తించారు. ఇవన్నీ బడా కంపెనీలకు యెస్ బ్యాంక్ నుంచి ఇచ్చిన రుణాలకు ప్రతిగా 'ముడుపు'ల రూపంలో రాణాకపూర్ కుటుంబానికి అందాయని ఈడీ అధికారులు భావిస్తున్నారు. దీంతో రాణా కపూర్, ఆయన కుటుంబ సభ్యులపై ఈడీ అధికారులు అక్రమ నగదు లావాదేవీల నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసింది.

**రేపు సుభాష్ చంద్ర విచారణ**

ఈ కేసులో జీ గ్రూప్ అధినేత సుభాష్ చంద్రనూ ఈడీ అధికారులు శనివారం ప్రశ్నించబోతున్నారు. ఇందుకోసం ఆయనకు ఇప్పటికే సమన్లు జారీ అయ్యాయి. జెట్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడు నరేశ్ గోయెల్‌తో సహా ఇంకా పలువురు పారిశ్రామికవేత్తలకు ఈడీ ఈ కేసులో నోటీసులు జారీ చేసింది.

### డిజిటల్ లావాదేవీలపై చార్జీలుండవ్

**బ్యాంక్ ఆఫ్ బరోడా వెల్లడి**

న్యూఢిల్లీ: కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో తన కస్టమర్లు వచ్చే మూడు నెలల పాటు నిర్వహించే డిజిటల్ లావాదేవీలపై ఎలాంటి చార్జీలు వసూలు చేయబోమని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) గురువారంనాడు తెలిపింది. ఈ మేరకు 'స్టే సేఫ్.. బ్యాంక్ సేఫ్' పేరుతో కస్టమర్లు డిజిటల్ బ్యాంకింగ్ సర్వీసులు వినియోగించుకునేలా ప్రోత్సహిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు సామాజిక దూరం పాటిస్తున్నారు. చాలా కంపెనీలు వర్క్ ఫ్రమ్ హోమ్‌కు అవకాశం కల్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీఓబీ కూడా తగిన చర్యలు చేపడుతోంది.

### రూ.900 కోట్లకు సంగం టర్నోవర్

**పాల ఉత్పత్తిదారులకు రూ.70 కోట్ల బోనస్**

**చైర్మన్ నరేంద్ర కుమార్ వెల్లడి**



చేబ్రోలు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సంగం డెయిరీ టర్నోవర్ రూ.910 కోట్లకు చేరినట్లు చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. గురువారం నాడిక్కడ పాలకవర్గ సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ.. లాభాల్లో అత్యధిక శాతం పాల ఉత్పత్తిదారులకు బోనస్ రూపంలో అందజేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు. చిత్తూరు జిల్లాలోని రైతులకు రూ.70 కోట్ల మేర బోనస్‌ను జూన్ నుంచి పంపిణీ చేస్తామన్నారు. గుంటూరు జిల్లాలో గేదె పాలకు ప్రతి 100 రూపాయలకు రూ.15, ఆవు పాలకు రూ.14 బోనస్‌గా అందించనున్నట్లు చెప్పారు. ఒంగోలు, నెల్లూరులో గేదె పాలకు లీటరుకు రూ.3, ఆవు పాలకు రూ.2 చేస్తామన్నారు. కాగా చిత్తూరు జిల్లాలో సంగం డెయిరీ గత ఏడాది లీటరుకు రూ.2 చొప్పున పంపిణీ చేసిందని, ఈ ఏడాది కూడా అదే విధంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ డీఐడీఎఫ్ ప్రోగ్రామ్‌లో భాగంగా సంగం డెయిరీ ప్లాంటును రూ.100 కోట్లతో ఆధునికరించటంతో పాటు కొత్త ప్లాంట్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే తొలి దశలో రూ.20 కోట్లతో ప్రాసెసింగ్ ప్లాంట్లను నెలకొల్పినట్లు చెప్పారు. చిత్తూరు జిల్లాలోని మేలుమాయి, 50 వేల లీటర్ల సామర్థ్యం, క్షీరసాగరంలో 30 వేల లీటర్ల సామర్థ్యం గల చిల్లింగ్ సెంటర్లను పూర్తి చేయనున్నట్లు చెప్పారు. సంగం డెయిరీ షేర్ క్యాపిటల్‌ను రూ. 150 కోట్లకు పెంచాలని పాలకవర్గ నిర్ణయం తీసుకుందన్నారు. త్వరలోనే సంగం డెయిరీ నూతన ఉత్పత్తులైన బిస్కెట్లు, మ్యాంగో జూస్ వంటి ఉత్పత్తులు మార్కెట్లోకి ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు.

### బీమా పాలసీలో కరోనాపై సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాల్సిందే

పాలకొల్లు : కరోనా వైరస్ ప్రపంచ దేశాలను వణికిస్తున్న తరుణంలో బీమా సంస్థలు అప్రమత్తమయ్యాయి. పాలసీల పునరుద్ధరణ, నూతనంగా పాలసీలు కొనుగోలు చేసే సందర్భంలోనూ కరోనా వ్యాధికి సంబంధించి పాలసీదారులు సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలని స్పష్టం చేస్తున్నాయి. భారత జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి)తో పాటు పలు బీమా కంపెనీలు గురువారం నుంచి దీన్ని అమల్లోకి తెచ్చాయి. బీమా అభివృద్ధి, నియంత్రణ మండలి (ఐఆర్‌డీఏఐ) సూచన మేరకు బీమా కంపెనీలు పాలసీదారులు తమ పాలసీలను పునరుద్ధరించుకునే సమయంలోనూ, నూతనంగా పాలసీలు కొనుగోలు చేసే సందర్భంలోనూ కరోనా క్వశ్చనీర్‌ను వ్యక్తిగతంగా అందజేయాల్సి ఉంటుంది. ఇటీవల విదేశాలకు వెళ్లి వచ్చారా.. మీరు ప్రవాస భారతీయులా.. మీ సమీప బంధువులు, కుటుంబ సభ్యులు ఇటీవల ఇతర దేశాల నుంచి వచ్చారా? దగ్గు, జలుబు వంటి ఇబ్బందులు ఉన్నాయా? తదితర ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి. ఇప్పటికే పాలసీలు కొనుగోలు చేసి పాలసీలు అమలులో ఉంటే ఆయా పాలసీదారులు ఏ విధమైన డిక్లరేషన్ ఇవ్వాల్సిన అవసరం లేదు.

### పన్ను వివాదాల పరిష్కారం కోసమే వివాద్ సే విశ్వాస్ పథకం

**పీఎంఓ ముఖ్య కార్యదర్శి పీకే మిశ్రా**

అమరావతి (ఆంధ్రజ్యోతి): పన్ను వివాదాలను సులభమైన విధానంలో పరిష్కరించుకునేందుకు 'వివాద్ సే విశ్వాస్' పథకం సువర్ణావకాశమని ప్రధానమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శి పీకే మిశ్రా తెలిపారు. పన్ను చెల్లింపుదారులు, పన్ను స్వీకరణదారులకు మధ్య వివాదాల పరిష్కారానికి ప్రకటించిన వివాద్ సే విశ్వాస్ పథకంపై గురువారం వివిధ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పన్ను వివాదాల పరిష్కారానికి ఈ పథకం సరైన వేదిక అని, వడ్డీ, జరిమానాలు లేకుండా కేవలం పన్ను చెల్లింపుల ద్వారా సంబంధిత వివాదాల పరిష్కారానికి ఇదొక మార్గమని చెప్పారు. ఈ నెల 31లోగా పన్ను వివాదాలను పరిష్కరించుకుంటే వడ్డీ, జరిమానా మినహాయింపులను ఇస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఈ పథకానికి సంబంధించి డిక్లరేషన్లను పన్ను చెల్లింపుదారులు ఆదాయ పన్ను శాఖ ఈ-ఫైలింగ్ పోర్టల్ ద్వారా దాఖలు చేయవచ్చన్నారు. ప్రత్యక్ష పన్ను వివాదాల పరిష్కారానికి ఉద్దేశించిన ఈ పథకాన్ని పన్ను చెల్లింపుదారులు వినియోగించుకోవాలని సూచించారు. ఆదాయ పన్ను కేసులు, వర్క్‌లో ఉన్న కేసుల విషయంలో కోర్టు లిటిగేషన్ల వల్ల ఖర్చులు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో వన్ టైమ్ సెటిల్‌మెంట్ చేసుకునేలా స్థానిక ఆదాయపన్ను అధికారులతో మాట్లాడాలని సీఎస్‌లకు ఆయన సూచించారు.

# 4 రోజులు.. రూ.19 లక్షల కోట్లు

### కరోనా భయాలతో ఇన్వెస్టర్ల సంపద మాయం

### వరుస నష్టాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు



న్యూఢిల్లీ: దేశీయ స్టాక్ మార్కెట్లు కరోనా భయాలతో చిగురుటాకులా వణికిపోతున్నాయి. కరోనా కేసులు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు తమ షేర్లను అందినకాడికి అమ్ముకుంటున్నారు. ఫలితంగా మార్కెట్లలో వరుస పతనాలు నమోదు అవుతున్నాయి. గురువారంనాటి పతనంతో వరుసగా నాలుగు రోజులు దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలతోనే ముగిశాయి. దీంతో ఇన్వెస్టర్లు రూ.19,49,461.82 కోట్లు కోల్పోయారు. ఇప్పుడు బీఎస్ఈలో నమోదైన కంపెనీల మార్కెట్ విలువ రూ.1,09,76,781 కోట్లకు దిగజారిపోయింది. నాలుగు రోజుల్లో సెన్సెక్స్ 5,815.25 పాయింట్లు నష్టపోయింది.

**రోలర్ కోస్టర్ రైడ్...**

ఇన్వెస్టర్లలో నెలకొన్న బలహీన సెంటిమెంట్‌తో గురువారం ప్రారంభంలోనే బీఎస్ఈ సెన్సెక్స్ భారీగా నష్టపోయింది. ఇంట్రాడేలో 2,155.05 పాయింట్ల నష్టాన్ని మూటగట్టుకుంది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో సెన్సెక్స్ లాభాల బాట పట్టింది. ఇది ఒక అరగంట పాటు సాగింది. తర్వాత మళ్లీ నష్టాలు మొదలయ్యాయి. చివరకు సెన్సెక్స్ 581.28 పాయింట్ల నష్టంతో 28,288.23 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 205.35 పాయింట్లు కోల్పోయి 8,263.45 పాయింట్ల వద్ద క్లోజైంది.

"ప్రపంచ మార్కెట్లు ప్రతికూలంగా ట్రేడవుతున్నాయి. కరోనా వైరస్ ప్రభావం ఆర్థిక వ్యవస్థలపై తీవ్రంగా ఉంటుందన్న భయాలతో మార్కెట్లలో అధిక హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి" అని ఆనంద్ రాఠీ షేర్స్ అండ్ స్టాక్ బ్రోకర్స్ ఈక్విటీ రీసెర్చ్ హెడ్ (ఫండమెంటల్) నరేంద్ర సోలంకి తెలిపారు.

"గురువారం నాటి ట్రేడింగ్ దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలకు రోలర్ కోస్టర్ రైడ్‌గా మారింది. భారీ స్థాయిలో హెచ్చుతగ్గులను చవి చూసిన సూచీలు చివరకు 2 శాతానికి పైగా నష్టాలతో ముగిశాయి. ప్రపంచవ్యాప్తంగా బలహీన సెంటిమెంట్ ఆవహించి ఉండటం, విదేశీ నిధులు తరలిపోవడం వంటివి మార్కెట్లను ప్రభావితం చేశాయి" అని రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా అన్నారు. వీటితో పాటు దేశీయంగా కరోనా కేసులు పెరగడం మార్కెట్లలో నిరాశావాదం పెరిగిపోవడానికి కారణమైనట్టు తెలిపారు.

- సెన్సెక్స్‌లోని 30 కంపెనీల షేర్లలో 22 షేర్లు నష్టాలతో ముగిశాయి.
- బజాజ్ ఫైనాన్స్ (10.24 శాతం), మారుతీ సుజుకీ ఇండియా (9.85 శాతం), యాక్సిస్ బ్యాంక్ (9.50 శాతం), ఎం అండ్ ఎం (9.28 శాతం), టెక్ మహీంద్రా (8.43 శాతం), ఓఎన్‌జీసీ షేర్లు (7.35 శాతం) నష్టపోయాయి.
- ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, కోటక్ మహీంద్రా, హీరో మోటోకార్ప్ షేర్లు 7.50 శాతం వరకు పెరిగాయి.
- యెస్ బ్యాంక్ షేరు 11.35 శాతం తగ్గి రూ.53.90 వద్ద ముగిసింది.
- బీఎస్ఈ మెటల్, క్యాపిటల్ గూడ్స్, ఆటో, ఎనర్జీ, ఇండస్ట్రియల్స్ సూచీలు 7.17 శాతం వరకు తగ్గాయి. టెలికాం సూచీ మాత్రం పెరిగింది.
- బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 3.70 శాతం, 4.53 శాతం క్షీణించాయి.
- బీఎస్ఈలో 1,828 షేర్లు నష్టాలతో, 574 షేర్లు లాభాలతో, 146 షేర్లు యథాతథంగా ముగిశాయి.
- 1,200కు పైగా కంపెనీల షేరు ఏడాది కనిష్ఠ స్థాయిని తాకాయి.
- ఆసియా మార్కెట్ల విషయానికి వస్తే దక్షిణ కొరియాకు చెందిన కోస్పీ సూచీ 8 శాతం క్షీణించింది. హాంగ్‌సెంగ్, నిక్కీ, షాంఘై కంపోజిటివ్ సూచీలు కూడా నష్టాల్లోనే ముగిశాయి. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ (ఈసీబీ) ఆశ్చర్యకరంగా 75,000 కోట్ల యూరోల ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించడంతో యూరప్ మార్కెట్లు లాభాలతో ప్రారంభమయ్యాయి.

### 86 పైసలు తగ్గిన రూపాయి

రూపాయి విలువ మరింతగా క్షీణించింది. గురువారం డాలర్ మారకంలో రూపాయి 86 పైసలు తగ్గి సరికొత్త రికార్డు కనిష్ఠ స్థాయి 75.12కు చేరుకుంది. కరోనా వైరస్ వ్యాప్తితో ఆర్థిక మాంద్యం ఏర్పడుతుందన్న భయాలు ఇన్వెస్టర్లను వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో రూపాయి విలువ క్షీణిస్తోంది. దేశీయ ఈక్విటీ, డెట్ మార్కెట్ల నుంచి విదేశీ నిధులు తరలిపోవడం కూడా రూపాయి విలువను ప్రభావితం చేస్తున్నట్టు మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నెలలో ఇప్పటి వరకు విదేశీ ఇన్వెస్టర్లు 1,000 కోట్ల డాలర్ల విలువైన పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు.

### ఆర్ఐఎల్ షేర్లలో కొనసాగిన పతనం

రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) షేర్లలో నష్టాలు కొనసాగుతున్నాయి. వరుసగా నాలుగో రోజూ ఈ షేరు నష్టాన్నే నమోదు చేసుకుంది. గురువారం బీఎస్ఈలో ఆర్ఐఎల్ షేరు 5.34 శాతం క్షీణించి రూ.917.10 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 8 శాతం నష్టంతో రూ.891 (52 వారాల కనిష్ఠం) స్థాయికి చేరింది. ఎన్ఎస్ఈలో 5.24 శాతం తగ్గి రూ.917.70 వద్ద క్లోజైంది. నాలుగు రోజుల్లో ఈ షేరు 17.14 శాతం క్షీణించింది. దీంతో మార్కెట్ విలువ రూ.1,20,311.78 కోట్లు తగ్గిపోయింది. ప్రస్తుతం ఆర్ఐఎల్ మార్కెట్ విలువ రూ.5,81,374.22 కోట్లుగా ఉంది. గత నవంబరులో ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ.10 లక్షల కోట్ల స్థాయికి ఎగబాకింది. కొన్ని నెలల్లో ఇది భారీగా క్షీణించింది.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 19వ తేదీకి.. | | విజయవాడ | 225 |
| హైదరాబాద్ | 210 | విశాఖపట్నం | 275 |
| 20వ తేదీకి.. | | వరంగల్ | 213 |
| చిత్తూరు | 223 | డజను గుడ్లు రూ. | 40 |
| గోదావరి | 225 | | |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 28 | విజయవాడ | 25 |
| వరంగల్ | 28 | గుంటూరు | 25 |
| మహబూబ్‌నగర్ | 28 | ఒంగోలు | 25 |
| కరీంనగర్ | 28 | చిత్తూరు | 30 |
| కర్నూలు | 28 | నెల్లూరు | 30 |
| విశాఖపట్నం | 28 | అనంతపురం | 26 |
| గోదావరి | 28 | | |

### బులియన్



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 40,280 | 41,800 | 41,770 | 41,750 | 40,730 |
| క్రితం ముగింపు | 40,650 | 42,000 | 42,200 | 41,600 | 40,610 |
| 22 క్యారెట్లు | 38,400 | 39,000 | 38,420 | 38,530 | 38,790 |
| క్రితం ముగింపు | 38,730 | 39,000 | 39,000 | 38,800 | 38,680 |
| వెండి (కిలో) | 34,400 | 38,000 | 35,300 | 38,500 | 38,300 |
| క్రితం ముగింపు | 35,000 | 39,000 | 37,000 | 38,500 | 39,000 |

మాస్కులు లేవంటూ విజయవాడ డోర్నకల్‌రోడ్డులోని ఓ మెడికల్ షాపు ముందు బోర్డు పెట్టిన నిర్వాహకులు



# వృద్ధుల రాయితీకి కరోనా కటింగ్

- నేటి నుంచి రైళ్లలో పూర్తి ధర చెల్లించాల్సిందే
- తాజాగా మరికొన్ని రైళ్లు రద్దు

చిత్తూరు కలెక్టరేట్, తిరుపతి (ఆటోనగర్), మార్చి 19: రైలు చార్జీల్లో సీనియర్ సిటిజన్లకు ఇస్తున్న రాయితీని శుక్రవారం నుంచి ఉపసంహరిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కరోనా వైరస్ సీనియర్ సిటిజన్లపై ఎక్కువగా ప్రభావం చూపుతోందని, కనుక వారు ప్రయాణాన్ని వాయిదా లేక రద్దు చేసుకోవాలనే ఉద్దేశంతో ఈ చర్య చేపట్టామన్నారు. శుక్రవారం నుంచే రిజర్వుడు, అన్‌రిజర్వుడు టికెట్లపై వారికి రాయితీని ఉపసంహరించనున్నట్టు తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణిస్తే టికెట్ పూర్తి ధర వసూలు చేస్తారు. కాగా, కరోనా నేపథ్యంలో ఇప్పటికే పలు రైళ్లను రద్దు చేసిన రైల్వే శాఖ తాజాగా మరికొన్ని రైళ్లను రద్దు చేసింది. వారాంతంలో నడిచే తిరుపతి-జమ్మూతావి(22705, 22706) హమ్ సఫర్ ఏసీ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 24 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు రద్దుచేసినట్లు ఆయన మరో ప్రకటనలో తెలిపారు. తిరుపతి-కేఎస్ఆర్ బెంగళూరు ఎక్స్‌ప్రెస్(22618, 22617)లను ఏప్రిల్ 1 వరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

# కరోనా దుష్ప్రభావాన్ని మోదీ విశదీకరించారు

- ఆయన సూచనలు పాటిద్దాం: చంద్రబాబు

అమరావతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భారత్‌లో కరోనా వైరస్ ప్రభావంతో ఏర్పడిన తీవ్ర పరిస్థితులను ప్రధాని మోదీ స్పష్టంగా విశదీకరించారని టీడీపీ అధినేత చంద్రబాబు తెలిపారు. దేశానికిది క్లిష్ట సమయమని, గట్టిగా ఎదుర్కోవాలని.. సామాజిక దూరం పాటిద్దామని గురువారం ట్వీట్ చేశారు. ప్రధాని జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో మన భద్రత కోసం చేసిన సూచనలను తు.చ. తప్పకుండా పాటిద్దామని పిలుపిచ్చారు. టీడీపీ శ్రేణులు, జనం ఐక్యంగా ఈ భయానక వైరస్‌పై పోరాడాలని కోరారు.

# విద్యార్థులను తీసుకురండి: రామ్మోహన్

న్యూఢిల్లీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ నేపథ్యంలో ఫిలిప్పీన్స్‌లో చిక్కుకున్న భారతీయ విద్యార్థులను స్వదేశానికి తీసుకురావడానికి చొరవ తీసుకోవాలని కేంద్రానికి టీడీపీ ఎంపీ రామ్మోహన్‌నాయుడు విజ్ఞప్తి చేశారు. గురువారం లోక్‌సభ ప్రత్యేక ప్రస్తావనల సమయంలో మాట్లాడుతూ వీరిలో 41 మంది ఏపీకి చెందిన వారు, 30-40 మంది తెలంగాణ వారు ఉన్నారని.. ప్రత్యేక విమానం ద్వారా తీసుకురావాలని అభ్యర్థించారు.

# మూడో పాజిటివ్ కేసు!

## విశాఖలో వెలుగు చూసిన కొవిడ్-19





నిర్మానుష్యంగా కనిపిస్తున్న విజయవాడ ఎయిర్‌పోర్టు, కరోనా అనుమానిత వ్యక్తిని అంబులెన్స్ ఎక్కిస్తున్న దృశ్యం

- మక్కా నుంచి వచ్చిన వ్యక్తికి నిర్ధారణ
- ఇంకా ధ్రువీకరించని వైద్యాధికారులు
- పెరుగుతున్న అనుమానితులు
- ఒంగోలు వాసికి సపర్యలు చేసిన ఆర్టీసీ ఉద్యోగికీ కరోనా లక్షణాలు
- ఇంటర్ మూల్యాంకనం బహిష్కరణ
- ఏఎన్‌యూ పరీక్షలు వాయిదా

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో కరోనా వైరస్ కోరలు చాస్తోంది. రెండో పాజిటివ్ కేసు నమోదై 24 గంటలైనా గడవక ముందే మరో కేసు వెలుగుచూసింది. విశాఖపట్నంలో ఒక వ్యక్తికి కరోనా పాజిటివ్ వచ్చింది. అయితే ఈ విషయాన్ని వైద్యాధికారులు ధ్రువీకరించాల్సి ఉంది. అధికారికంగా నిర్ధారణ అయితే రాష్ట్రంలో పాజిటివ్ కేసుల సంఖ్య మూడుకి చేరినట్టవుతుంది. కరోనా అనుమానిత లక్షణాలతో ఇటీవల నలుగురు వ్యక్తులు విశాఖలోని ఛాతీ ఆస్పత్రిలో చేరారు. వారి నుంచి సేకరించిన నమూనాలను ల్యాబ్‌కు పంపగా.. ఒకరికి కరోనా పాజిటివ్ వచ్చినట్టు తెలిసింది. విశాఖకు చెందిన ఆ వ్యక్తి (50) ఇటీవల మక్కాకు వెళ్లి వారం క్రితం నగరానికి తిరిగొచ్చారు. మూడు రోజుల నుంచి జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతూ ఛాతీ ఆస్పత్రిలో చేరారు. అలాంటి లక్షణాలతోనే విదేశాల నుంచి వచ్చిన మరో ముగ్గురు కూడా ఆస్పత్రిలో చేరారు. వారి నమూనాలు సేకరించి హైదరాబాద్‌కు పంపించారు. గురువారం సాయంత్రం ఆ నాలుగింటిలో ఒకటి పాజిటివ్ అని నివేదిక వచ్చింది. ప్రభుత్వానికి నివేదించాక అధికారికంగా ప్రకటిస్తారు.

### ఐసోలేషన్‌కు ఆర్టీసీ ఉద్యోగి

నెల్లూరులో ఆర్టీసీ ఉద్యోగికి కరోనా వైరస్ సోకిందన్న అనుమానంతో ఐసోలేషన్ వార్డుకి తరలించారు. అతడి నుంచి నమూనాలు సేకరించి తిరుపతి స్విమ్స్‌కు పంపించారు. శుక్రవారం ఈ నివేదిక వచ్చే అవకాశం ఉంది. కరోనా పాజిటివ్‌తో ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితుడు నెల్లూరుకు చెందిన ఆర్టీసీ బస్‌లో వచ్చారు. ఆయనకు ఈ ఉద్యోగి సపర్యలు చేశారు. కాగా.. నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని ఐసోలేషన్ వార్డుకు ఇప్పటి వరకూ 12 మందిని ఇప్పటి వరకు తరలించగా.. వారిలో ఆరుగురి ఆరోగ్యం మెరుగవ్వడంతో ఇంటికి పంపించివేశారు. మరో ఆరుగురు చికిత్స పొందుతున్నారు. కరోనా వైరస్ ప్రభావంతో నెల్లూరులో నర్సింగ్ కళాశాలలు సైతం మూతపడ్డాయి.

### శానిటైజర్ల కొరత.. బ్లాక్ మార్కెట్

కరోనా వైరస్‌ను ఎదుర్కొనేందుకు వ్యక్తిగత, సామూహిక పరిశుభ్రత పాటించడం ఒక్కటే సరైన మందు అని వైద్యులు ప్రకటిస్తున్న నేపథ్యంలో శానిటైజర్ల వాడకం పెరిగింది. దీంతో మార్కెట్‌లో హ్యాండ్ శానిటైజర్ల కొరత ఏర్పడింది. ఆన్‌లైన్‌లోనూ దొరకడం కష్టంగా మారింది. దీన్ని అదనుగా చేసుకొని కొందరు శానిటైజర్లను బ్లాక్‌మార్కెట్ చేయడం.. నకిలీ శానిటైజర్లను విక్రయించడం చేస్తున్నారు. గత 10 రోజుల్లో కృష్ణా జిల్లావ్యాప్తంగా సుమారు 50వేల శానిటైజర్లను అధిక ధరలకు విక్రయించినట్లు సమాచారం.

### ఇంటర్ మూల్యాంకనం బహిష్కరణ

కరోనా ప్రభావం ఇంటర్ మూల్యాంకనంపైనా పడింది. గురువారం ఈ ప్రక్రియ ప్రారంభం కాగా.. తొలిరోజే నెల్లూరు జిల్లాలో అధ్యాపకులు మూల్యాంకనాన్ని బహిష్కరించారు. దేశవ్యాప్తంగా కరోనా వైరస్ వ్యాపిస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం దీన్ని ఏర్పాటు చేయడం ఎంతవరకు సబబని వారు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 31 వరకు మూల్యాంకనాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

### ఏఎన్‌యూ యూజీ, పీజీ పరీక్షలు వాయిదా

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) పరిధిలో జరగాల్సిన యూజీ, పీజీ పరీక్షలను కరోనా కారణంగా వాయిదా వేసినట్లు పరీక్షల నిర్వహణాధికారులు ఉషారాణి, వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. డిగ్రీ పరీక్షల ప్రారంభ తేదీని ఈ నెల 20 నుంచి 31వ తేదీకి, పీజీ పరీక్షలను ఏప్రిల్ 3 నుంచి 13వ తేదీకి మార్పు చేశామన్నారు.

### విజయవాడ విమానాశ్రయం వెలవెల

కరోనా ఎఫెక్ట్‌తో విజయవాడ విమానాశ్రయం వెలవెలబోయింది. వారం రోజులుగా సగటున 500కు పైగా ప్రయాణికుల సంఖ్య తగ్గిపోతున్నట్టు విమానాశ్రయ ఉన్నతాధికారులు తెలిపారు. హైదరాబాద్‌కు నడిచే విమాన సర్వీసును ట్రూజెట్ ఎయిర్‌లైన్స్ ఏప్రిల్ 20 వరకు రద్దు చేసింది. ఇటీవలే ట్రూజెట్ సంస్థ హైదరాబాద్‌కు రూ.1,100 చార్జీ నిర్ణయించింది. అయినా ఆదరణ లేక తాత్కాలికంగా రద్దు చేయాలని నిర్ణయించింది. బెంగళూరుకు వెళ్లే విమాన సర్వీసును స్పైస్ జెట్ సంస్థ రద్దు చేసింది. ఇండిగో, ఎయిరిండియా సంస్థలు సర్వీసుల కుదింపునకు సన్నాహాలు చేస్తున్నాయి.

### పెరుగుతున్న అనుమానిత కేసులు

విజయనగరం జిల్లాలో తొలి అనుమానిత కేసు బయటపడింది. ఇటీవలే టాంజానియా నుంచి వచ్చిన 32 ఏళ్ల వ్యక్తి జ్వరం, దగ్గు, జలుబుతో ఆస్పత్రికి వచ్చాడని సూపరింటిండెంట్ సీతారామరాజు తెలిపారు. అతని శాంపిల్స్‌ను పరీక్షల కోసం పంపిచామన్నారు. ప్రస్తుతం అతన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని ఐసోలేషన్ గదిలో ఉంచి వైద్యసేవలందిస్తున్నారు. ఇటీవల నెదర్లాండ్స్ నుంచి జిల్లాకు వచ్చిన ఐదుగురు విదేశీయులకు కూడా పరీక్షలు నిర్వహించగా వారంతా ఆరోగ్యంగా ఉన్నట్టు తేలింది. కడప జిల్లా రైల్వేకోడూరు మండలానికి చెందిన వ్యక్తిని కరోనా అనుమానంతో రిమ్స్‌కు తరలించారు. చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఆ వ్యక్తి 15 రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. గొంతు నొప్పి, తీవ్ర జ్వరం, జలుబు, ఊపిరి పీల్చుకోవడం కష్టంగా ఉండడంతో వెంటనే రిమ్స్‌కు తరలించినట్లు ఆరోగ్య విస్తరణాధికారి మార్టిన్ లూథర్ వివరించారు.

# 'ప్రకాశం'లో కలవరం

- కరోనా పాజిటివ్ యువకుడికి రిమ్స్‌లో చికిత్స
- మరో మహిళ ఐసోలేషన్ వార్డుకు తరలింపు
- అంగన్‌వాడీ కేంద్రాలు, కోచింగ్ సెంటర్లు మూత

ఒంగోలు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కరోనా ప్రకాశం వాసులను కలవరపెడుతోంది. ఇప్పటివరకు రాష్ట్రంలో రెండు పాజిటివ్ కేసులు నమోదు కాగా అందులో ఒకటి ఒంగోలులో వెలుగు చూడటంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. అలాగే సమీప గ్రామానికి చెందిన మహిళను గురువారం కరోనా అనుమానంతో ఐసోలేషన్ వార్డుకు తరలించారు. తక్షణ చర్యలపై దృష్టి సారించిన అధికారులు ఒంగోలు నగరంలో సినిమా థియేటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, కోచింగ్ సెంటర్లన్నింటినీ మూసివేయించారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం.. నగరంలోని జడ్పీకాలనీకి చెందిన 23ఏళ్ల యువకుడు లండన్ నుంచి ఈ నెల 15న ఒంగోలు వచ్చాడు. అప్పటికే వ్యాధి లక్షణాలు ఉన్నట్లు అనుమానం రావడంతో ఆ రోజే గుంటూరు వెళ్లి వైద్యులను సంప్రదించినట్లు సమాచారం. 16న ఆ యువకుడి ఇంటికి వెళ్లిన వైద్యశాఖ సిబ్బంది అతడిని రిమ్స్‌లోని ఐసోలేషన్ వార్డుకు తరలించి చికిత్స ప్రారంభించారు. శాంపిల్స్‌ను తిరుపతిలోని ల్యాబ్‌కు పంపించగా బుధవారం రాత్రి పొద్దుపోయాక పాజిటివ్ అని తేలింది. దీంతో కలెక్టర్ పోలా భాస్కర్ అర్ధరాత్రి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జడ్పీకాలనీతో పాటు పరిసర పలు కాలనీల్లో ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. రిమ్స్‌తో పాటు మార్కాపురం, చీరాల, కందుకూరు ప్రభుత్వ వైద్యశాలల్లో ఐసోలేషన్ వార్డులు ఏర్పాటుచేశారు.

### పోలీసులతో రిమ్స్‌కు తరలింపు

జిల్లాకు ఫిబ్రవరి 10నుంచి ఇప్పటివరకు 292మంది విదేశాల నుంచి రాగా వారందరి వివరాలు, ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తున్నారు. ఒంగోలు సమీపంలోని ఒక గ్రామానికి చెందిన 45ఏళ్ల మహిళ 4రోజుల క్రితం అమెరికా నుంచి వచ్చారు. బుధవారం రాత్రి ఆమెను రిమ్స్‌కు తరలించేందుకు అధికారులు ప్రయత్నం చేయగా గ్రామస్థులు అడ్డుకున్నారు. దీంతో గురువారం ఉదయం పోలీసులు రంగప్రవేశం చేసి ఆమెను రిమ్స్‌లోని ఐసోలేషన్ వార్డుకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఇదిలాఉండగా కరోనా పాజిటివ్ అని తేలిన యువకుడు గురువారం మధ్యాహ్నం రిమ్స్ నుంచి పారిపోయే ప్రయత్నం చేశాడన్న ప్రచారం కలకలం రేపింది. అయితే ఆస్పత్రి అధికారులు మాత్రం అలాంటిదేమీ లేదని కొట్టిపారేస్తున్నారు. అతడిపాటు హైదరాబాద్ నుంచి బస్సులో అద్దంకి ప్రాంతానికి చెందిన మరోవ్యక్తి ప్రయాణించగా అతడిని గుర్తించి వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. అయితే అతనికి వ్యాధి లక్షణాలు లేవని తేల్చారు. జిల్లాలో ప్రస్తుతం పదివేలం కేంద్రాల్లో ప్రస్తుతం పొగాకు కొనుగోళ్లు జరుగుతుండగా నిత్యం వందలాది మంది రైతులు అక్కడికి వస్తుంటారు. వారికి కరోనాపై అవగాహన చర్యలు చేపట్టడంతో పాటు శనివారం నుంచి వేలం ప్రక్రియను ఆపేయాలని బోర్డు అధికారులు నిర్ణయించారు.

# రాష్ట్రవ్యాప్తంగా మాల్స్ మూత

- సినిమా హాళ్లు, ప్రధాన ఆలయాలు కూడా..
- రెస్టారెంట్లు, బార్లలోనూ 'కరోనా' జాగ్రత్తలు
- ఉగాది ఉత్సవాలపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు
- శుభకార్యాలు వాయిదా వేసుకోండి: మంత్రి ఆళ్ల నాని



అమరావతి, గుంటూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సినిమా హాళ్లు, మాల్స్, మేజర్ ఆలయాలు, మసీదులు, చర్చిలు మూసివేస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఆళ్ల నాని చెప్పారు. గురువారం సచివాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఆలయాల్లో దర్శనాలు ఆపేస్తున్నప్పటికీ కైంకర్యాలు, నిత్యపూజలు జరుగుతాయని చెప్పారు. తిరుమల, శ్రీశైలం, శ్రీకాళహస్తి, సింహాచలం దేవస్థానాల్లో దర్శనాలు నిలిపివేస్తున్నట్టు చెప్పారు. ఇంకా ఏయే ఆలయాలు మూసేయాలనే అంశంపై దేవదాయ శాఖ నుంచి సమాచారం అడిగామన్నారు. అలాగే, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులను పరిమితంగా తీసుకెళ్లాలని రవాణా శాఖకు ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు. బస్సులో ఎన్ని సీట్లుఉన్నాయో అంత మేరకే జనాన్ని తీసుకెళ్లాలని సూచించామన్నారు. ఐటీ ఉద్యోగులు, వర్క్ ఫ్రమ్ హోం అవకాశం ఉన్న ఇతర ఉద్యోగులు ఇంటి నుంచి పనిచేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విజయవాడ, తిరుపతి, కాకినాడల్లో కరోనా శాంపిల్స్ పరీక్షించే ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. త్వరలో అనంతపురంలోనూ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. ఇటీవల విదేశాల నుంచి ఏపీకి తిరిగి వచ్చిన వారు 6,000 మంది ఉన్నారని కేంద్రం సమాచారం ఇచ్చిందని, వలంటీర్లు, వైద్యశాఖ సిబ్బంది సహకారంతో అలాంటి మరో 6,000 మందిని గుర్తించామన్నారు. వీరందరినీ హోమ్ ఐసోలేషన్‌లో ఉంచి పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. విమానాశ్రయాల్లో ఇప్పటి వరకు 8000 మందికి స్క్రీనింగ్ చేశామని, వారిలో 800 మందిని ఐసోలేషన్‌కు పంపామని తెలిపారు. రాష్ట్రంలో ఉగాది ఉత్సవాల నిర్వహణపై ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. వీలైతే వివాహాది శుభకార్యాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. కుదరని పక్షంలో పరిమిత సంఖ్యలో మాత్రమే అతిథులను పిలిచి కార్యక్రమం నిర్వహించుకోవాలన్నారు. రెస్టారెంట్లు, బార్లకు కూడా కొన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించామని చెప్పారు. రెండు టేబుళ్ల మధ్య మీటర్ దూరం ఉండాలని, శానిటైజర్స్ తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని సూచించినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 85 వెంటిలేటర్లు సిద్ధంగా ఉన్నాయని, మరో 100 వెంటిలేటర్లు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ప్రతి బోధనాస్పత్రిలోనూ ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేసినట్టు మంత్రి పేర్కొన్నారు. కాగా, సినిమా హాల్స్, జిమ్‌లు, స్విమ్మింగ్ పూల్స్, మ్యూజియంలు, కల్చరల్ సెంటర్లు ఈనెల 31 వరకు తెరవడానికి వీల్లేదని ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని శాఖల విభాగాధిపతులు కచ్చితంగా అమలు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఈనెల 20 నుంచి 31వ తేదీ వరకు సినిమా థియేటర్లను మూసివేయనున్నట్లు సురేశ్ మూవీస్ ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ జిల్లా మేనేజర్ మాదల రత్తయ్యచౌదరి తెలిపారు. 31 తర్వాత కరోనా తీవ్రత, ప్రభుత్వ నిర్ణయాలకు అనుగుణంగా భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు.

# 683 మంది విడుదలకు చర్యలు

- కువైత్ బాధితులపై కేంద్రం వివరణ

న్యూఢిల్లీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కువైత్‌లోని పదిలక్షల మంది భారతీయుల్లో ఇబ్బందులకు గురవుతున్న 683 మందిని తిరిగి వెనక్కి రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్ వెల్లడించారు. గురువారం రాజ్యసభలో బీజేపీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అడిగిన ఒక ప్రశ్నకు ఆయన లిఖితపూర్వకంగా జవాబిచ్చారు. ఏపీ ప్రభుత్వంతోపాటు పార్లమెంటు సభ్యులు, అధికారులు కువైత్ నుంచి వలసదారులను వెనక్కి రప్పించేందుకు అనేక వినతులు చేశారని తెలిపారు. అక్కడ ఇబ్బంది పడుతున్న వారంతా ఇళ్లల్లో పని చేసే వారేనని చెప్పారు.





ఖాళీగా ఉన్న విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ పరిసరాలు, నిత్యం రద్దీగా ఉండే విజయవాడ రైల్వేస్టేషన్ గురువారం ఇలా బోసిపోయింది

# శ్రీవారి దర్శనానికి బ్రేక్

- నేటినుంచి వారం రోజులు అమల్లో
- ఘాట్‌రోడ్లు, మెట్ల మార్గాలు మూత
- దుర్గమ్మ అంతరాలయ దర్శనం రద్దు
- నేటినుంచి సత్యదేవుడి వ్రతాలకు బ్రేక్
- సింహాచలంలో దర్శనాలు నిలిపివేత

## సర్వం బంద్

తిరుమల, మార్చి 19: కరోనా ప్రభావంతో నేటినుంచి వారంరోజుల పాటు తిరుమల శ్రీవారి దర్శనాన్ని నిలిపివేయనున్నారు. తిరుమల వచ్చిన భక్తబృందంలో ఒక వృద్ధుడు కరోనా లక్షణాలతో ఆస్పత్రిలో చేరడం కలకలం సృష్టించింది. దీంతో ప్రభుత్వ అనుమతులతో టీటీడీ ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. శ్రీవారి దర్శనానికి అనుమతిని రద్దుచేసి, సన్నిధిలో కైంకర్యాలు, సేవలు ఏకాంతంగా కొనసాగించనున్నారు. భక్తులకు అన్నిరకాల దర్శనాలు రద్దుచేస్తూ, ఘాట్‌రోడ్లను గురువారం మధ్యాహ్నమే మూసివేశారు. రాత్రి కల్యాణకట్ట, అన్నదానాలు కూడా మూతపడ్డాయి. ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్ నుంచి తిరుమలకు వచ్చిన ఓ భక్తబృందంలో సుమారు 65ఏళ్ల వయస్సు కలిగిన వృద్ధుడు తీవ్ర జ్వరం, జలుబు, దగ్గు, శ్వాసకు సంబంధించిన ఇబ్బందులతో తిరుమలలోని అశ్విని ఆస్పత్రిలో చేరాడు. కరోనా లక్షణాలున్నాయనే అనుమానంతో అతడ్ని తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. వృద్ధుడితో పాటు వచ్చిన 110మంది యాత్రికులు బసచేసిన మాధవ నిలయం వసతి సముదాయానికి వైద్యాధికారులు చేరుకుని బృందం సభ్యులు బయటకు వెళ్లకుండా గేట్లు వేశారు. ఇది తిరుమలలో మొదటి కరోనా అనుమానిత కేసు కావడంతో టీటీడీ ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో ధర్మారెడ్డి గురువారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. శుక్రవారం నుంచి వారంపాటు భక్తులను దర్శనానికి అనుమతించబోమని ప్రకటించారు. నిత్యం లక్షమందికి పైగా భక్తులు సందర్శించే తిరుమలకు 'హైరిస్క్' ఉన్న దృష్ట్యా ఈ నిర్ణయాలు తీసుకున్నట్టు ఈవో పేర్కొన్నారు. గతంలో 1892లో తిరుమలో శ్రీవారి ఆలయాన్ని రెండు రోజుల పాటు మూసివేశారని, ఆ తర్వాత ఇలాంటి పరిస్థితి ఇప్పుడు తలెత్తిందని చెప్పారు. టీటీడీ తీసుకున్న నిర్ణయాలను ఆయన వివరించారు.

తిరుమల ఆలయంలోకి శుక్రవారం ఉదయం 9.30 గంటల వరకే భక్తులకు ప్రవేశం. ఆ తర్వాత అనుమతి లేదు. ఈ వారం రోజులు శ్రీవారికి కైంకర్యాలు, సేవలు ఏకాంతంగా నిర్వహణ. ఘాట్‌రోడ్లు, కాలినడక మార్గాలు, అన్నదానం, కల్యాణకట్టలు మూసివేత. అడ్వాన్సుగా పొందిన సేవాటికెట్ల విషయం త్వరలో నిర్ణయం తీసుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తారు. ఉద్యోగులు, స్థానికులు మాత్రం గుర్తింపు కార్డులతో ఘాట్‌రోడ్లలో ప్రయాణించే అవకాశం. ఆలయంలో జరిగే ఉత్సవాలు, సేవలన్నీ ఎస్వీబీసీ ద్వారా ప్రసారం. వారం పాటు టీటీడీ అనుబంధ ఆలయాల్లో భక్తుల ప్రవేశాలు రద్దు. ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణోత్సవం ఏకాంతంగా నిర్వహిస్తారు. తిరుపతి కోదండరామస్వామి ఆలయంలో 22నుంచి జరిగే బ్రహ్మోత్సవాలు ఆలయం వరకే పరిమితం.

- బెజవాడ కనకదుర్గమ్మ గుడిలో నిత్య ఆర్జిత సేవలను, అంతరాలయ దర్శనాలను గురువారం నుంచి నిలిపివేశారు. ఈ నెలాఖరు వరకు ఇదే పరిస్థితి కొనసాగనుంది. ముఖమండపం నుంచి నుంచి మాత్రమే భక్తులను దర్శనానికి అనుమతిస్తున్నారు. భక్తులందరికీ థర్మల్ సెన్సార్లతో పరీక్షించిన తర్వాతే దర్శనానికి పంపుతున్నారు. మహామండపం మీదుగా భక్తులను పైకి తీసుకువెళ్లే నాలుగు హైపవర్ లిఫ్టులను మూసివేశారు. కొండపైకి దేవస్థానం నడుపుతున్న బస్సు సర్వీసులు నిలిపివేశారు. అమ్మవారికి నిత్య కైంకర్యాలు యథావిధిగా కొనసాగుతాయని దేవస్థానం అధికారులు పేర్కొన్నారు. 25న ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం, ఇతర సేవల్లో పాల్గొనేందుకు భక్తులను అనుమతించరు.
- అన్నవరం సత్యదేవుడి ఆలయంలో భక్తులకు వ్రతాలు, సర్వదర్శనాలను శుక్రవారం నుంచి నిలిపివేస్తున్నట్టు ఈవో త్రినాథరావు తెలిపారు. స్వామికి నిత్య కైంకర్యాలు, త్రికాలార్చనలను అర్చకస్వాములు యథావిధిగా నిర్వహిస్తారన్నారు.
- సింహాచలం దేవస్థానంలో శుక్రవారం నుంచి భక్తులకు దర్శనాలు నిలిపివేస్తున్నట్టు కార్యనిర్వాహణాధికారి మారెళ్ల వెంకటేశ్వరరావు ప్రకటించారు.
- శ్రీశైలంలో దర్శనాల నిలిపివేతపై అధికారులు సమాలోచనలు జరుపుతున్నారు. ఇప్పటికే ఆర్జితసేవలు, స్పర్శదర్శనం నిలిపివేశారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు నిషేధించారు.

### 31వరకూ దర్శనాలు లేవు

అమరావతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ నేపథ్యంలో దేవదాయశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. నేటి నుంచి ఈనెలాఖరు వరకు రాష్ట్రంలోని ఆలయాలకు భక్తులను అనుమతించకూడదని నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా ఆదేశాలు జారీ చేయాలంటూ దేవదాయశాఖ కమిషన్ ఎం.పద్మ ఆ శాఖ ముఖ్యకార్యదర్శి ఉషారాణికి గురువారం లేఖ రాశారు. కరోనా ప్రభావంతో ఆలయాల్లో భక్తుల సంఖ్య తగ్గిపోయిందని, ఇప్పటికే పలు నిరోధక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అయితే అన్ని ఆలయాల్లో పూజలు, సేవలు యథావిధిగా జరుగుతాయని తెలిపారు.

# 128 ఏళ్ల తర్వాత..!

- శ్రీవారికి భక్తులు దూరం
- ఆలయం తెరిచి ఉన్నా దర్శనం లేదు
- తిరుమల చరిత్రలో ఇదే మొదటిసారి

తిరుమల, మార్చి 19: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి దాదాపు 128 ఏళ్ల తర్వాత భక్తులు కొద్దిరోజుల పాటు దూరం కానున్నారు. వందల ఏళ్ల క్రితం నుంచి గోవిందుడి దివ్యమంగళ స్వరూపాన్ని కోట్లాదిమంది దర్శించుకుని పునీతులవుతున్నారు. క్రీ.పూ.1వ శతాబ్దంలో తిరుమల కొండపై చీమలపుట్టతో కప్పబడిన స్వామి విగ్రహాన్ని తొలిగా తొండమాన్ చక్రవర్తి దర్శించి ఆ విగ్రహం చుట్టూ చిన్నమండపాన్ని కట్టించారట. అప్పటివరకు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉన్న మూలమూర్తికి మండపం ఏర్పాటు చేసిన తర్వాత శ్రీనివాసుడు భక్తుల పూజలు అందుకోవటం ప్రారంభమైంది. ఆ తర్వాత పల్లవులు, చోళులు, పాండ్యులు, విజయనగర రాజులు, బ్రిటిష్ పాలకులు, ఆర్కాటు నవాబులు, మహంతులు స్వామిని ఆరాధించి సేవలందించారు. క్రమేపీ శ్రీవారి వైభవం విశ్వవ్యాప్తి చెందడంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు దర్శనం నిమిత్తం తిరుమలకు రావడం సంప్రదాయంగా మారింది. ఎంతోమంది తిరుమల క్షేత్రాన్ని పాలించినప్పటికీ సాయంత్రమైతే దట్టమైన అడవిలో ఉన్న ఆలయం మూగబోవాల్సి వచ్చేది. అప్పట్లో అర్చకులు ఉదయాన్నే కొండెక్కి ఆలయాన్ని తెరిచి శుద్ధి అనంతరం నైవేద్యం సమర్పించేవారు. మధ్యాహ్నం వరకు భక్తులకు దర్శనం కల్పించి చీకటి పడేలోపు తిరిగి వెళ్లిపోయేవారట. ఎన్ని ఇబ్బందులున్నా స్వామికి కైంకర్యాలు, భక్తులకు దర్శనం నిలిపినట్టు చరిత్రలో ఎక్కడా లేదు. 1892లో మాత్రం జీయర్లు, మహంతులకు మధ్య వివాదం కారణంగా రెండు రోజుల పాటు ఆలయాన్ని మూసివేశారు. ఆ సందర్భంలో స్వామి కనీస నైవేద్యాలు, పూజలకు కూడా నోచుకోలేదని చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. ఆ తర్వాత క్షేత్రాన్ని అభివృద్ధి చేయడంలో భాగంగా ఆలయం చుట్టూ నివాసాలు ఏర్పాటు చేయాలని 1910లో అప్పటి మహంతులు వివిధ ప్రాంతాల నుంచి జనాల్ని రప్పించి ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు వ్యాపారాలు, ఇళ్ల కోసం భూములు లీజుకిచ్చారు. దాంతో తిరుమల పట్టణంగా మారడంతో రాత్రిపూట బసచేసే భక్తుల సంఖ్య కూడా పెరిగింది. ప్రస్తుతం చంద్ర, సూర్యగ్రహణ సందర్భాల్లో మాత్రమే తాత్కాలికంగా కొన్ని గంటల పాటు ఆలయాన్ని మూసివేస్తున్నారు. అలాగే 1975-80 వరకు మాడవీధుల వెంబడి ఉన్న ఇళ్లలో ఎవరైనా చనిపోతే శవాన్ని తీసుకెళ్లే సందర్భాల్లో మాత్రమే ఆలయాన్ని కొన్ని గంటలు మూసివేసి, దర్శనాన్ని రద్దు చేసేవారు. 1958 నుంచి 1970, 1982, 1994, 2006 అష్టబంధన బాలాలయ మహాసంప్రోక్షణ క్రతువు సమయంలో కూడా భక్తుల సంఖ్య తక్కువగానే ఉన్నా, దర్శనం రద్దులాంటి నిర్ణయాలు తీసుకోలేదు. 2018 ఆగస్టులో మహాసంప్రోక్షణ సమయంలో దర్శనాన్ని రద్దు చేయాలని తొలుత నిర్ణయం తీసుకున్నప్పటికీ భక్తుల నుంచి విమర్శలు రావడంతో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని పరిమిత సంఖ్యలో దర్శనానికి అనుమతించారు. కరోనా నేపథ్యంలో భక్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని టీటీడీ తీసుకున్న తాజా నిర్ణయంతో వారంరోజుల పాటు శ్రీవారికి భక్తులు దూరం కానున్నారు. తిరుమల చరిత్రలో ఆలయం తెరిచి ఉన్నప్పటికీ దర్శనానికి దూరం కావడం ఇదే మొదటిసారి.

# యూపీ భక్తుడికి నెగిటివ్

తిరుపతి(వైద్యం), మార్చి 19: ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్ నుంచి తిరుమలకు వచ్చిన దయాశంకర్(65) అనే వృద్ధుడికి కరోనా సోకలేదని స్విమ్స్ వైద్యులు ధ్రువీకరించారు. కరోనా లక్షణాలు ఉన్నాయన్న అనుమానంతో ఆ భక్తుడిని గురువారం మధ్యాహ్నం తిరుమల నుంచి స్విమ్స్‌కు తరలించారు. కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అతని నుంచి శాంపిల్స్ సేకరించి వైరాలజీ సెంట్రల్ ల్యాబ్‌కు పంపించారు. ఆరు గంటల పాటు పరీక్షించిన వైద్యులు దయాశంకర్‌కు కరోనా లేదని రిపోర్టు ఇచ్చారు. ప్రస్తుతం ఆ భక్తుడికి ఆయాసానికి చికిత్స అందిస్తున్నామని, ఆరోగ్యం కుదుటపడ్డాక డిశ్చార్జి చేస్తామని వైద్యాధికారులు తెలిపారు. కాగా, ఈ వృద్ధుడి వెంట వచ్చిన 110 మంది మీర్జాపూర్ భక్తులను కూడా తిరుమల నుంచి పంపివేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.



# కట్టడికి రెడీ!

- పట్టణ ప్రణాళికను విడుదల చేసిన పురపాలక కమిషనర్ విజయ్‌కుమార్
- రూ. 35 కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు
- స్వీయ క్వారంటైన్‌లకు ఇళ్లకే రేషన్

అమరావతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు అవసరమైన అన్ని చర్యలతో కూడిన పకడ్బందీ కార్యాచరణ ప్రణాళికను అమలు పరచనున్నట్లు పురపాలక శాఖ కమిషనర్ జేఎస్సార్కేఆర్ విజయ్‌కుమార్ వెల్లడించారు. ఇప్పటి వరకూ రాష్ట్రంలో కేవలం రెండు కరోనా పాజిటివ్ కేసులు మాత్రమే బయల్పడినప్పటికీ, ఈ ప్రాణాంతక వ్యాధి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రబలకుండా ఉండేలా చూడాలన్న ముఖ్యమంత్రి ఆదేశానుసారం ఈ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించామన్నారు. దీనిపై ఇప్పటికే అన్ని నగర పాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీలు, పట్టణాభివృద్ధి సంస్థలకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షించేందుకుగాను జిల్లాస్థాయిలో నోడల్ ఆఫీసర్లను నియమించామని, ఉచిత టోల్ ఫ్రీ నంబర్లు కలిగిన ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేయనున్నట్లు విజయ్‌కుమార్ పేర్కొన్నారు. కరోనా వ్యాధి నియంత్రణకు అవసరమైన పరికరాలు, శానిటైజర్లు, సోడియం హైపో క్లోరైడ్, బ్లీచింగ్ పౌడర్ ఇత్యాది వాటి కొనుగోలుకు రూ.35 కోట్లతో ఒక ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. విజయవాడలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో విజయ్‌కుమార్ రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో అమలు పరచనున్న యాక్షన్ ప్లాన్ గురించి తెలియజేశారు. ప్రభుత్వపరంగా తాము ఎన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నప్పటికీ ప్రజలు కూడా పరిస్థితి తీవ్రతను గ్రహించి, తమతో పూర్తిగా సహకరించడంతోపాటు బాధ్యతగా ప్రవర్తిస్తేనే కరోనా మహమ్మారిని కట్టడి చేయగలమని ఆయన అభిప్రాయపడ్డారు. విద్యా సంస్థలు, కోచింగ్ కేంద్రాలు, సమ్మర్ స్పెషల్ క్యాంప్‌లు తాత్కాలికంగా మూసివేయిస్తున్నప్పటికీ ఇప్పటికే ప్రారంభమైన పరీక్షలను మాత్రం నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నిర్వహించేందుకు అనుమతిస్తామని, అయితే వాటికి హాజరయ్యే విద్యార్థులను పరీక్షలు పూర్తయిన వెంటనే వారివారి గృహాలకు పంపివేయాలని నిర్వాహకులను ఆదేశించినట్లు చెప్పారు. తమకుగానీ, తమ కుటుంబసభ్యులకుగానీ కరోనా వైరస్ సోకిందేమోనన్న అనుమానం కలిగితే వెంటనే స్వీయ నిర్బంధంలోకి వెళ్లిపోవాలని, ఆ సమయంలో తమకు అవసరమైన నిత్యావసరాలు దొరకవేమోననే ఆందోళన చెందనక్కర్లేదన్నారు. వాటిని ఆయా వార్డు వలంటీర్ల ద్వారా ప్రభుత్వమే అందజేస్తుందని ఆయన తెలిపారు.

### క్లోరినేషన్ తర్వాతే నీటిసరఫరా

కరోనా వైరస్‌ను నిరోధించడంలో వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను స్వచ్ఛంగా ఉంచుకోవడం ఎంతైనా అవసరమని విజయ్‌కుమార్ స్పష్టం చేశారు. "మార్కెట్లు, రైతు బజార్లు, పబ్లిక్ టాయ్‌లెట్లు, ఉద్యానవనాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు తదితర బహిరంగ స్థలాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టనున్నాం. ఇందుకు అవసరమైన సోడియం హైపో క్లోరైడ్, క్రెసాల్, బ్లీచింగ్ పౌడర్ ఇత్యాది అన్నింటినీ తగినంత పరిమాణంలో సమకూర్చుతున్నాం. బహిరంగ స్థలాల్లో క్రిమిసంహారక చర్యల కోసం ఫాగింగ్ మెషీన్లు, స్ప్రేయర్లను సిద్ధం చేశాం. బహిరంగ ఆహారశాలలు, ఫుడ్ స్ట్రీట్స్, హోటళ్లు, రెస్టారెంట్లు, మెస్‌లు తప్పనిసరిగా నిర్దేశిత ఆహార ప్రమాణాలను పాటించాల్సిందే. మారుమూల ప్రాంతాలకు సరఫరా అవుతున్న మంచినీటిని పూర్తిస్థాయిలో క్లోరినేషన్ చేయడం ద్వారా సురక్షితంగా మలుస్తాం" అని వివరించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సినిమా థియేటర్ల తాత్కాలిక మూసివేతకు ఆదేశాలిచ్చిందని ఆయన తెలిపారు. "పట్టణ ప్రాంతాల్లోని పార్కులు, క్రీడా మైదానాలు, ప్లే జోన్లు, ఇండోర్ ఎంటర్‌టైన్‌మెంట్ కేంద్రాలు, అన్ని రకాలైన సమ్మర్ క్యాంప్‌లు, ఈత కొలనులు, రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌ల్లో ఉండే బహుళ క్రీడా సముదాయాలు, హోటళ్లు తదితరాలను తాత్కాలికంగా మూసివేస్తున్నాం. అన్ని ఆధ్యాత్మిక- సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్సవాలు, జాతర్లతోపాటు అంతర్జాతీయస్థాయి కాన్ఫరెన్స్‌లు, సమావేశాలు, వర్క్‌షాప్‌లను వాయిదా వేసుకోవాలి" అని కోరారు. ఈ కార్యక్రమాలన్నీ అమలయ్యేలా చూసేందుకుగాను ప్రతి ఒక్క పట్టణ స్థానిక కేంద్రంలో నోడల్ ఆఫీసర్‌గా ఒక సీనియర్ అధికారిని నియమిస్తామన్నారు. ర్యాపిడ్ రెస్పాన్స్ టీంను, టోల్ ఫ్రీ నంబర్ కలిగిన మానిటరింగ్ సెల్స్ లేదా లోకల్ ఎమర్జన్సీ సెంటర్లను ఏర్పాటు చేసి, వాటి ద్వారా ఫిర్యాదులను 24 గంటలూ స్వీకరిస్తామన్నారు.

### తప్పుడు వార్తల వ్యాప్తిపై వేటేస్తాం..

పట్టణ సచివాలయాల్లోని సిబ్బంది సేవలను కరోనా కట్టడిలో విస్తృతంగా వినియోగించుకోనున్నట్టు విజయ్‌కుమార్ తెలిపారు. ప్రధానంగా ప్రచారంపై దృష్టి పెడుతున్నామని వివరించారు.

- శానిటైజేషన్‌పై లోకల్ కేబుల్ టీవీ, ఎఫ్.ఎం. రేడియో, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టంలలో ప్రచారం..
- మార్కెట్లు, అపార్ట్‌మెంట్లు, ప్రజలు చేరే ఇతర ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు...
- అనుమానిత కేసుల గుర్తింపు కోసం ఇంటింటి నిఘాను చేపట్టేందుకు బృందాలు..
- ప్రజల్లో కరోనా పట్ల భయోత్పాతం కలిగించేలా తప్పుడు వార్తలను ప్రచారం చేసే వారిని గుర్తించి, కఠిన చర్యలు.

### ఇలా చేయండి...

- ఉద్యోగుల హాజరు నమోదుకు ఉపయోగించే బయో మెట్రిక్ వ్యవస్థను ఆపివేయాలి.
- ప్రవేశద్వారాల వద్ద థర్మల్ స్క్రీనింగ్‌ను ఏర్పాటు చేయాలి. సోషల్ డిస్టాన్స్ పాటించాలి.
- రెస్టారెంట్లు, హోటళ్లు తదితర ప్రదేశాల్లో టేబుళ్ల మధ్య కనీసం 3 అడుగుల ఖాళీ ఉండేలాగానూ, వ్యక్తుల మధ్య మీటరు దూరం ఉండేలా చూడాలి.
- ఇప్పటికే బుక్ చేసుకొన్నవారిని మినహాయించి కొత్తగా కల్యాణ మండపాల ఆర్డర్లను తీసుకోవద్దు.
- సాధ్యమైనంత వరకూ ఉద్యోగులు ఇంటి నుంచే పని చేసుకునే (వర్క్ ఫ్రం హోం) వీలు కల్పించాలి. దీనిపై ప్రైవేటు యాజమాన్యాలకు ఆదేశాలు జారీ.
- సమావేశాలను వాయిదా వేసుకోవాలి. మరీ తప్పనిసరైతే వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా జరుపుకోవాలి.
- ఉద్యోగులు, ప్రజలు తరచుగా చేతులను శుభ్రపరచుకునేందుకు కావలసిన హ్యాండ్ శానిటైజర్లు, డిస్పెన్సర్లను అన్ని ప్రదేశాల్లో ఉంచాలి.
- కరచాలనం లేకఆలింగనం వద్దనే సూచనలను, కరోనా నిరోధానికి చేయదగిన,చేయదగని పనులను సూచించే బోర్డుల ఏర్పాటు.



గురువారం బోసిపోయిన సచివాలయ ప్రాంగణం



**ప్రజలకు సేవలు అందించాలి.. భయపెట్టొద్దు**
**కరోనాపై చర్యలకు నిపుణులతో కమిటీ**
**యాప్‌తో ఇంటింటి సర్వే విశ్లేషణ**
**అధికారులకు సీఎం జగన్ దిశానిర్దేశం**

# ధైర్యం నింపండి!

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కరోనా వ్యాప్తి నివారణకు చర్యలు చేపడుతూనే, ప్రజల్ని తీవ్ర ఆందోళనకు గురిచేసేలా వ్యవహరించొద్దని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. వారిలో భయాన్ని కాకుండా, ధైర్యం నింపాలని సూచించారు. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వైద్యపరంగా తీసుకోవాల్సిన చర్యలపై నిపుణులైన వైద్యులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా సీఎం నిర్దేశించారు. వైరస్ నివారణ చర్యలపై జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ఇంటింటి సర్వేలో భాగంగా గ్రామ, వార్డు వలంటీర్లతో స్థానిక కుటుంబాలతోపాటు విదేశాల నుంచి వచ్చిన వారి గురించీ వివరాలు సేకరించామని అధికారులు చెప్పారు. అనంతరం సీఎం మాట్లాడుతూ 'మనకు గ్రామ, వార్డు వాలంటీర్ల వ్యవస్థ ఉంది. హెల్త్‌అసిస్టెంట్లు, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లతో మ్యాపింగ్ చేయించాలి. వీరితోపాటు మహిళా పోలీస్, గ్రామ, వార్డు ఉద్యోగులంతా సచివాలయంలో యాప్‌తో అందుబాటులో ఉండాలి. ప్రతి 50ఇళ్ల డేటాతో ఎప్పటికప్పుడు తాజా పరిస్థితుల వివరాలు తెప్పించి, సంబంధిత వైద్యసిబ్బందిని అప్రమత్తం చేయాలి' అని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం 2పాజిటివ్ కేసులున్నాయని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. వ్యవసాయ అనుబంధ రంగాలపై కరోనా చూపిన ప్రభావాన్ని సీఎం అడిగి తెలుసుకున్నారు. జొన్న, మొక్కజొన్న రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిత్యావసర వస్తువుల ధరలపై నిఘా పెట్టాలని అధికారులను ఆదేశించారు. కాగా, కరోనా వ్యాప్తి నివారణ కోసం ప్రజలకు ప్రభుత్వం కొన్ని సూచనలు, అధికారులకు ఆదేశాలను జారీ చేసింది. ఈ నిర్ణయాలన్నీ ఈనెల 31వరకు అమలు చేయాలని సమీక్ష సమావేశంలో నిర్ణయించారు. కరోనా శరవేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో కలెక్టరేట్లు, రెవెన్యూ కార్యాలయాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సర్కారు ఆదేశించింది. ప్రభుత్వ వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరించే కలెక్టర్లు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ప్రజల నుంచి వినతులు, విన్నపాలను ఈమెయిల్, పోస్ట్, ఇతర రూపాల్లో తెప్పించుకోవాలని, సమూహాలకు దూరంగా ఉండాలని రెవెన్యూశాఖ ఉన్నతాధికారి ఒకరు.. కలెక్టర్లకు నిర్దేశించారు.

### సామాజిక దూరం పాటించాలి: గిరిజా శంకర్

కరోనా (కొవిడ్-19) వైరస్ నిరోధానికి సంబంధించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ గిరిజాశంకర్ అధికారులను ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారులు, జడ్పీ సీఈవోలతో గురువారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సమూహాలకు దూరంగా ఉన్నప్పుడే మందుల్లేని ఇలాంటి వైరస్‌లను నివారించగలమని, సామాజిక దూరాన్ని పాటించడం ద్వారా వ్యాప్తిని తగ్గించవచ్చని అన్నారు. విద్యాసంస్థలు, సాంస్కృతిక సామాజిక కేంద్రాలు, సినిమాహాళ్లు తదితర జనాలు గుమికూడే వాటిని మూసేయాలన్నారు. విద్యార్థులు ఇంటి వద్దే ఉండాలని, ఉద్యోగులు ఇంటి నుంచే పని చేసేలా ప్రైవేట్ సంస్థలు చర్యలు తీసుకోవాలన్నారు.

# అందరికీ మాస్కులు అవసరం లేదు

- సీఎంవో అదనపు సీఎస్ పీవీ రమేశ్



అమరావతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కరోనా భయంతో ప్రజలంతా మాస్కులు ధరించాల్సిన అవసరం లేదని సీఎంవో అదనపు ప్రధాన కార్యదర్శి పీవీ రమేశ్ స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కరోనా కట్టడికి అన్ని ముందస్తు చర్యలూ తీసుకున్నామని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. సాధారణ ఫ్లూ లక్షణాలైన జలుబు, దగ్గు, స్వల్ప జ్వరం ఉంటే ప్రతి 6 గంటలకొకసారి పారాసిటమాల్ మాత్ర వేసుకుంటూ ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటే కోలుకోవచ్చని చెప్పారు. జ్వరం 101 డిగ్రీలు దాటి, శ్వాస తీసుకోవడం కష్టంగా ఉన్నవారు 104కి ఫోన్ చేస్తే సిబ్బంది వచ్చి వారిని ఆస్పత్రికి తీసుకెళ్తారని చెప్పారు. 60 ఏళ్లు పైబడిన వారు, ముఖ్యంగా బీపీ, షుగర్, కిడ్నీ వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కరోనా గురించి అందరికంటే ముందు సీఎం జగన్ అప్రమత్తమయ్యారని, ఫిబ్రవరిలోనే వైరస్ కట్టడి కోసం వైద్య ఆరోగ్యశాఖకు రూ.400 కోట్లు విడుదల చేశారని సీఎంవో ముఖ్యఅధికారి హరికృష్ణ అన్నారు. వీటన్నింటికీ ప్రచారం కల్పిస్తే ప్రజలు ఆందోళనకు గురవుతారనే ఉద్దేశంతో బయటపెట్టలేదని చెప్పారు.

### ఉద్యోగులకు 50-50 ఫార్ములా..

దేశవ్యాప్తంగా కరోనా వ్యాప్తి కారణంగా శాఖాధిపతుల కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు సంబంధించి కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ గురువారం మార్గదర్శకాలు విడుదల చేసింది. దీని ప్రకారం హెచ్‌వోడీల్లోని బీ, సీ విభాగాలకు చెందిన ఉద్యోగుల్లో సగం మంది ఇంటి నుంచి, సగం మంది కార్యాలయం నుంచి పనిచేయాలని సూచించింది. ప్రతి వారానికొకసారి ఈ డ్యూటీలు మార్చాలని పేర్కొంది. ఏప్రిల్ 14 వరకు ఈ నిబంధనలే పాటించాలని డీవోపీటీ ఆదేశించింది.

### సీఎంలతో నేడు ప్రధాని వీడియో కాన్ఫరెన్స్

దేశంలో కరోనా కేసులు రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం సాయంత్రం అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. కరోనా కారణంగా విదేశాల్లో మూతబడుతున్న విద్యాసంస్థలు, కార్యాలయాల నుంచి వెనక్కి వచ్చేస్తున్న భారతీయుల కోసం ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్‌లో రెండు కంట్రోల్ రూములు ఏర్పాటు చేస్తున్నట్టు సాధారణ పరిపాలన శాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. సందేహాల నివృత్తి కోసం ఏపీ సచివాలయంలోని కంట్రోల్ రూమ్ నంబర్లు 8971170179, 8297259070కు ఫోన్ చేయవచ్చని చెప్పారు. ఢిల్లీ కంట్రోల్ రూమ్‌కు 9871999055, 9871999059 నంబర్లు అని తెలిపారు. జీఏడీ డిప్యూటీ సెక్రటరీ జె. వెంకటమురళి 9515113245 ఫోన్ నంబరుతో ఈ రెండు కంట్రోల్ రూములకు సంబంధించి వాట్సాప్ గ్రూప్ నిర్వహిస్తారని, వీటికి కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారని చెప్పారు. కరోనా నేపథ్యంలో శానిటైజర్ల వినియోగం అధికమైనందున వాటికి డిమాండ్ పెరగకుండా ఉండేందుకు తయారీదార్లకు కావాల్సినంత ఇథనాల్‌ను సరఫరా చేయాలని ఎక్సైజ్‌శాఖ నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి తెలిపారు. తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలని వైద్యులు సూచిస్తుండటంతో శానిటైజర్లకు డిమాండ్ ఏర్పడి ధరలు పెరిగిపోతున్నాయి.



నిర్మానుష్యంగా గన్నవరం ఎయిర్‌పోర్ట్

# ఏమిటీ నిర్లక్ష్యం..?

- కరోనా అనుమానితులకు వైద్యం చేయని డాక్టర్లు
- మందులు రాసి ఇంటికి పంపేస్తున్నవైనం
- విజయవాడలో బాధితులకు చేదు అనుభవం
- ఐసోలేషన్ వార్డుకు పీజీలే దిక్కు

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కరోనా అనుమానితులకు వైద్యం చేసేందుకు డాక్టర్లు నిరాకరిస్తున్నారు. వైరస్ తమకు అంటుకుంటుందన్న భయమో..? అనుమానితుల పట్ల నిర్లక్ష్యమో తెలియదుగానీ చికిత్స అందించడానికి మాత్రం ఇష్టపడడం లేదు. క్షేత్రస్థాయిలో సిబ్బంది కరోనా అనుమానితులను నయానో భయానో వాదించి ఒప్పించి బెదిరించి మరీ ఐసోలేషన్ వార్డులున్న బోధనాస్పత్రులకు తరలిస్తున్నారు. కొందరు స్వచ్ఛందంగా వస్తున్నారు. తీరా అక్కడి వైద్యులు తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారు. నిబంధనల ప్రకారం అనుమానితులు ఐసోలేషన్‌కు వచ్చిన తర్వాత జనరల్ మెడిసిన్, పల్మనాలజీ వైద్యులు పరీక్షించాలి. విజయవాడ వైద్యులు కొందరు అనుమానితులతో ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. 'కేవలం జ్వరం ఉందని వచ్చేస్తారా..? మీకు కరోనా లేదు. ఇక్కడ నుంచి వెళ్లిపోండి' అంటూ దురుసుగా ప్రవర్తిస్తున్నారు. వారం క్రితం ప్రసాద్ అనే వ్యక్తి అమెరికా నుంచి వచ్చారు. మూడు రోజుల నుంచి ఆయన జ్వరం, దగ్గుతో బాధపడుతున్నారు. స్వయంగా ఆస్పత్రికి వచ్చి కరోనా వైరస్ సోకిందేమోనన్న అనుమానం ఉందని వైద్యులకు వివరించారు. వెంటనే డ్యూటీ డాక్టర్లు ఆయన్ను ఐసోలేషన్ వార్డుకు తరలించారు. అనుమానిత కేసు వచ్చిందని పల్మనాలజిస్ట్‌ను పిలిపించారు. హడావుడిగా వార్డుకు వచ్చిన ఆయన.. ప్రతిదానికీ ఎందుకు పిలుస్తున్నారని విరుచుకుపట్టారు. అమెరికా నుంచి వచ్చానని.. జ్వరంగా ఉందని ప్రసాద్ చెప్పగా.. మందులిస్తారు.. తీసుకుని వెళ్లిపొండని సదరు వైద్యుడు బదులిచ్చారు. సరే మందులు ఇవ్వండని ప్రసాద్ అడుగగా... అక్కడున్న పారామెడికల్ సిబ్బందిని పిలిచి.. పారాసిటమల్, సిట్రజిన్ రాసి పంపించేయండని డాక్టర్ ఆదేశించారు. ఇదే అనుభవం శ్రీలంక నుంచి వచ్చిన మరో వ్యక్తికి కూడా ఎదురైంది. ఈ సంఘటనలను విజయవాడ సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లినా ఆయన పట్టించుకోలేదని బాధితులు చెబుతున్నారు. కీలక సమయంలో విధులు విస్మరిస్తున్న వైద్యులపై ఆ ఇద్దరు అనుమానితులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కాగా, ఐసోలేషన్ వార్డుల్లో అనుమానితులకు కనీసం అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయి వైద్యులు వైద్యం అందించాలి. ఈ వార్డులకు పీజీ విద్యార్థులనే పరిమితం చేస్తున్నారు. అనుమానితులకు పీజీలే పరీక్షలు నిర్వహిస్తున్నారు.

### డీజీపీ సారూ.. సామాన్యులను కలవరా: సుంకర

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): 'అధికారపక్షానికి చెందిన మంత్రులూ, ఎమ్మెల్యేలను తప్ప ప్రతిపక్ష నేతనూ, సామాన్యులనూ కలవరా?' అని డీజీపీ గౌతమ్ సవాంగ్‌ను ఏపీసీసీ సమన్వయ కమిటీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ ప్రశ్నించారు. వైసీపీ ఎమ్మెల్యేలు గురువారం డీజీపీని కలిసేందుకు అవకాశం ఇవ్వడంపై సుంకర పద్మశ్రీ ఓ ప్రకటనలో స్పందించారు. అధికారపక్షం కోసమే జీతం తీసుకుంటున్నట్లుగా డీజీపీ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తమపై పెడుతున్న అక్రమ కేసుల గురించి వివరించేందుకు అమరావతి పరిరక్షణ సమితి సభ్యులు ఎన్నిసార్లు డీజీపీని కలిసేందుకు ప్రయత్నించినా అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్ర డీజీపీగా సామాన్యులను కూడా కలవాలని, వారి సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేయాలని పద్మశ్రీ విజ్ఞప్తి చేశారు.

# ఎట్టకేలకు కదలిక!

- బెట్టు వీడి మెట్టు దిగిన రాష్ట్ర ప్రభుత్వం
- వైరస్ నియంత్రణకు హడావుడిగా చర్యలు
- విదేశాల నుంచి వచ్చినవారిపై కొరవడిన నిఘా
- 4వేల మంది ఆచూకీ కోసం ఆరోగ్యశాఖ కసరత్తు

అమరావతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కరోనా కట్టడిపై రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు కదిలింది. రాష్ట్రంలో రెండు పాజిటివ్ కేసులు నమోదైతే తప్ప ప్రభుత్వంలో చలనం లేదు. స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడితే తప్ప కదలిక రాలేదు. ఆలస్యంగా స్పందించిన ప్రభుత్వం బెట్టు వీడి మెట్టు దిగి రాష్ట్రంలోని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించింది. ఇప్పుడు హడావిడిగా ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టింది. మొన్నటి వరకూ కరోనా వైపు కన్నెత్తి చూడని సీఎం జగన్ రెండు రోజుల వ్యవధిలో రెండుసార్లు అత్యవసర సమావేశం నిర్వహించారు. వైరస్ నివారణ చర్యలపై శుక్రవారం జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. దీనికోసం ఢిల్లీ, సచివాలయంలో కరోనా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. వీటికి జీఏడీ డిప్యూటీ సెక్రటరీ జె.వెంకటమురళిని కో-ఆర్డినేటర్‌గా నియమించారు. కంట్రోల్ రూమ్ కార్యకలాపాలు, కరోనా నియంత్రణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను పర్యవేక్షించేందుకు ఆరోగ్యమంత్రి ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్, పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మేడపాటి వెంకట్‌తో ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీని ప్రభుత్వం నియమించింది. మొన్నటివరకూ స్థానిక ఎన్నికల్లో నిమగ్నమైన ఆరోగ్యశాఖ మంత్రి ఇప్పుడు తెరపైకి వచ్చారు. మూడు వారాల నుంచి అధికారులు ఏం చేస్తున్నారో.. రాష్ట్రంలో కరోనా ప్రభావం ఏ స్థాయిలో ఉందో అన్న విషయాలు గాలికి వదిలేసి, ఇప్పుడు హడావిడిగా మీడియా ముందుకొచ్చారు. మంత్రి హోదాలో ఆయన ఇప్పటి వరకూ ఒక్కసారీ పూర్తిస్థాయిలో కరోనాపై సమీక్ష చేయలేదు

### విదేశాల నుంచి వచ్చినవారెక్కడ?

రాష్ట్రానికి విదేశాల నుంచి 6,700 మంది వచ్చినట్లు వలంటీర్ల ద్వారా గుర్తించారు. ఇమిగ్రేషన్ బ్యూరో ఇచ్చిన జాబితా ప్రకారం మరో 4,900మంది ఉన్నారు. మొత్తంగా ఏపీలోకి వచ్చినవారు 12,500 మందిగా తేల్చారు. వలంటీర్లు గుర్తించిన వారితో పాటు మరికొంత మందిని మాత్రమే అధికారులు గుర్తించారు. మిగిలినవారు ఎక్కడున్నారో గుర్తించే పనిలో ఉన్నారు. సాధారణంగా విదేశాల నుంచి వచ్చినవారిని 14 రోజులు క్వారంటైన్‌లో ఉంచాలి. కానీ, అధికారులు మాత్రం పట్టనట్లు వదిలేస్తున్నారు. వారంతట వారు కరోనా లక్షణాలతో వస్తే తప్ప పట్టించుకునే దిక్కులేదు. ఇలాంటి వారు రాష్ట్రంలో సుమారు 4వేల మంది వరకూ ఉన్నారు. వారిలో ఎవరికైనా కరోనా సోకిఉంటే, వాళ్లు ఎంతమందికి అంటించి ఉంటారో అని అధికారులు భయాందోళనలో ఉన్నారు. కాగా, విదేశాల నుంచి వచ్చే విద్యార్థులకు కంట్రోల్ రూములు ఏర్పాటు చేయడంతో పాటు, వారికి వైద్య సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నలుగురు జూనియర్ ఐఏఎస్ అధికారులను కేటాయించింది. ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు ప్రత్యేక అధికారిగా ఉన్న ఒ.అనంద్, చిత్తూరు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ఐ.పృథ్వీతేజ్, కర్నూలు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ విదేహ్ ఖరే, విజయనగరం అసిస్టెంట్ కలెక్టర్ కేతన్ గార్గ్‌ను రిలీవ్ చేయాలని సీఎస్ నీలం సాహ్ని గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

# జీవ విపత్తుగా కరోనా

- మహమ్మారి నిరోధ, నియంత్రణ కోసం ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధుల వాడకానికి దారి
- 6 రోజులుగా కేంద్రం హెచ్చరిస్తున్నా ప్రధాని రివ్యూకి ఓరోజు ముందు జీవో
- 'ఆంధ్రజ్యోతి' కథనంతోనూ కదలిక
- క్వారంటైన్ క్యాంపులు, కొత్త ల్యాబ్‌లు, పరికరాల కొనుగోలు ఖర్చు ఈ పద్దులో
- మొత్తం నిధుల్లో 25% వాడుకొనే వీలు

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కరోనా కలవరంపై కేంద్రం హెచ్చరించిన ఆరురోజులకు రాష్ట్రప్రభుత్వం ఎట్టకేలకు స్పందించింది. మనుషుల ప్రాణాలను హరిస్తున్న కరోనా(కోవిడ్-19)ను జీవ విపత్తు (బయోలాజికల్ డిజాస్టర్) జాబితాలో చేర్చింది. రాష్ట్ర విపత్తు స్పందన (ఎస్‌డీఆర్‌ఎఫ్) నిధులతో ఈ వ్యాధి నిరోధ, నియంత్రణ, నివారణకు తీసుకోవాల్సిన చర్యలను నిర్దేశిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రస్థాయి కార్యనిర్వాహక కమిటీ నిర్ణయాల మేరకు సేకరణ, కొనుగోళ్లు చేపట్టాలని ఆ ఉత్తర్వుల్లో దిశానిర్దేశం చేశారు. అయితే, ఈ పరికరాల కొనుగోళ్లకు అయ్యే వ్యయం మొత్తం నిధుల్లో నుంచి 25 శాతం మించకూడదని పేర్కొన్నారు. రోగ నిరోధం, నియంత్రణ కోసం ఉత్పాత సమయాన్ని కనీసం 30 రోజులుగా నిర్దేశించారు. నిజానికి... కరోనా నివారణ చర్యలను విపత్తు జాబితాలో చేర్చాలని, యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలంటూ ఈనెల 14న కేంద్ర హోం శాఖ అన్ని రాష్ట్రాలకు లేఖలు రాసింది. మన రాష్ట్రానికి కూడా ఈ లేఖ వచ్చింది. దీని ప్రకారం, కరోనాను విపత్తుల జాబితాలో ప్రకటించాలి. దాన్ని ఎదుర్కొనేందుకు ఎస్‌డీఆర్‌ఎఫ్ నుంచి నిధులను ఖర్చుపెట్టడానికి మార్గదర్శకాలు ఇవ్వాలి. ఇదే జరిగి ఉంటే, ఈ పాటికే క్వారంటైన్ క్యాంపులు, కొత్త లాబ్‌లు ఏర్పాటయ్యేవి. భారీగా ఐసోలేషన్ కేంద్రాలను నెలకొల్పేవారు. అయితే, రాష్ట్రంలో కరోనా ప్రభావం లేదని, ఎన్నికలు నిర్వహించాలంటూ సర్కారు పంతానికి పోయింది. చివరకు సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కరోనా చర్యలే కీలకమని, ఎన్నికలు ఇప్పుడు వద్దంటూ ఎస్ఈసీ తీసుకున్న నిర్ణయాన్ని కోర్టు సమర్థించింది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఇది జరిగిన తర్వాత కూడా కేంద్రం ఆదేశాలపై వెంటనే స్పందించలేదు. వాస్తవానికి విపత్తు ప్రకటనపై ఫైల్ ఎప్పుడో తయారయింది. ప్రభుత్వ అనుమతికోసం ఎదురుచూస్తూ సీఎస్ పేషీలో ఆ ఫైలును పెండింగ్‌లో పెట్టారు. దీన్ని ప్రస్తావిస్తూ 'ఏకాకి ఏపీ' శీర్షికన ఆంధ్రజ్యోతి వార్తను ప్రచురించింది. మరోవైపు శుక్రవారం ప్రధానమంత్రి మోదీ కరోనా నియంత్రణపై రాష్ట్రాల ముఖ్యమంత్రులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. దీంతో ఈ వీడియోకాన్ఫరెన్స్‌కు కొద్ది గంటల ముందు ప్రభుత్వ సీఎస్ స్పందించి.. ఉత్తర్వులు ఇచ్చారు.
కరోనా నిర్ధారణ పరీక్షల కోసం ప్రత్యేకంగా లాబ్‌ల ఏర్పాటుకు ఎస్‌డీఆర్‌ఎఫ్ నుంచి నిధులు ఇవ్వనున్నారు. అయితే, ఎన్ని లాబ్‌లు ఏర్పాటు చేయాలన్నది రాష్ట్రస్థాయి కమిటీ నిర్ణయం మేరకే ఖరారు చేస్తారు. వ్యాధి నివారణ, నిరోధక చర్యల్లో భాగంగా వైద్యవిభాగం, మున్సిపల్, పోలీసు, ఫైర్ విభాగాలతో పాటు ఇతర శాఖల సిబ్బంది సంరక్షణకు అవసరమైన ఖర్చును ఈ పద్దు నుంచే భరించనున్నారు.

## కరోనా విజృంభిస్తున్నా..
# ఉన్మాద రాజకీయాలేనా?

- రాజ్యాంగ వ్యవస్థలపై దాడిచేస్తారా?
- కమిషనర్ లేఖను చూసి తలదించుకోవాలి
- టీడీపీ అధినేత చంద్రబాబు ధ్వజం



అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ విజృంభిస్తూ ప్రజలను ఆందోళనకు గురి చేస్తుంటే దానిపై పోరాడాల్సిన ముఖ్యమంత్రి.. అది వదిలిపెట్టి ఇంకా ఉన్మాద రాజకీయాలనే పట్టుకుని వేలాడుతున్నారని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. మొత్తం దేశం, ప్రపంచం ఈ మహమ్మారిని ఎలా అదుపు చేయాలా అని సతమతమవుతుంటే.. ఈ సీఎం మాత్రం ప్రతిపక్షాలపైన, రాజ్యాంగ వ్యవస్థలపైన ఎలా దాడి చేయాలా అని ఆలోచిస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ ఎమ్మెల్యేలను పురిగొల్పి తప్పుడు ఫిర్యాదులు ఇప్పిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ నేతలు కళావెంకట్రావు, అచ్చెన్నాయుడు, వర్ల రామయ్య, నిమ్మల రామానాయుడుతో కలిసి గురువారం సాయంత్రం ఆయన మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ఎమ్మెల్యేలు డీజీపీని కలిసి టీడీపీ పైన, మీడియాపైనా ఫిర్యాదు ఇవ్వడాన్ని ప్రస్తావించారు. ఆ పార్టీకి బుద్ధీ జ్ఞానం లోపించాయనడానికి ఇదే నిదర్శనమన్నారు. 'రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఢిల్లీలోని కేంద్ర హోంశాఖ కార్యదర్శికి లేఖ రాశారు. అది వాస్తవమని ఆర్టీఐ చట్టం కింద ఒక వ్యక్తి సమాచారం కోరినప్పుడు హోం శాఖ సమాధానం ఇచ్చింది. కమిషనర్ రాసిన లేఖకు ప్రతిస్పందనగా ఆయనకు వెంటనే కేంద్ర భద్రతా బలగాలతో రక్షణ కల్పించారు. లేఖకు ఈ ధ్రువీకరణలు చాలవా? హైకోర్టు జడ్జితో సమాన హోదా కలిగిన ఎన్నికల అధికారి ఈ రాష్ట్రంలో తన ప్రాణాలకు భద్రత లేదని కేంద్రానికి విన్నవిస్తే సిగ్గుతో తలదించుకోవాల్సింది పోయి లేఖను వక్రీకరించే ప్రయత్నం చేస్తారా? కమిషనర్ లేఖను ఇతర పార్టీలకు ఆపాదించి దానిపై విచారణ జరపాలని కోరడం దౌర్భాగ్యం. లేఖ ఆయన రాశారో లేదో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర హోం శాఖను సంప్రదించి తెలుసుకోవచ్చు. అది వదిలిపెట్టి మాపై ఫిర్యాదులు చేయడమేంటి? ఉన్మాదులు మాత్రమే ఇలాంటివి చేయగలరు. ఎన్నికల కమిషనర్ ఒక రాజ్యాంగ వ్యవస్థ. ఆయనే ఈ రాష్ట్రంలో ఉండలేని పరిస్థితి నెలకొందని లేఖ రాసినా మీకు సిగ్గు లేదా? మీకు 151 సీట్లు వస్తే అందరూ మాట్లాడకుండా కూర్చోవాలా?' అని విరుచుకుపడ్డారు.

### ఇప్పుడు పరుగులు పెడుతున్నారు..

కరోనా తీవ్రతను ముందుగానే అంచనా వేసి ఎన్నికలను వాయిదా వేసినందుకు కమిషనర్ రమేశ్‌కుమార్‌ను అభినందించాలని చంద్రబాబు అన్నారు. 'ఇప్పుడు ఏం జరుగుతోంది? వైరస్ వ్యాప్తిని ఆపడానికి చివరకు తిరుమల ఆలయాన్ని కూడా మూసివేస్తున్నారు. ఎన్నికలే పెట్టి ఉంటే రాష్ట్రం నాశనమై ఉండేది. ఫ్రాన్స్‌లో ఇలాగే ఎన్నికలు పెట్టి ఇప్పుడు చింతిస్తున్నారు. అక్కడ తీవ్రంగా వైరస్ వ్యాపిస్తోంది. నాలుగు వారాల దాకా రాష్ట్రంలోకి కరోనా రానే రాదని లేఖ రాసిన సీఎస్ ఇప్పుడేం చెబుతారు? ఇన్ని రోజుల తర్వాత ఇప్పుడు ఆరోగ్య మంత్రి బయటకు వచ్చి అన్నీ మూసివేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి మాత్రం బయటకు వచ్చి ఏదీ మాట్లాడరు' అని విమర్శించారు.

### బండారం బయటపెట్టారు...

అధికార పార్టీ ఏకగ్రీవాల బండారాన్ని కమిషనర్ తన లేఖలో బయటపెట్టారని చంద్రబాబు చెప్పారు. 'గత స్థానిక ఎన్నికల్లో కేవలం 2 శాతం ఎంపీటీసీలు ఏకగ్రీవమైతే ఈసారి ఏకంగా 24 శాతమయ్యాయని, ప్రతిపక్షాల వారిని తీవ్రంగా బెదిరించి దౌర్జన్యం చేసి వీటిని సాధించుకున్నారని కమిషనర్ ఎత్తిచూపారు. ఏకగ్రీవాల వ్యవహారం చూసి ప్రజలు ఛీ కొడుతున్నారు. ఎన్నికల అక్రమాల పేరుతో తెచ్చిన నల్ల చట్టాన్ని అడ్డగోలుగా వాడారు' అని దుయ్యబట్టారు.

## తల్లి అక్కడ.. పిల్లలు ఇక్కడ..!



విశాఖపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మలేసియాలో చిక్కుకుపోయిన విద్యార్థుల కోసం భారత ప్రభుత్వం బుధవారం ఎయిర్‌ఏషియా విమానాన్ని పంపించి 186 మందిని విశాఖపట్నం తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో మరికొందరు మలేసియా నుంచి విశాఖ విలేకరులకు ఫోన్లు చేసి.. ఆ విమానంలో విద్యార్థులను మాత్రమే తీసుకువెళ్లారని, తమకు అవకాశం కల్పించలేదని వాపోయారు. తమను రప్పించేందుకు సాయం చేయాలని వారు కోరుతున్నారు. కౌలాలంపూర్‌లో చిక్కుకుపోయిన వారిలో విశాఖకు చెందిన సింధూష ఉన్నారు. ఆమె భర్త విజయచందర్ మలేసియాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. డెలివరీ కోసం గతేడాది మేలో ఆమె విశాఖకు వచ్చింది. ఇద్దరు కవలలు జన్మించారు. వీసా రెన్యువల్ కోసం ఈ నెల 7న మలేసియాకు వెళ్లింది. పిల్లలు విశాఖలోని తల్లిదండ్రుల దగ్గరే ఉన్నారు. వీసా పని పూర్తి చేసుకొని విశాఖకు రావాలంటే విమానాలు రద్దు చేశారని చెబుతున్నారని ఆమె వాపోయింది.



యువతికి కరోనా పరీక్షలు చేస్తున్న సిబ్బంది

# కునుకు లేని దేశం!

### 190కు చేరిన కరోనా పాజిటివ్ కేసులు.. దేశంలో నాలుగో మరణం నమోదు

న్యూఢిల్లీ/ముంబై, మార్చి 19: దేశంలో కరోనా వైరస్ (కొవిడ్- 19) కేసుల సంఖ్య గురువారం 190కు పెరిగింది. వీరిలో 32 మంది విదేశీయులు ఉన్నారు. గుజరాత్, చండీగఢ్, ఛత్తీస్‌గఢ్‌లో తొలి కేసులు వెలుగుచూశాయి. చండీగఢ్, ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు మహిళలకు కొవిడ్- 19 సోకినట్లు గుర్తించారు. 23, 24 ఏళ్ల వయస్కులైన వారిద్దరూ యూకే నుంచి తిరిగొచ్చిన వారే. గుజరాత్‌లోని రాజ్‌కోట్, సూరత్‌లో రెండు కేసులను గుర్తించారు. అత్యధికంగా మహారాష్ట్రలో 49 కేసులు నమోదయ్యాయి. దేశంలో కరోనా బారినపడి మరణించిన వారి సంఖ్య నాలుగుకు చేరింది. బుధవారం పంజాబ్‌లో మృతిచెందిన 72 ఏళ్ల వృద్ధుడికి కరోనా ఉన్నట్లు తేలింది. ఉదయం ఆస్పత్రిలో ఆయన మరణించగా రాత్రికి కరోనా పరీక్షల ఫలితం వచ్చింది. 15 రోజుల క్రితం జర్మనీ నుంచి ఇటలీ మీదుగా ఆయన తిరిగి వచ్చారు. పంజాబ్‌కు ముందు ఢిల్లీ, కర్ణాటక, మహారాష్ట్రలో కరోనా మరణాలు నమోదయ్యాయి. ఇరాన్‌లో వైరస్ సోకిన ఓ భారతీయుడు మరణించాడు. కరోనా వచ్చినవారిలో ఇప్పటివరకు 16 మంది కోలుకోగా డిశ్చార్జి చేశారు. కాగా కరోనాను అరికట్టేందుకు కేంద్రంతోపాటు వివిధ రాష్ట్రాలు కూడా పలు చర్యలు చేపట్టాయి.సీఐఎస్‌సీఈ చివరి నిమిషంలో 10, 12 తరగతుల పరీక్షలను వాయిదా వేసింది. స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్‌ఎస్‌సీ) కూడా కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం జరుగుతున్న కంబైన్డ్ హయ్యర్ సెకండరీ (10+2) లెవెల్ పరీక్ష (టైర్-1)తో పాటు ఈ నెల 30న జరగాల్సిన జూనియర్ ఇంజనీర్ పరీక్ష (పేపర్-1)ను వాయిదా వేసింది. ఢిల్లీ, పంజాబ్‌లో రెస్టారెంట్లను మూసివేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశించాయి. హోమ్ డెలివరీ, పార్శిళ్లకు అనుమతి ఇచ్చాయి. ఢిల్లీలోని సుందర్‌నగర్ మార్కెట్‌ను ఈ నెల 31 వరకు మూసివేస్తున్నట్లు వర్తకుల సంఘం ప్రకటించింది. దేశ రాజధానిలో మూతపడనున్న తొలి మార్కెట్ ఇదే. శుక్రవారం నుంచి ప్రజా రవాణా సేవలను నిలిపివేస్తున్నట్లు పంజాబ్ ప్రభుత్వం ప్రకటించింది. గుజరాత్‌లో 14 రోజుల 'హోమ్ క్వారంటైన్'లో ఉన్న అనుమానితులకు చేతికి రంగు బ్యాండ్ ధరింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముంబైలో శుక్రవారం నుంచి ఈ నెల 31 వరకు సేవలను నిలిపివేయాలని డబ్బావాలాలు నిర్ణయించారు. శ్రీనగర్‌లోనూ ప్రజా రవాణాను తాత్కాలికంగా నిలిపివేశారు. మధ్యప్రదేశ్, జమ్ములో కరోనాపై సోషల్ మీడియాలో వదంతులు వ్యాప్తి చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. కరోనా విస్తరిస్తున్నందున జన గణనను వాయిదా వేయాలని, జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్) ప్రక్రియను రద్దు చేయాలని ప్రధానిని సీపీఎం పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. కాగా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ నొయిడా కార్యాలయ ఉద్యోగి ఒకరికి కరోనా వైరస్ సోకింది. విదేశాలకు వెళ్లి వచ్చిన అనంతరం ఇంట్లోనే ఐసోలేషన్‌లో ఉండగా అతనికి కొవిడ్-19 సోకినట్లు తేలింది.

#### కర్ణాటకలో మరో పాజిటివ్ కేసు

బెంగళూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో ఇప్పటికే కరోనాతో ఒక వ్యక్తి మృతిచెందగా తాజాగా మరో పాజిటివ్ కేసు నమోదైంది. కొడగు జిల్లాకు చెందిన ఓ 35 ఏళ్ల వ్యక్తికి కరోనా పాజిటివ్ అని గురువారం నిర్ధారణ అయింది. దీంతో రాష్ట్రంలో కరోనా బాధితుల సంఖ్య 15కు చేరింది. దుబాయ్ నుంచి వచ్చిన అతనికి జ్వరం, జలుబు ఉండడంతో శాంపిల్స్‌ను పరీక్షకు పంపగా పాజిటివ్ అని తేలింది. మైసూరులోని ఇన్ఫోసిస్ ట్రైనింగ్ క్యాంపస్ నుంచి 10 వేల మందిని సొంత ప్రాంతాలకు తరలించారు. కర్ణాటకవ్యాప్తంగా ఆలయాలకు భక్తులు రాకూడదని ఆదేశించారు.



నిర్మానుష్యంగా కనిపిస్తున్న గేట్ వే ఆఫ్ ఇండియా

### ఎండలో గడిపితే కరోనా దూరం: చౌబే

రోజూ 10-15 నిమిషాలు ఎండలో ఉంటే కరోనా రాకుండా కాపాడుకోవచ్చని కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అశ్వినీకుమార్ చౌబే సలహా ఇచ్చారు. "ఉదయం 11 నుంచి 2 గంటల మధ్య సూర్యుడు ప్రకాశవంతంగా ఉంటాడు. అప్పుడు 10-15 నిమిషాలు ఎండలో గడిపి సూర్యరశ్మిని గ్రహించాలి. దీని వల్ల డి విటమిన్ లభిస్తుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచడమే కాదు కరోనా వంటి వైరస్‌లను చంపేస్తుంది" అని అన్నారు. మంత్రి వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి.

## 50 గంటలు నిరీక్షించి వెనక్కి..

- విధిలేక తిరిగి వెళ్లిన తెలుగు విద్యార్థులు
- మనీలా ఎయిర్‌పోర్టు నుంచి తిరుగుముఖం
- ఎయిర్‌పోర్టులో మూడు రోజులు నరకయాతన

కందుకూరు, నరసరావుపేట టౌన్, తాళ్లవలస, మార్చి 19: ఉన్నత విద్య కోసం ఫిలిప్పీన్స్‌కు వెళ్లి.. కరోనా వైరస్ నేపథ్యంలో తిరిగి స్వదేశానికి వచ్చేయాలని ఆశించిన తెలుగు విద్యార్థుల ఆశలు ఫలించలేదు. ఎలాగైనా స్వదేశం చేరుకోవాలనే ఉద్దేశంతో 50 గంటలపాటు మనీలా ఎయిర్‌పోర్టులోనే నిరీక్షించిన వారంతా ఉసూరుమంటూ వెనక్కు వెళ్లక తప్పలేదు. భారత రాయబార కార్యాలయ నిర్లక్ష్యం ఫలితంగా మూడు రోజులు పడిగాపులు కాసిన 140 మందికిపైగా వైద్య విద్యార్థులు గురువారం సాయంత్రం 5గంటలకు అక్కడి నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. వారిలో 81 మంది తెలుగు రాష్ట్రాలకు చెందిన వారున్నారు. కందుకూరుకు చెందిన 10 మందితోపాటు, గుంటూరు, శ్రీకాకుళం విద్యార్థులు కూడా మూడు రోజులుగా అన్నపానీయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కరోనా వ్యాప్తి నేపథ్యంలో ఫిలిప్పీన్స్ ప్రభుత్వం అక్కడి విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించింది. ఈ నేపథ్యంలో అక్కడి యూనివర్సిటీల్లో చదువుతున్న వైద్య విద్యార్థులంతా మంగళవారం నుంచి టికెట్లు బుక్ చేసుకుని భారత్‌కు బయల్దేరారు. కానీ.. ఈలోగా ఫిలిప్పీన్స్ సహా మరికొన్ని దేశాల విమానాలకు దేశంలోకి అనుమతిని నిరాకరిస్తూ భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అప్పటికే అక్కడి నుంచి కొందరు కౌలాలంపూర్ చేరుకున్నారు. మరికొందరు భారత విద్యార్థులతోపాటు తెలుగు వారు కూడా మనీలా ఎయిర్‌పోర్టులోనే చిక్కుకుపోయారు. వారంతా తమను భారత్‌కు పంపించే ఏర్పాట్లు చేయాలని 3 రోజులుగా ఫిలిప్పీన్స్‌లోని భారత ఎంబసీ అధికారులను కోరుతున్నారు. అనేక చర్చలు, సంప్రదింపుల అనంతరం వారిని ఇక్కడికి రప్పించేందుకు అనుమతించటానికి నిర్ణయం జరిగే సమయానికి పిలిప్పీన్స్‌లో విమానాశ్రయాలను మూసివేస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో పోలీసుల సహాయంతో విమానాశ్రయాన్ని ఖాళీచేయించి ప్రత్యేక బస్‌లో వారిని తీసుకెళ్లి విద్యార్థుల రూముల వద్ద దింపేసి వచ్చేశారు. గుంటూరు జిల్లా నరసరావుపేటకు చెందిన కొండ్రగుంట రాగచందన ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్, కొండ్రగుంట రేవంత మహవీర్ ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. తమ పిల్లలను వెంటనే భారత్‌కు రప్పించే ఏర్పాట్లు చేయాలని వారి తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

#### ఆ విద్యార్థులను స్వదేశానికి రప్పించండి: విజయసాయి

న్యూఢిల్లీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఫిలిప్పీన్స్‌లోని మనీలా విమానాశ్రయంలో మూడు రోజులుగా చిక్కుకున్న ఏపీ, తెలంగాణకు చెందిన వైద్య విద్యార్థులను వెంటనే స్వదేశానికి తీసుకురావాలని వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జైశంకర్‌కు గురువారం వినతి పత్రం సమర్పించారు. కాగా.. విదేశాల్లో చిక్కుకున్న భారతీయ విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించాలని వైసీపీ ఎంపీ మార్గాని భరత్ లోక్‌సభలో కోరారు.

# ఎల్లుండి జనతా కర్ఫ్యూ



న్యూఢిల్లీ, మార్చి 19: మహమ్మారి కరోనా అంతకంతకూ వ్యాప్తి చెందుతుండడంతో అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందని ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలను సున్నితంగా హెచ్చరించారు. " ఇది మనకు పరీక్షా సమయం. కరోనాకు మందులేదు. రెండు ప్రపంచ యుద్ధాల కంటే ఎక్కువ దేశాలకు ఇది వ్యాపించింది. వాటికంటే ప్రమాదకరంగా మారింది. మనకు పెద్దగా రాదులే, ఏమీ ఫరవాలేదులే.. అన్న ఉదాసీనత వద్దు. బలమైన సంపన్న, అభివృద్ధి చెందిన దేశాలను సైతం ఇది తీవ్రస్థాయిలో దెబ్బతీసింది. అంచేత నిమ్మళంగా ఉండరాదు. మీరు బయట ఎంత ఎక్కువగా తిరిగితే మీకు అంత నష్టం. మీతో పాటు మీకుటుంబీకులు, ఇరుగుపొరుగువారు కూడా వైరస్ బారిన పడతారు" అని ఆయన శుక్రవారం రాత్రి జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో వార్నింగిచ్చారు. పరిస్థితిని ఎదుర్కొనేందుకు అందరం సంయుక్తంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆ సమయంలోనే ఆయన ఈ ఆదివారం నాడు "జనతా కర్ఫ్యూ" పాటిద్దామని ప్రతిపాదించారు. దీని ప్రకారం ఆదివారం ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల దాకా ప్రతి ఒక్కరూ ఇళ్లలోనే ఉండాలని, బయటకు అడుగుపెట్టరాదని కోరారు. "అయితే ఇది అత్యవసర సేవల సిబ్బందికి, వైద్య, పారామెడికల్, పారిశుద్ధ్య సిబ్బందికి వర్తించదు. వారు మనకు చేస్తున్న సహాయం అంతా ఇంతా కాదు. ఇందుకు గాను వారికి కృతజ్ఞత చెబుతూ మార్చి 22 ఉదయం 5 గంటలకు మన ఇళ్ళ ప్రధాన ద్వారం లేదా బాల్కనీల వద్దకు వచ్చి చప్పట్లతో వారిని ఉత్సాహ పరచాలి.. ధన్యవాదాలు చెప్పాలి" అని విజ్ఞప్తి చేశారు. "ఇది ప్రజలు తమంత తాముగా విధించుకునే కర్ఫ్యూ ... మన స్వయం నియంత్రణకు ఓ సంకేతం. ప్రతి ఒక్కరూ కనీసం 10 మందికి ఈ సందేశాన్ని ఫోన్ల ద్వారా చేరవేసి వారు కూడా పాటించేట్లు చేయాలి.. యువత, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, వివిధ పౌర సమాజ సంస్థలు ప్రజలను చైతన్యవంతం చేసి, జనతా కర్ఫ్యూ గురించి చెప్పాలి " అని సూచించారు. ఈ సందర్భంగా ఆయన రెండు ముఖ్యాంశాలను అందరికీ ఉద్బోధించారు. ఒకటి: కృతనిశ్చయం, రెండోది: సంయమనం. వైరస్‌ను జయించాలన్న కృతనిశ్చయం, వైరస్‌ను ఎదుర్కొనడానికి స్వీయ-నియంత్రణతో కూడిన సంయమనం అవసరమని అన్నారు. ప్రతీ చోటా సామాజిక దూరం పాటించండని కోరారు. నిత్యావసరాలకు కొరత రానీయమని ప్రధాని స్పష్టం చేశారు. "సత్వర నివారణ చర్యలు తీసుకొని, భారీగా ప్రజలను ఏకాంతవాసం చేసి కొన్ని దేశాలు కరోనాను కట్టడి చేయగలిగాయి. మనది 130 కోట్ల జనాభా ఉన్నదేశం. అభివృద్ధి చెందుతున్న దేశం. పెద్దపెద్ద దేశాల్నే ఇది కమ్మేసినపుడు మనకు రాదు అనుకోవడం తప్పు. అంచేత కొన్ని వారాల పాటు బయట తిరగకుండా వర్క్ ఫ్రం హోం చేయండి. కరోనా వల్ల మధ్య, దిగువ మధ్య తరగతి, పేద వర్గాల ఆదాయమార్గాలకు విఘాతం కలుగుతోంది. సంపన్నవర్గాలు వారిని ఆదుకోవాలి" అని కోరారు.

#### సహకరిస్తాం: కాంగ్రెస్

జనతా కర్ఫ్యూకు కాంగ్రెస్ సహా వివిధ రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించాయి. "కరోనాపై చేసే యుద్ధంలో మేమూ పాల్గొంటాం. ముందస్తు జాగ్రత్త చర్యలకు సంబంధించి ప్రభుత్వం వివరించే మార్గదర్శకాలను అమలు చేసే విషయంలో సహకరిస్తాం" అని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. "బాధ్యతగల పౌరుడిగా ప్రధానిని సమర్థిస్తున్నాం. కరోనాను ఎదుర్కొనాలన్న ఆయన పిలుపును పాటిస్తాం" అని మాజీ మంత్రి చిదంబరం చెప్పారు, శివసేన, ఎన్‌సీపీ, ఎన్‌సీ కూడా మద్దతు తెలిపాయి.

### 10 సూత్రాల కార్యాచరణ

ప్రధాని 10 సూత్రాల కార్యాచరణను ప్రతిపాదించారు.

1) అత్యవసరం అనుకుంటే తప్ప ఇంటి నుంచి కాలు బయటపెట్టొద్దు

2) ఇళ్లలోని వృద్ధులు, సీనియర్ సిటిజన్స్ అస్సలు బయటకు రావొద్దు

3) రొటీన్‌గా చేయించుకునే మెడకల్ చెకప్‌ను వాయిదా వేసుకోండి. అత్యవసరమైన సర్జరీ అయితే తప్ప శస్త్ర చికిత్సలనూ వాయిదా వేయండి

4) మార్చి 22న జనతా కర్ఫ్యూ పాటించండి. ఉదయం 5 నుంచి రాత్రి 9 దాకా ఇళ్లలోనే ఉండండి

5) వదంతులు, చెప్పుడు మాటలు వినొద్దు. సోషల్ మీడియాలో దుష్ప్రచారాలను నమ్మొద్దు

6) వ్యాపారులు, సంపన్నులు తమ వద్ద పనిచేస్తున్న వారి జీతాలు తగ్గించవద్దు.. ఇది సంక్షోభ సమయం.

7)నిత్యావసరాలను భయపడి కొనుగోలు చేయవద్దు

8) 22న ఉదయం లేచి మనను కాపాడుతున్న వైద్య, పారిశుద్ధ్య సిబ్బందికి కృతజ్ఞతలు చెప్పండి

9) కరోనా వల్ల తీవ్రమైన దెబ్బ ఆర్థికరంగంపై పడుతోంది. దీన్ని ఆదుకునేందుకు గాను ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో ఓ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నాం

10) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం ఇచ్చే మార్గదర్శకాలు, సూచనలు ఖచ్చితంగా పాటించండి.. సహకరించండి

## హైదరాబాద్ చేరుకున్న నిమ్మగడ్డ

- సెర్బియా నుంచి రాక.. ఆ వెంటనే క్వారంటైన్‌కు..

హైదరాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సెర్బియా పోలీసుల ఆంక్షల మధ్య ఉన్న పారిశ్రామికవేత్త నిమ్మగడ్డ ప్రసాద్ ఎట్టకేలకు దాదాపు 8 నెలల తర్వాత గురువారం హైదరాబాద్ చేరుకున్నారు. కరోనా వైరస్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో విదేశాల నుంచి వచ్చిన ప్రయాణికులను క్వారంటైన్‌లో ఉంచుతున్న నేపథ్యంలో నిమ్మగడ్డ కూడా వైద్యుల పర్యవేక్షణలో క్వారంటైన్‌లో ఉన్నారు. నిరుడు జూలైలో ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపికకు సంబంధించి సెర్బియా వెళ్లిన నిమ్మగడ్డను అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. రస్‌అల్‌ఖైమా (ఆర్ఏకే)తో ఉన్న వ్యాపార ఒప్పందాల్లో భాగంగా ఆర్ఏకే ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. తర్వాత కొన్ని రోజులకు బెయిల్ లభించినా తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు దేశం విడిచి వెళ్లరాదని సెర్బియా ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఆ ఆంక్షలను సడలించడంతో నిమ్మగడ్డ హైదరాబాద్ చేరుకున్నారు. సెర్బియాలోని హైకోర్టు, సుప్రీం కోర్టు కేసును కొట్టివేయడమేకాక ఇంటర్ పోల్ కూడా లుక్‌అవుట్ నోటీస్ ఆర్డర్‌ను ఎత్తివేసినట్లు సమాచారం. కాగా వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసును సీబీఐ ప్రత్యేక కోర్టు శుక్రవారం విచారించనుంది. జగన్ కంపెనీల్లో పెట్టుబడులకు(వాన్‌పిక్) సంబంధించిన వ్యవహారంలో నిమ్మగడ్డ ప్రసాద్ ఆయన సోదరుడు ప్రకాశ్ నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే.

## అంతర్జాతీయ విమానాలు రద్దు

- ప్రైవేట్ సంస్థలు వర్క్‌ఫ్రం హోం చేస్తే మంచిది: కేంద్రం

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్‌ను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. 65 ఏళ్లకు పైబడిన వృద్ధులు, పదేళ్లలోపు చిన్నారులు బయటకు రావద్దని, ఇళ్లలోనే ఉండాలని సూచించింది. ఇందులో ప్రజాప్రతినిధులు, వైద్య నిపుణులు/సేవ కులకు మినహాయింపునిచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలు తగు ఉత్తర్వులివ్వాలని కేంద్రం ఆదేశించింది. ఈనెల 22 నుంచి 29 వరకు అన్ని అన్ని అంతర్జాతీయ విమాన సర్వీసులనూ నిషేధించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న మరి కొన్ని నిర్ణయాలు.. రైలు, విమాన ప్రయాణాల్లో కల్పించే రాయితీలపై పరిమితులు. దివ్యాంగులు, విద్యార్థులు, రోగులు మినహా మిగిలినవారికి తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు అన్ని రకాల రాయితీలను నిలిపివేస్తారు. ప్రైవేట్ రంగ ఉద్యోగులు వీలైనంత వరకు వర్క్ ఫ్రం హోం చేసేలా రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. అత్యవసర, నిత్యావసర సర్వీసులకు మాత్రం మినహాయింపు ఉంది. కేంద్ర ప్రభుత్వ గ్రూపు-బీ, గ్రూపు-సీ ఉద్యోగులు వారం విడిచి వారం పనిచేసేలా సర్దుబాటు చేసుకోవాలి. మాస్కులు, శానిటైజర్ల ధరలను విపరీతంగా పెంచేసి అమ్మే మందుల షాపుల యజమానులపై ఔషధ, వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖలు తగిన చర్యలు తీసుకోవాలి.

### వర్సిటీ పరీక్షలు వాయిదా: యూజీసీ ఆదేశం

న్యూఢిల్లీ, మార్చి 19: కరోనా మహమ్మారి నేపథ్యంలో యూనివర్సిటీలు, వాటి అనుబంధ కాలేజీల పరిధిలో జరగనున్న అన్ని పరీక్షలను ఈ నెలాఖరు వరకు వాయిదా వేయాలని యూజీసీ అన్ని వర్సిటీలను ఆదేశించింది. ఐసీఎస్ఈ బోర్డు పరిధిలో గురువారం నుంచి జరగాల్సిన 10, 12వ తరగతి పరీక్షలు కూడా వాయిదా పడ్డాయి.

### మరో 84 రైళ్లు రద్దు.. మొత్తం చార్జీలు వాపస్

న్యూఢిల్లీ, మార్చి 19 : కరోనా భయంతో ప్రయాణికులు టికెట్లు రద్దు చేసుకోవడంతో రైల్వే శాఖ మరో 84 రైళ్లను రద్దు చేసింది. ఈనెల 20 నుంచి 31 వరకు ఈ రైళ్లు నడవవని అధికారులు తెలిపారు. సికింద్రాబాద్-దానాపూర్ పట్నా ఎక్స్‌ప్రెస్, కాజీపేట-ముంబై తడోబా వీక్లీ ఎక్స్‌ప్రెస్, విశాఖ-ముంబై లోకమాన్య తిలక్, కొల్లాపూర్-మణుగూర్ కొల్లాపూర్ ఎక్స్‌ప్రెస్‌లు రద్దైన రైళ్లలో ఉన్నాయి. ఈ రైళ్లలో ప్రయాణించేందుకు టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు మొత్తం టికెట్ చార్జీని వాపసు చేస్తారు.

### నమూనాలు తీసుకోవడంలో జాప్యం

- అధికారులపై అలకతో ఆస్పత్రి నుంచి వ్యక్తి పరారు

మథుర, మార్చి 19 : కరోనా వైరస్ పరీక్ష కోసం వైద్యాధికారులు తన నమూనాలు తీసుకోవడంలో జాప్యం చేశారని ఓ వ్యక్తి (47) అలకబూని ఆస్పత్రి నుంచి పారిపోయాడు. ఉత్తరప్రదేశ్‌లోని మథురలో ఈ ఘటన జరిగింది. అతడి ఆచూకీ కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. కాగా కేరళలోని ఓ క్వారంటైన్ నుంచి పారిపోయిన కరోనా అనుమానితుడిని ఈశాన్య ఫ్రాంటియర్ రైల్వే అధికారులు గురువారం పట్టుకున్నారు. అసోంలోని సిల్చార్‌కు వెళ్తున్న కాంచన్‌జంగా ఎక్స్‌ప్రెస్ రైల్లో ఆ వ్యక్తిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ రైల్లోని ప్రయాణికులందరికీ స్క్రీనింగ్ చేశారు. ప్రయాణికులందరూ హోం క్వారంటైన్‌లోకి వెళ్లిపోవాలని సూచించారు. మరోవైపు పుణెకు చెందిన ఓ వ్యక్తి యూరోప్‌కు వెళ్లి తిరిగొచ్చాడు. ముంబైలో అతను క్వారంటైన్‌లోకి వెళ్లకుండా పుణెకు వెళ్లాడు. అనంతరం అతడిని పరీక్షించగా కొవిడ్-19 బారిన పడినట్లు తేలింది.

### బ్లడ్ గ్రూప్ 'ఎ' అయితే.. కరోనా బాధితుల్లో 40 శాతం వారే

గుంటూరు (మెడికల్) మార్చి 19: కరోనా వైరస్ బారిన పడుతున్న రోగులపై చైనాలోని జింగ్ హువాన్ సంస్థ నిర్వహించిన సర్వేలో ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగు చూశాయి. 'ఏ' బ్లడ్ గ్రూప్ కలిగిన వారు కరోనా వైరస్ బారిన ఎక్కువగా పడుతున్నట్లు వారు గుర్తించారు. అయితే 'ఏ' బ్లడ్ గ్రూప్ ఉన్న వారు యాదృచ్ఛికంగా వ్యాధికి గురౌతున్నారా? లేక ఆ బ్లడ్ గ్రూప్ ఉన్న వారిపై త్వరగా కొవిడ్-19 సోకుతుందో తెలియదు కానీ మొత్తం మీద ఈ బ్లడ్ గ్రూప్ ఉన్న వారిలో కరోనా వైరస్ ప్రభావం అధికంగా ఉన్నట్లు వారు నిగ్గు తేల్చారు. ఏ బ్లడ్ గ్రూప్ ఉన్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్యవర్గాలు సూచిస్తున్నాయి. వూహాన్‌లో కొవిడ్-19తో మరణించిన 206 మందిలో 'ఏ' బ్లడ్ గ్రూప్ ఉన్న వారు ఏకంగా 85 మంది ఉన్నట్లు గుర్తించారు.

### కాకినాడ తీరానికి చైనా నౌక

- పోర్టులో మెడికల్ క్యాంప్ ఏర్పాటు

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 19: తూర్పుగోదావరి జిల్లా కాకినాడ తీరానికి చైనానుంచి ఒక నౌక బుధవారం అర్ధరాత్రి సమయంలో వచ్చింది. దీంతో అంతా అప్రమత్తమయ్యారు. పోర్టు మెడికల్ ఆఫీసర్ ఎం.రామానుజరావు ఆధ్వర్యంలో నౌకలోని చైనీయులకు వైద్యపరీక్షలు నిర్వహించి గురువారం ఉదయం 5గంటలకు పోర్టుకు వచ్చేందుకు అనుమతిచ్చారు. కరోనా వెలుగులోకొచ్చిన తర్వాత చైనానుంచి ఇప్పటివరకు ఐదు నౌకలు వచ్చి వెళ్లగా ఇది ఆరో నౌక. మయన్మార్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, కెనడా, అమెరికా నుంచి గత నెలన్నరలో 25-30 నౌకలు వచ్చాయి. ఇద్దరు వైద్యులు, నలుగురు ఏఎన్ఎంలతో పోర్టులోపల ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నారు.

### కరోనా అనుమానం..

- గన్నవరం ఎయిర్‌పోర్టులోనే ఆరుగురు

విజయవాడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ నుంచి గురువారం రాత్రి గన్నవరం ఎయిర్‌పోర్టుకు వచ్చిన ప్రయాణికుల్లో ఆరుగురిని కరోనా వైరస్ అనుమానంతో అధికారులు నిలిపివేశారు. వారిలో ఇద్దరు కృష్ణా జిల్లాకు చెందినవారు కాగా, మిగిలిన నలుగురు వేర్వేరు ప్రాంతాలకు చెందినవారని ఎయిర్ పోర్టు అధికారులు గుర్తించినట్టు తెలిసింది. వేర్వేరు దేశాల నుంచి అంతర్జాతీయ విమానాల్లో ఢిల్లీకి చేరుకున్న వీరు ఢిల్లీ నుంచి వేరొక విమానంలో గన్నవరం ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. గన్నవరం ఎయిర్ పోర్టులో థర్మల్ స్క్రీనింగ్ చేస్తున్న క్రమంలోనే ఆరుగురు వ్యక్తులను అనుమానంతో అధికారులు నిలిపినట్టు తెలిసింది. జిల్లా వైద్యాధికారులు వారికి వైద్యపరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వారిలో ఇద్దరికి వ్యాధి లక్షణాలు లేవని తేలడంతో ఇంటికి పంపించేశామని, మిగిలినవారికి కూడా పరీక్షలు నిర్వహించిన తర్వాత పంపించేస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి టీఎస్ఆర్ మూర్తి తెలిపారు.

# చైనాను దాటిన ఇటలీ

### ఇటలీలో మృతుల సంఖ్య 3,405కు చేరిక.. జర్మనీలో ఒక్క రోజే 2,801 పాజిటివ్ కేసులు

లండన్, బీజింగ్, మార్చి 19: ఇటలీలో కరోనా మరణాల సంఖ్య పెరుగుతూ పోతోంది. ఆ దేశంలో గురువారం వైరస్ కారణంగా మరో 427 మంది చనిపోయారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య 3,405కు చేరింది. వైరస్ జన్మస్థానమైన చైనా (3,249) కంటే ఇది ఎక్కువ కావడం గమనార్హం. ప్రపంచవ్యాప్తంగా కరోనా మరణాలు 9,020కు చేరాయి. మరోవైపు జర్మనీలోనూ వైరస్ విజృంభిస్తోంది. అక్కడ ఒక్కరోజే 2,801 కేసులు నమోదయ్యాయి. మొత్తం కేసులు 11 వేలు దాటగా.. 20 మంది చనిపోయారు. అతిపెద్ద దేశం రష్యాలోనూ తొలి మరణం నమోదైంది. వారం రోజులుగా మాస్కోలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు (79) గురువారం చనిపోయింది. ఈమెకు డయాబెటిస్, గుండె జబ్బులు కూడా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. వైరస్ వెలుగుచూసిన మూడు నెలల అనంతరం.. తొలిసారిగా వూహాన్ నగరం సహా దేశంలో ఎక్కడా కొత్త పాజిటివ్ కేసు నమోదు కాలేదని చైనా ప్రకటించింది. అయితే, మరో 8 మంది మృతి చెందినట్లు తెలిపింది. ఈలెక్కన చూస్తే వైరస్‌పై యుద్ధంలో చైనా దాదాపు విజయం సాధించినట్లేనని అంటున్నారు.

#### స్పెయిన్‌లో కొవిడ్ విశ్వరూపం

ఇటలీ, ఇరాన్‌తో పాటు స్పెయిన్ వైరస్ కోరల్లో విలవిల్లాడుతూనే ఉన్నాయి. దేశంలో 24 గంటల వ్యవధిలో మరణాలు 30 శాతం పెరిగి 767కు, పాజిటివ్ కేసులు 25 శాతం అధికమై 17,147కు చేరినట్లు స్పెయిన్ తెలిపింది. ఇరాన్‌లో కొత్తగా చనిపోయిన 149 మందితో కలిపి మృతుల సంఖ్య 1,284 అయింది. నిరోధ చర్యల్లో భాగంగా మరో 10 వేల మంది ఖైదీలను తాత్కాలికంగా విడుదల చేయనున్నారు. దక్షిణ అమెరికా దేశమైన మెక్సికోలో కరోనాతో తొలి మరణం నమోదైంది. కరోనా కారణంగా.. శ్రీలంక పార్లమెంటు ఎన్నికలను నిరవధికంగా వాయిదా వేశారు. పోర్చుగల్ బుధవారం 15 రోజుల జాతీయ ఎమర్జెన్సీ ప్రకటించింది. పాకిస్థాన్ వాఘా సరిహద్దును మూసివేసింది. పాక్‌లో ఇప్పటివరకు 381 కొవిడ్ బారినపడ్డారు. బ్రిటన్ రాజధాని లండన్‌లోనూ లాక్‌డౌన్ ప్రకటించారు. థాయ్‌లాండ్‌లో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు 'నింజా' రోబోలను వినియోగిస్తున్నారు. ఈ రోబోలు ఆస్పత్రుల బయట ఉండి రోగి లక్షణాలను గుర్తించి వైద్యులకు సమాచారం అందిస్తాయి.




### ఆ వైద్యుడి విషయంలో మా తీరు తప్పే!

#### కుటుంబానికి క్షమాపణలు చెప్పిన చైనా

కరోనాను తొలిగా గుర్తించి అప్రమత్తం చేసిన వైద్యుడు లి వెన్‌లియాంగ్ (34) విషయంలో తమ ప్రవర్తన తప్పని చైనా అంగీకరించింది. వైద్యుడి కుటుంబానికి వూహాన్ పోలీసులు క్షమాపణ చెప్పారు. ఏడుగురు వ్యక్తుల్లో 'సార్స్'ను పోలిన వైరస్‌ను తాను గమనించినట్లు డిసెంబరు 30న 'వి చాట్' గ్రూప్‌లో షేర్ చేశాడు. కానీ, దీనిపై పోలీసులు అతడిని హెచ్చరించారు. జనవరి 10న లిలో కరోనా లక్షణాలు కనిపించాయి. తాను వైరస్ బారినపడ్డట్లు ప్రకటించిన కొద్ది రోజులకే చనిపోయాడు. అతడి మరణం చైనాలో సంచలనమైంది.

### ఇటలీ మృతుల్లో 99% అనారోగ్య పీడితులే!

#### మరణాల గణాంకాల్లో చైనాకు చేరువ

ఇటలీలో రోజుకు సగటున 350 మరణాలు సంభవిస్తున్నాయి. మృతుల సంఖ్య 3వేలకు చేరింది. ఇటలీ.. చైనా(3,249)ను దాటేసేలా ఉంది. వీరిలో 99% గతంలోనే అనారోగ్యంతో ఉన్నారని అక్కడి వైద్యులు చెబుతున్నారు. వారంలో మరణాల రేటు 150% పెరగడంతో దీనిపై విశ్లేషణ ప్రారంభించారు. 18% మరణాల కేసులను పరిశీలించారు. ముగ్గురికి మాత్రమే అనారోగ్యం లేదని తేలింది. సగంమందికి మూడు వ్యాధులున్నట్లు గుర్తించారు. 75% మందికి పైగా హైబీపీ, 35% మందికి రక్తపోటు ఉంది. ఇటలీ లాక్‌డౌన్‌పొడిగించనుంది.

### వేతనాలతో కూడిన సెలవులు

- 'కరోనా రెస్పాన్స్' చట్టానికి అమెరికా ఆమోదం

వాషింగ్టన్, మార్చి 19: ఉచితంగా కరోనా పరీక్షలు, బాధిత ఉద్యోగులకు వేతనాలతో కూడిన సెలవులు, బీమా సౌకర్యం తదితర వెసులుబాట్లు కల్పించే చట్టానికి అమెరికా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 'ఫ్యామిలీ ఫస్ట్ కరోనా వైరస్ రెస్పాన్స్ యాక్ట్'గా పిలిచే ఈ చట్టం ప్రతినిధుల సభలో 363-40, సెనేట్‌లో 90-8 ఓట్లతో పాస్ అయింది. ఈ చట్టం కింద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడానికి దాదాపు రూ. 7.5 లక్షల కోట్ల రూపాయలను కేటాయించనున్నారు. అమెరికాలో మొత్తం కరోనా బాధితుల సంఖ్య 10 వేలు దాటింది. మృతుల సంఖ్య 150కి చేరింది. చట్ట సభలకు చెందిన ఇద్దరు సభ్యులకు కూడా కరోనా సోకింది. రిపబ్లికన్ పార్టీకి చెందిన మరియో డియాజ్ బలార్ట్, డెమోక్రాటిక్ పార్టీకి చెందిన బెన్ మెక్‌ఆడమ్స్ కొవిడ్ బారిన పడ్డారు. అమెరికాలో కొవిడ్ బారిన పడ్డ మొట్టమొదటి చట్ట సభ సభ్యుడు మరియో డియాజే కావడం గమనార్హం.

### కరోనాకు విరుగుడు 'క్లోరోక్విన్'!!: ట్రంప్

వాషింగ్టన్, మార్చి 19: ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనాకు మనకు తెలిసిన మందే విరుగుడా? అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాటలను బట్టి చూస్తే ఇదే అనిపిస్తోంది. కొవిడ్-19 చికిత్సలో మలేరియా నిరోధక డ్రగ్ 'క్లోరోక్విన్' సమర్థంగా పనిచేస్తోందని ఆయన గురువారం ప్రకటించారు. దీన్ని ఉపయోగించేందుకు ఆమోదం కూడా తెలిపారు. 'ఇప్పటికిప్పుడు ఈ డ్రగ్‌ను అందుబాటులోకి తెస్తున్నాం. ఇది కచ్చితంగా ఎఫ్‌డీఏ (ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్) గొప్పదనమే' అని వ్యాఖ్యానించారు. మరోవైపు క్లోరోక్విన్‌ను కొవిడ్ టీకా తయారీ ట్రయల్స్‌లో పాల్గొంటున్న ఆరోగ్య కార్యకర్తలకూ ఇచ్చి.. .. వైరస్ నుంచి రక్షణ కల్పిస్తుందా? లేదా? అని పరీక్షించనున్నారు. కాగా, తాము కూడా కరోనా చికిత్సలో క్లోరోక్విన్ వాడామని, ప్రభావవంతంగా పని చేసిందని చైనా అధికారిక వార్తా సంస్థ జిన్హువా ఫిబ్రవరిలోనే తెలిపింది.





## ఏప్రిల్ 15 వరకు

# ఆటల్లేవ్!

- క్రీడా శాఖ ఆదేశం
- ఆ తర్వాతే ఐపీఎల్ భవితవ్యం కూడా

**న్యూఢిల్లీ:** దేశంలో వచ్చేనెల 15 వరకు టోర్నమెంట్లు, సెలెక్షన్ ట్రయల్స్‌ను నిర్వహించకూడదని ఆయా క్రీడా సమాఖ్యలను కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ఈమేరకు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ), జాతీయ క్రీడా సమాఖ్య (ఎన్ఎస్ఎఫ్), బీసీసీఐ లకు లేఖ రాసింది. దీంతో శుక్రవారం పటియాలలో జరగాల్సిన భారత గ్రాండ్ ప్రీ అథ్లెటిక్స్ పోటీలు వాయిదా పడ్డాయి. అలాగే ఒలింపిక్ శిక్షణ శిబిరంలో ఉన్నవారిని ఎవరూ కలుసుకోవడానికి వీల్లేదని పలు మార్గదర్శకాలను జారీ చేసింది. 'క్వారంటైన్ ప్రొటోకాల్ పాటించకుండా బయటి నుంచి వచ్చే కోచ్‌లు, సహాయక సిబ్బంది తదితరులు ట్రైనీ అథ్లెట్లను కలుసుకోరాదు. వారిని సురక్షితంగా ఉంచే విషయంలో అన్ని జాగ్రత్తలు పాటిస్తాం. జనాలు పెద్ద ఎత్తున గుమిగూడడం నిషిద్ధం. అయితే ఒలింపిక్‌కు అర్హత సాధించినవారు లేదా బెర్త్ అవకాశానికి దగ్గరగా ఉన్నవారి విషయంలో దీన్ని మినహాయించాం. ఎందుకంటే వారు శిక్షణను కోల్పోతే టోక్యో గేమ్స్ సన్నాహకాలకు గట్టి దెబ్బ తగులుతుంది' అని క్రీడాశాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు.

**ఆ అథ్లెట్లు క్వారంటైన్‌లకే..**

కరోనా ప్రభావిత దేశాల నుంచి భారత్‌కు వచ్చిన అథ్లెట్లను నేరుగా క్వారంటైన్లకు తరలిస్తామని క్రీడా మంత్రి రిజిజు స్పష్టం చేశారు. ముఖ్యంగా చైనా, దక్షిణ కొరియా, ఇరాన్, ఇటలీ, స్పెయిన్, ఫ్రాన్స్, జర్మనీల నుంచి వచ్చిన వారు కేంద్ర మార్గదర్శకాలను పాటించాల్సిందేనన్నారు. విదేశాలనుంచి ఎవరు వచ్చినా కేంద్ర ఆదేశాలను పాటిస్తున్నారని, అథ్లెట్లు ఇందుకు మినహాయింపు కాదని తేల్చారు. ప్రస్తుతం జర్మనీలో ఉన్న చెస్ దిగ్గజం ఆనంద్ అక్కడే స్వీయ నిర్బంధంలో ఉండగా.. యూరప్‌లో తమ శిక్షణను ఆపేసి భారత్‌కు వచ్చిన వినేశ్ ఫొగట్, నీరజ్ చోప్రా కూడా కరోనా రిపోర్టుల్లో నెగెటివ్ వచ్చినా క్వారంటైన్‌లో ఉన్నారు.

**ఐపీఎల్ గురించి తేలేది 15 తర్వాతే..**

ఐపీఎల్ భవితవ్యం కూడా వచ్చే నెల 15నే తేలుతుందని మంత్రి రిజిజు తెలిపారు. '15తర్వాతే కేంద్రం నూతన మార్గదర్శకాలను విడుదల చేస్తుంది. క్రికెట్ ఒలింపిక్ క్రీడ కాదు. దీన్ని బీసీసీఐ చూసుకుంటుంది. అయితే, క్రికెట్ మ్యాచ్‌ల కోసం వేలాదిమంది వస్తుంటారు. కాబట్టి వారి ఆరోగ్యం అన్నింటికన్నా ముఖ్యం' అని రిజిజు అన్నారు.

కరోనా ఎఫెక్ట్

## ఇంటి నుంచే 'ఐఓఏ' విధులు

**న్యూఢిల్లీ:** భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధికారులను ఇంటి నుంచే విధులు నిర్వర్తించాల్సిందిగా సూచించారు. ఈ సోమవారం నుంచి ఇది అమల్లోకి రానుంది. ఇప్పటికే కరోనాతో ఐఓఏ తమ కార్యకలాపాలన్నీ రద్దు చేసుకుంది. ఇక ఇంటి నుంచి విధులు నిర్వర్తించే విషయంలో ఎలాంటి ఇబ్బంది రాకుండా ఏర్పాట్లు చేశామని ఐఓఏ సభ్యుడొకరు తెలిపారు. అయితే ఆర్థిక ఏడాది ముగింపు లెక్కలు ఉండడంతో ఆ శాఖకు సంబంధించిన ఉద్యోగులు మాత్రం రావాలని తెలిపింది. ఇప్పటికే బీసీసీఐ కూడా తమ సిబ్బందికి వర్క్ ఫ్రమ్ హోమ్ సౌకర్యాన్ని కల్పించింది.

## ఆన్‌లైన్‌లో రగ్బీ ఆటగాడి అంతిమ యాత్ర

**లండన్:** కరోనా భయంతో వేల్స్ మాజీ రగ్బీ ఆటగాడు మాథ్యూ జె వాట్కిన్స్ అంతిమ యాత్రను ఆన్‌లైన్‌లోనే వీక్షించే అవకాశం కల్పించనున్నారు. 41 ఏళ్ల మాథ్యూ పొత్తికడుపు కేన్సర్‌తో మరణించాడు. ఈ నెల 31న కార్డిఫ్‌లో భారీ ఎత్తున శవ యాత్ర నిర్వహించాలనుకున్నారు. కానీ, కరోనా ప్రబలిన నేపథ్యంలో కుటుంబ సభ్యులు, కొద్ది మంది ఆత్మీయుల సమక్షంలో జరిగే అంతిమ యాత్రను ఆన్‌లైన్‌లో ప్రసారం చేయనున్నారు. మాథ్యూ 14 ఏళ్ల కెరీర్‌లో వివిధ క్లబ్‌ల తరఫున 300 మ్యాచ్‌లు ఆడాడు. అతను 2011లో రిటైర్మెంట్ ప్రకటించాడు.



## టోక్యోకు ఒలింపిక్ జ్యోతి

**ఏథెన్స్:** ఒలింపిక్స్ వాయిదాపై ఊహాగానాలు ఎలా ఉన్నా నిర్వహణ కోసం జరిగే సంప్రదాయ కార్యక్రమాలు యథావిధిగా జరుగుతూనే ఉన్నాయి. కీలక ఘట్టమైన ఒలింపిక్ జ్యోతిని టోక్యో గేమ్స్ నిర్వాహకులకు గ్రీస్ అప్పగించింది. అయితే ఎంతో అట్టహాసంగా జరగాల్సిన ఈ ప్రక్రియ కొవిడ్-19 కారణంగా ప్రేక్షకులు లేకుండానే ఖాళీ స్టేడియంలో ముగించారు. 1896లో ఆధునిక ఒలింపిక్ గేమ్స్ జరిగిన స్టేడియంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో గ్రీస్ ఒలింపిక్ కమిటీ చీఫ్ స్పైరోస్ కాప్రలోస్ చేతుల మీదుగా జ్యోతిని టోక్యో గేమ్స్ ప్రతినిధి నవోకో ఇమోటో అందుకున్నారు. ఆ తర్వాత ప్రత్యేక విమానంలో శుక్రవారం టోక్యోకు చేరనుంది. అక్కడ ఈనెల 26న ఒలింపిక్ జ్యోతి రిలే ఆరంభమవుతుంది.

## విశ్వక్రీడలు ఆలస్యం కావచ్చు!

ప్రపంచ అథ్లెటిక్స్ చీఫ్ సెబాస్టియన్ కో

**లండన్:** కరోనా వైరస్ నేపథ్యంలో ఒలింపిక్స్ నిర్వహణపై రోజురోజుకూ సందేహాలు పెరుగుతూనే ఉన్నాయి. ఈ సందర్భంగా ప్రపంచ అథ్లెటిక్ సమాఖ్య అధ్యక్షుడు సెబాస్టియన్ కో మాట్లాడుతూ.. షెడ్యూల్ ప్రకారం ఒలింపిక్స్ జూలైలో కాకుండా ఆలస్యంగా జరిగే అవకాశం ఉందన్నాడు. అయితే ఇప్పుడే ఓ నిర్ణయానికి రాలేమన్నాడు. 'ప్రస్తుత పరిణామాల దృష్ట్యా గేమ్స్ ఆలస్యమయ్యే విషయాన్ని కొట్టివేయలేం. ఎందుకంటే ఇప్పుడు ఏదైనా సాధ్యమే. కానీ ఇప్పటికిప్పుడు ఏదో ఒక నిర్ణయం తీసుకునే స్థితిలో ఐఓసీ లేదు. మరోసారి సమావేశమై వాయిదాపై చర్చిస్తాం' అని టోక్యో ఒలింపిక్ గేమ్స్ కోఆర్డినేషన్ కమిషన్‌లో కూడా సభ్యుడైన సెబాస్టియన్ వివరించారు.

## వాయిదా వేస్తే మంచిది


గోపీచంద్

**న్యూఢిల్లీ:** కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికిస్తున్న నేపథ్యంలో టోక్యో ఒలింపిక్స్‌ను వాయిదా వేస్తే మంచిదని భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ అభిప్రాయపడ్డాడు. విశ్వక్రీడలను వాయిదా వేయాలన్న డిమాండ్ క్రీడా వర్గాల నుంచి బలంగా వినిపిస్తోంది. కానీ, ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే ఒలింపిక్స్ జరుగుతాయని ఆశిస్తున్నట్టు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) చెబుతోంది. 'విశ్వక్రీడలకు సంబంధించి కొన్ని అనుమానాలున్నాయి. మెగా టోర్నీకి ఇంకా సమయం ఉన్నా.. సన్నాహకాలను ఆరంభించాల్సిన సమయం ఇది. ప్రస్తుత పరిస్థితుల్లో అందరూ ఊపిరి పీల్చుకోవాలంటే ఐఓసీ తక్షణం ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలి. ప్రపంచ వ్యాప్తంగా ప్రయాణాలపై ప్రతిబంధకాలున్నాయి. ఆరోగ్య పరంగా భయానక వాతావరణం నెలకొంది. ఇలాంటి కఠిన పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ఆరోగ్యం, భద్రతను గురించే ఎక్కువగా ఆలోచిస్తున్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని ఒలింపిక్స్‌ను వాయిదా వేస్తే మంచిది' అని గోపీ చెప్పాడు.

## నవ్వులాటగా ఉందా?

**ఐఓసీపై కశ్యప్ ఆగ్రహం**

**న్యూఢిల్లీ:** ప్రపంచమంతా కొవిడ్-19 మహమ్మారితో వణికిపోతూ అన్ని కార్యక్రమాలను రద్దు చేసుకుంటుంటే.. అథ్లెట్లు ఒలింపిక్స్ శిక్షణను కొనసాగించాలంటూ అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) సూచించడంపై భారత స్టార్ షట్లర్ పారుపల్లి కశ్యప్ మండిపడ్డాడు. ప్రస్తుతం ఐఓసీ వ్యవహారం చూస్తుంటే నవ్వులాటలా కనిపిస్తోందంటూ వ్యంగ్యాస్త్రం విసిరాడు. ఓవైపు ప్రభుత్వం అన్ని శిక్షణా కేంద్రాలను మూసివేస్తే.. శిక్షణను కొనసాగించండంటూ ఐఓసీ చెప్పడంలో అర్థమేంటని కశ్యప్ ప్రశ్నించాడు.









*Printed and Published by* ***Koganti Venkata Seshagiri Rao*** *on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107,* ***Editor : K. Srinivas,*** *RNI No:3470/1960,* ***Managing Director : Vemuri Radha Krishna, Founder :*** *K.L.N. Prasad.*

epaper.andhrajyothy.com